www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

765 చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

తుది నోటిఫికేషన్ జారీ చేశాం 10

మిగతా చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్

అభ్యంతరాలను పరిశీలించి తదుపరి ప్రక్రియ

హెచ్‌ఎండీఏలో మొత్తం 3,342 చెరువులు

రక్షణకు చర్యలు.. హైకోర్టుకు ప్రభుత్వం వెల్లడి

శుక్రవారం | 3-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 276 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా. 11.40 తదుపరి పంచమి; నక్షత్రం: ధనిష్ఠ రా. 10.22 తదుపరి శతభిషం; వర్జ్యం: తె.5.16-6.48, దుర్ముహూర్తం: ఉ.9.01-9.45, మ.12.41-1.25, అమృతఘడియలు: మ.12.18-1.51; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.49, సూర్యాస్తమయం: 5.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంక్షల్లేని భరోసా!

ఎకరాల పరిమితి లేదు.. ఐటీ చెల్లింపుదారులకూ వర్తింపు



పంటలు వేసిన రైతులకే పథకం.. 14 నుంచి జమ!

రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలున్న భూములకు బంద్

భరోసా కోసం అన్నదాతలు దరఖాస్తు చేసుకోవాల్సిందే

పంటలు వేసినట్లు ధ్రువీకరించుకున్న తర్వాతే చెల్లింపులు

అవకతవకలకు అవకాశం లేకుండా శాటిలైట్ మ్యాపింగ్

5, 6, 7 తేదీల్లో గ్రామసభలు.. దరఖాస్తుల స్వీకరణ

కీలక అంశాలు ప్రతిపాదించిన మంత్రివర్గ ఉపసంఘం

రేపు నిర్వహించే క్యాబినెట్ భేటీలో తుది నిర్ణయం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకం కింద లబ్ధి పొందాలంటే రైతులు ఇక తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాల్సిందే! ఎన్ని ఎకరాల్లో పంటలు వేస్తే అన్ని ఎకరాలను ఆ దరఖాస్తులో పొందుపర్చాలి! ఉదాహరణకు పదెకరాలున్న రైతు, ఏడెకరాల్లో పంటలు వేస్తే ఆ వివరాలే పొందుపర్చాలి! పంటలు వేసినట్లుగా ధ్రువీకరించుకున్న తర్వాతే రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. ఇన్ని ఎకరాలకు మాత్రమే పెట్టుబడి సాయం అంటూ రైతుభరోసాపై ఎలాంటి పరిమితి విధించే అవకాశాలు కనిపించడం లేదు. అయితే దున్నేవారికి మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించింది. అవకతవకలకు అవకాశం లేకుండా ఉండేందుకు సాగు చేసిన పంటలను శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తించాలనీ ప్రతిపాదించింది. ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రైవేటు ఉద్యోగులైనా, ఆదాయపు పన్ను చెల్లింపుదారులైనా పంటలు సాగుచేస్తే పెట్టుబడి సాయాన్ని అందించాలని ప్రతిపాదించారు. గురువారం సచివాలయంలో మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి సమావేశమై ఈమేరకు కీలక ప్రతిపాదనలు చేశారు. శనివారం (4వ తేదీ) నిర్వహించనున్న క్యాబినెట్ భేటీలో ఈ ప్రతిపాదనలపై చర్చించి.. రైతుభరోసా పథకం విధి విధానాలను అధికారికంగా ప్రకటించనున్నారు. బీడు భూములు, కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న భూములకు రైతుభరోసా ఇవ్వరు! ఈనెల 5, 6, 7 తేదీల్లో క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి

మిగతా 13వ పేజీలో...

ఉచితంగా సన్న బియ్యం!

13

2.81 కోట్ల మంది రేషన్ కార్డుదారులకు వర్తింపు

ఈ దిశగా ఆలోచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రస్తుతం ఇస్తున్న బియ్యం ధర కిలో రూపాయి

తినేది 15 శాతం.. అమ్ముకుంటున్న మిగతావారు

తినడానికి తగిన బియ్యం ఇస్తే అక్రమాలకు చెక్

రేపటి మంత్రివర్గ సమావేశంలో చర్చించే చాన్స్

కొత్త కార్డులపైనా నిర్ణయం వెలువడే అవకాశం



రెవెన్యూ సంఘాల డైరీని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బ్రాండ్‌గా తెలంగాణ!

ట్రాఫిక్ నుంచి డ్రగ్స్, గంజాయి నియంత్రణ వరకూ

అన్నింట్లో మన రాష్ట్రం ప్రత్యేకతను చాటాలి

ఠాణాకో క్యూఆర్ కోడ్.. స్కాన్ చేసి ఫిర్యాదులు

వాటిని క్రోడీకరించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది

పేదలైనా, ధనికులైనా చట్టం, న్యాయం ఒకేలా ఉండాలి

ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ టెక్నాలజీని వాడాలి

ఒకే గొడుగు కిందకు హైడ్రా, జీహెచ్‌ఎంసీ, జలమండలి

ప్రభుత్వంపై ప్రజలకు ఒక భరోసాను కల్పించాలి

పోలీసు ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్లలోని సిబ్బంది పనితీరు, వ్యవహార శైలిపై ఎప్పటికప్పుడు నివేదికలు సేకరించాలి. ఇందుకోసం ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక 'క్యూఆర్' కోడ్ ఇవ్వాలి. ఫిర్యాదు చేయడానికి ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వెళ్లారని అనుకుందాం. అప్పుడు అక్కడి సిబ్బంది వారితో వ్యవహరించిన విధానాన్ని తెలిపేందుకు ఈ క్యూఆర్ కోడ్ ఉపయోగపడనుంది. దానిని స్కాన్ చేయగానే.. ఫోన్‌లోనే పలు ప్రశ్నలతో కూడిన ఒక పేజీ రావాలి. సంబంధిత వ్యక్తులు తమ అభిప్రాయాన్ని అందులో నమోదు చేస్తారు. ఇలా వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి, వాటిపై ప్రభుత్వం ఒక నిర్ణయం.. ఆపై చర్యలు తీసుకుంటుంది" అంటూ పోలీసు శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. న్యాయం విషయంలో పేద, ధనిక అనే తేడా లేకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పేదవారైనా, ధనికులైనా

మిగతా 13వ పేజీలో...



మీ అవినీతి చూస్తే సిగ్గేస్తోంది!

ఏసీబీకి పట్టిస్తా.. సంగతి చూస్తా!

ఎన్నిసార్లు చెప్పినా మారరా?

సస్పెండ్ చేస్తే మళ్లీ 4 నెలల్లో

చేరొచ్చనుకుంటున్నారేమో..

అలాంటి ఆటలు సాగనివ్వను!

అవినీతి సొమ్మునంతా కక్కిస్తా

రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు

మంత్రి పొంగులేటి హెచ్చరిక

13

'నార్త్ సిటీ మెట్రో' మార్గంలో..

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు

ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లలో మార్పులు

శామీర్‌పేట మార్గంలో 12.1 కిలోమీటర్లు

నాగపూర్ మార్గంలో దాదాపుగా 4 కి.మీ.

పునాది నుంచి పిల్లర్ల దాకా నిర్మాణం

హెచ్‌ఎండీఏ, హెచ్‌ఎంఆర్ఎల్‌దే!

గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు

నాడు కేంద్ర సహకారం లేక బుట్టదాఖలు



డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు హెచ్‌ఎండీఏ రూపకల్పన చేసిన డిజైన్

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర కానుకగా మేడ్చల్, శామీర్‌పేట వరకూ మెట్రో పొడిగింపు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర సర్కారు.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేందుకు ఇప్పటికే నిర్ణయించిన ఎలివేటెడ్ కారిడార్లను డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లుగా మార్పు చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా హెచ్‌ఎండీఏ.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించింది. ఈమేరకు.. శామీర్‌పేట మార్గంలో 12.1 కిలోమీటర్ల మేర.. కండ్లకోయ మార్గంలో సుమారు 4 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. కొత్త డిజైన్ ప్రకారం.. కింద రోడ్డు, ఆ తర్వాత ఫ్లైఓవర్, ఆ పై మెట్రో రానుంది. దేశంలో ఒక్క నాగపూర్‌లో మాత్రమే ఈ తరహా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ఉంది. నిజానికి గత ప్రభుత్వ హయాంలోనే ఈ మార్గాల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల ప్రతిపాదనలు వచ్చాయి. అయితే, అందుకు ఆ మార్గంలో రక్షణ శాఖకు సంబంధించిన 150.414 ఎకరాల స్థలం

మిగతా 12వ పేజీలో...



ఇదేం ఫార్ములా?

సంబంధం లేకుండా ఒప్పందం.. నిబంధనలు పాటించకుండా చెల్లింపులు

ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణకు త్రైపాక్షిక ఒప్పందం

ప్రభుత్వ బాధ్యత కేవలం సివిల్ పనుల నిర్వహణే

ఎఫ్ఈవోకు చెల్లింపులు చేయాల్సింది స్పాన్సరర్

నష్టాలు వస్తున్నాయంటూ పక్కకి తప్పుకొన్న ఏస్ నెక్స్ట్ జెన్

సంబంధం లేకపోయినా.. ఆ బాధ్యత నెత్తికెత్తుకున్న సర్కారు

సంబంధమే లేని హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి 46 కోట్లు

ఆర్థిక శాఖ, క్యాబినెట్ ముద్ర లేకుండా డాలర్లలో చెల్లింపులు

ఆర్బీఐ అనుమతి తప్పనిసరి.. అది లేకుండానే నిధుల బదిలీ

త్రైపాక్షిక ఒప్పందానికి నాలుగు నెలల ముందే పుట్టిన కంపెనీ

గ్రీన్ కో డైరెక్టర్లు ప్రమోటర్లు.. పెయిడప్ క్యాపిటల్ 2 లక్షలే

క్రీడలు, ఫార్ములా ఈతో సంబంధం లేకుండానే ఆ బాధ్యతలు

అడుగడుగునా ఉల్లంఘనలు.. వాటిపైనే ఏసీబీ దృష్టి

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మీకు రెండు ఎకరాల ఖాళీ స్థలం ఉంది! అందులో ఎగ్జిబిషన్ పెట్టుకుంటానని ఓ వ్యక్తి వచ్చాడు! భూమిని చదును చేసి ఇవ్వాలని షరతు పెట్టాడు! మీ ఇద్దరి మధ్య మరో వ్యక్తి వచ్చాడు! ఎగ్జిబిషన్‌కు అయ్యే ఖర్చు తాను భరిస్తానని, లాభనష్టాలకు తనదే బాధ్యతని చెప్పాడు. ఇందులో భాగంగా ఎగ్జిబిషన్ పెట్టుకున్న వ్యక్తికి నిర్దిష్ట మొత్తం చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. ఈ మేరకు ముగ్గురూ ఒప్పందం చేసుకున్నారు. నాలుగు రోజులు గడిచింది! మధ్యలో వచ్చిన వ్యక్తి నష్టం వస్తోందంటూ వెళ్లిపోయాడు. భూమిని ఇవ్వడమే కాకుండా అప్పుడు ఆ వ్యక్తి చెల్లించాల్సిన డబ్బులను కూడా మీరే చెల్లిస్తారా!? మీ జేబులో డబ్బులు కాకుండా మీ దగ్గర ఉన్నాయని మీ ఇంటి పక్క వ్యక్తి డబ్బులు ఇచ్చేస్తారా!? ఎగ్జిబిషన్ ప్రచారానికి సంబంధించి ఏమాత్రం అనుభవం లేని వ్యక్తితో మీరు ఒప్పందం చేసుకుంటారా!? చేసుకోరు కదా.. కానీ, ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది అచ్చంగా ఇదే!! ఫార్ములా ఈ-కారు రేసును హైదరాబాద్‌లో నాలుగు విడత (9, 10, 11, 12 సెషన్లలో)ల్లో నిర్వహించడానికి పురపాలక శాఖ, ఫార్ములా ఈ ఆర్గనైజేషన్ (ఎఫ్ఈవో) ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం పురపాలక శాఖ పాత్ర చాలా పరిమితం. రేస్ ట్రాక్ నిర్మించడం, ఇతర సివిల్ పనులు మాత్రమే పురపాలక శాఖ బాధ్యత. ఈ-కారు రేస్‌ను నిర్వహించేది ఫార్ములా ఈ ఆర్గనైజేషన్. తాను ప్రమోటర్‌గా ఉంటానని, అందుకయ్యే వ్యయాన్ని ఎఫ్ఈవోకు

మిగతా 3వ పేజీలో...

ఈడీ విచారణకు బీఎల్ఎన్ రెడ్డి డుమ్మా

కొంత సమయం కావాలంటూ ఈ-మెయిల్

నేటి విచారణకు రాలేనన్న అరవింద్‌కుమార్

మరోసారి పిలుస్తామని ఈడీ జవాబు 3



సెకనుకు 100 జీబీ డేటా!

2

6జీ రేసులో మస్క్ కంపెనీ

స్టార్‌లింక్‌ను దాటేసిన చైనా

జిలిన్ నుంచి గ్రౌండ్‌స్టేషన్‌కు

డేటా పంపిన చాంగ్‌గ్వాంగ్

తెలుగు తేజాలకు అర్జున

స్ప్రింటర్ జ్యోతి, పారా రన్నర్ దీప్తికి పురస్కారాలు

గుకేష్, మను భాకర్‌లకు ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న

హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్, పారాజంపర్ ప్రవీణ్‌కూ..

జాతీయ క్రీడా పురస్కారాల్ని ప్రకటించిన కేంద్రం

మొత్తం 32 మందికి అర్జున.. 17న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి ముర్ము 11

దీప్తికి సీఎం రేవంత్ అభినందనలు



గుకేష్



మను భాకర్

తెలంగాణ పారా రన్నర్ దీప్తి జీవాంజి, ఏపీకి చెందిన స్ప్రింటర్ జ్యోతి యర్రాజిలను దేశ రెండో అత్యుత్తమ క్రీడా పురస్కారం 'అర్జున' వరించింది. చెస్ కింగ్ గుకేష్, పిస్టల్ రాణి మను భాకర్, హాకీ సారథి హర్మన్‌ప్రీత్ సింగ్, పారా హైజంపర్ ప్రవీణ్ కుమార్‌లను 'ఖేల్‌రత్న' అవార్డుకు కేంద్రం ఎంపిక చేసింది.



దీప్తి



జ్యోతి



న్యూ ఆర్లిన్స్‌లో దుండగుడు దాడికి వాడిన కారు

దాడుల వెనక ఐఎస్?

అమెరికా న్యూ ఆర్లిన్స్ ఘటన దుండగుడు

జబ్బార్ కారులో ఇస్లామిక్ స్టేట్ జెండా

నిర్ధారించిన అధ్యక్షుడు జో బైడెన్, ఎఫ్‌బీఐ

ఘటనలో 15కు చేరిన మృతుల సంఖ్య

లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ వద్ద కారు

2 బాంబు పేలుడు, ఒకరి మృతి

రెండు ఘటనలకు సంబంధం!: మస్క్

న్యూయార్క్‌లో కాల్పులు.. 11 మందికి గాయాలు

కర్రతో చితక్కొట్టి.. ఆపై ఉరివేసి

1 నడిరోడ్డుపై భర్తను హత్య చేసిన భార్య

1 మద్యానికి బానిసై తీవ్రంగా వేధిస్తున్నందుకే..

1 ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో ఘటన

1 వీడియో వైరల్ కావడంతో తీవ్ర సంచలనం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యానికి బానిసైన భర్త వేధింపులకు ఆ మహిళ విసిగిపోయింది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తానే తుది తీర్పు ఇచ్చింది. భర్తను కర్రతో చితక్కొట్టి.. ఆపై నడిరోడ్డుపై ఉరివేసి చంపేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. కేసు వివరాల ప్రకారం.. ఏపీలోని బాపట్ల జిల్లా అడవుల దీవి ఠాణా పరిధిలోని కొత్తపాలేనికి చెందిన అరుణతో గోకర్ణమఠం గ్రామానికి చెందిన అమరేంద్రబాబుకు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమరేంద్ర మద్యానికి బానిసై నిత్యం భార్య అరుణను వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో కుటుంబ పెద్దల సమక్షంలో

మిగతా 14వ పేజీలో...



సుదీర్ఘకాలం విచారణా?

దర్యాప్తు పేరుతో నిందితుల స్వేచ్ఛను అడ్డుకోలేం

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

4 నెలల్లో దర్యాప్తు పూర్తవుతుంది: ప్రభుత్వ లాయర్

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అదనపు ఎస్పీ తిరుపతన్న బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో తిరుపతన్న పాత్రపై సుదీర్ఘకాలంపాటు దర్యాప్తు కొనసాగడం సరికాదని తెలిపింది. దర్యాప్తు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను అడ్డుకోలేమని పేర్కొంది. ఫోన్ ట్యాపింగ్

మిగతా 14వ పేజీలో...

ప్రార్థనా స్థలాల చట్టాన్ని అమలు చేయండి

సుప్రీంలో ఒవైసీ పిటిషన్.. స్వీకరించిన సీజేఐ బెంచ్ 2

సెకనులో 100 జీబీ డేటా!

6జీ రేసులో మస్క్ కంపెనీ స్టార్‌లింక్‌ను దాటేసిన చైనా

- జిలిన్ శాటిలైట్ నుంచి గ్రౌండ్ స్టేషన్‌కు డేటా ట్రాన్స్‌మిట్ చేసిన 'చాంగ్ గ్వాంగ్' సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 2: అత్యంత వేగంగా డేటాను సరఫరా(ట్రాన్స్‌మిట్) చేయడంలో చైనా కీలక ముందడుగు వేసింది. ఈ విషయంలో స్పేస్ ఎక్స్‌కు చెందిన స్టార్‌లింక్‌ను అధిగమించినట్లు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' తెలిపింది. చైనాకు చెందిన చాంగ్ గ్వాంగ్ శాటిలైట్ టెక్నాలజీ సెకనుకు 100 గిగాబైట్ల డేటాను ట్రాన్స్‌మిట్ చేసేలా అత్యాధునిక హైరిజల్యూషన్ స్పేస్ టు గ్రౌండ్ లేజర్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా జిలిన్-1 ఉపగ్రహం నుంచి ట్రక్‌పై అమర్చిన గ్రౌండ్ స్టేషన్‌కు ఈ డేటాను సెకనులోనే పంపించింది. ఇది గత రికార్డు కంటే దాదాపు 10 రెట్ల వేగంతో ప్రయాణించింది. చాంగ్ గ్వాంగ్ సంస్థ లేజర్ గ్రౌండ్ కమ్యూనికేషన్ల అధిపతి వాంగ్ హాంగ్‌హాంగ్ మాట్లాడుతూ.. స్టార్‌లింక్ 6జీ టెక్నాలజీని అభివృద్ధి చేస్తోందన్నది అధికారిక సమాచారం కాదని చెప్పారు. ఈ విషయంలో తమ టెక్నాలజీ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీని అధిగమించేసిందన్నారు. "మస్క్‌కు చెందిన స్టార్‌లింక్.. లేజర్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఆవిష్కరించింది. కానీ, దాన్ని శాటిలైట్ టు గ్రౌండ్ కమ్యూనికేషన్‌కు ఇప్పటి వరకు వాడలేదు. వారి వద్ద ఈ టెక్నాలజీ ఉండొచ్చు. కానీ, మేం ఇప్పటికే భారీ స్థాయిలో వినియోగించడం మొదలుపెట్టాం" అని వెల్లడించారు. ఈ కంపెనీ జిలిన్-1 శ్రేణిలోని ఉపగ్రహాలను 2027 నాటికి పూర్తిగా కక్ష్యలోకి చేర్చనుంది. 100 జీబీపీఎస్ డేటా అంటే.. 10 పూర్తిస్థాయి సినిమాల పరిమాణంలో ఉంటుంది. దీన్ని చైనా సంస్థ ఒక్క సెకన్‌లో సరఫరా చేయగలిగింది. గతంలో అమెరికాకు చెందిన మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నాసాకు చెందిన టెరాబైట్ ఇన్‌ఫ్రారెడ్ డెలివరీ సిస్టమ్స్ సంస్థ కూడా 100 జీబీపీఎస్ ట్రాన్స్‌మిట్ చేసింది. అయితే తమ సంస్థ పేలోడ్ చాలా పెద్దదని చాంగ్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 5జీ కమ్యూనికేషన్ వాడుకలో ఉంది. దీనికి ఆధునిక వెర్షన్ 6జీ. దీన్ని అత్యధిక ఫ్రీక్వెన్సీ బ్యాండ్ల వద్ద వినియోగిస్తారు. తాజాగా చైనా 5జీ ఆధారిత అత్యాధునిక మొబైల్ స్టేషన్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. ఇది యుద్ధ వాతావరణంలో కూడా మూడు కిలోమీటర్ల పరిధిలో 10,000 మంది వరకు అత్యంత సురక్షితంగా, వేగంగా డేటాను పంపిస్తుంది. దీన్ని చైనా మొబైల్ కమ్యూనికేషన్స్ గ్రూప్, ఆ దేశ ఆర్మీ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.





చెదురుతున్న అమెరికా కలలు!

- 97వేల మంది భారతీయ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం
- హెచ్-1బీ వీసాకు కీలకమైన ఓపీటీపై అమెరికన్ల నిరసనలు

న్యూఢిల్లీ, జనవరి 2: అమెరికా చదువులు ఉద్యోగ భరోసాకు, శాశ్వత నివాసానికి బాటలు వేస్తాయన్న ధీమా క్రమంగా బలహీనపడుతోంది. హెచ్-1బీ వీసా జారీకి కీలకమైన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగామ్‌పై అమెరికన్లలో పెరుగుతున్న వ్యతిరేకత విదేశీ విద్యార్థులపై ప్రత్యేకించి భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఓపీటీని రద్దు చేయాలని 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' మద్దతుదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమం అమెరికన్ల ఉద్యోగాలను విదేశీ విద్యార్థులు పొందడానికి అనుమతించే లొసుగని మండిపడుతున్నారు. ఓపీటీ రద్దుపై రాబోయే ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అమెరికాలో చదువుతున్న 97వేల మందికి పైగా భారతీయ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12 నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. స్టెమ్ (ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని అదనంగా మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ పని అనుభవం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. నైపుణ్యం కలిగిన విదేశీయులు మరో ఆరేళ్ల పాటు అమెరికాలో ఉండటానికి ఈ వీసా అనుమతిస్తుంది.

ప్రేమ కోసమై 'జైలు పాలాయనే'..

- ప్రియురాలి కోసం అక్రమంగా పాక్ వెళ్లిన వ్యక్తి అరెస్టు

లహోర్, జనవరి 2: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన పాక్ యువతి కోసం దేశ సరిహద్దులు దాటి జైలు పాలయ్యాడో భారతీయ యువకుడు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన బాదల్ బాబు అనే వ్యక్తికి కొన్ని రోజుల క్రితం పాకిస్థాన్‌లోని లాహోర్‌కు చెందిన సనా రాణి అనే యువతి ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. చాలా రోజుల నుంచి మెసేజ్‌లు, ఫోన్ల ద్వారా ప్రేమాయణం నడిపిన వీరు కలవాలని నిర్ణయించుకున్నారు. తన వద్ద వీసా, పాస్‌పోర్టు లేకపోయినా ప్రేయసి కోసం గతంలో రెండుసార్లు పాక్ వెళ్లేందుకు బాబు విఫలయత్నం చేశాడు. అయినా పట్టువదలని బాబు.. ఇటీవల అక్రమంగా దేశసరిహద్దు దాటి పాక్‌లోని బహౌద్దీన జిల్లాకు చేరుకున్నాడు. ఈ క్రమంలో రాణి, బాబు ఓ ప్రదేశంలో కలుసుకొని మాట్లాడుకుంటుండగా పోలీసులకు అనుమానం వచ్చి అతన్ని ప్రశ్నించారు. బాబు వద్ద సరైన పత్రాలు లేవని తెలుసుకున్న అధికారులు అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో విచారణ జరిపిన సదరు కోర్టు బాబుకు 14 రోజుల రిమాండ్ విధించింది. అయితే అమ్మాయిని పోలీసులు విచారించగా.. బాబును పెళ్లి చేసుకోడం ఇష్టంలేదని చెప్పడం కొసమెరుపు.

కర్ణాటక ఆర్టీసీకి 'ఉచితం' దెబ్బ?

- బస్సు చార్జీలు 15 శాతం పెంపు
- కర్ణాటక మంత్రివర్గం ఆమోదం

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'శక్తి' గ్యారెంటీ ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌలభ్యాన్ని కల్పిస్తున్న కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం... ఇతర ప్రయాణికులపై భారం మోపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని నాలుగు ఆర్టీసీ కార్పొరేషన్‌లు చార్జీల పెంపునకు చేసిన ప్రతిపాదనలను గురువారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఏకంగా 15 శాతం చార్జీలను పెంచేందుకు అనుమతించింది. ఈ నెల 5వ తేదీ నుంచి కొత్త చార్జీలు అమలులోకి రానున్నాయి. 2016తో పోల్చితే ఆర్టీసీపై రోజువారీ డీజిల్ భారం రూ.9.16 కోట్ల నుంచి రూ.13.2 కోట్లకు పెరిగిందని... చార్జీల పెంపుతో ఆర్టీసీ కార్పొరేషన్లకు నెలకు రూ.74.85 కోట్ల ఆదాయం అదనంగా వస్తుందని ప్రభుత్వం తెలిపింది. కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం 'శక్తి' కోసం కర్ణాటక ప్రభుత్వం ప్రతి నెలా రూ.417 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ పథకం యథాతథంగా కొనసాగిస్తామని మంత్రి హెచ్‌కే పాటిల్ పేర్కొన్నారు. అయితే... తాజా పెంపుపై విపక్షాలు మండిపడుతున్నాయి. 'ఒకే కుటుంబంలో భార్యకు ఉచిత ప్రయాణం! భర్తపై అదనపు భారం. ఇదేనా మీ పథకం' అని విమర్శిస్తున్నాయి.

ప్రార్థనా స్థలాల చట్టంపై ఒవైసీ పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రార్థనా స్థలాల చట్టం-1991ని అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ప్రార్థనా స్థలాల చట్టంపై గతంలో జమేతా ఉలేమా ఎ హింద్ దాఖలు చేసిన పిటిషన్‌తో దీన్ని జత చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఒవైసీ డిసెంబర్ 17న సమర్పించిన ఈ పిటిషన్ గురువారం సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఒవైసీ తరఫు న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపిస్తూ ప్రార్థనా స్థలాల చట్టంపై ఇప్పటికే కోర్టులో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, అందువల్ల తమ పిటిషన్‌ను కూడా వాటితో జత చేయాలని కోరారు. అందుకు సీజేఐ అంగీకరించారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 17కు వాయిదా పడింది.

అమెరికాలో దాడుల వెనక ఐఎస్?

న్యూ ఆర్లిన్స్ ఘటన నిందితుడి కారులో ఇస్లామిక్ స్టేట్ జెండా.. నిర్ధారించిన అమెరికా అధ్యక్షుడు బైడెన్

- 15కు చేరిన మృతుల సంఖ్య
- దుండగుడు జబ్బార్ మాజీ సైనికుడే
- లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ వద్ద.. కారు బాంబు పేలుడు, ఒకరి దుర్మరణం



నిందితుడు షంషుద్దీన్ జబ్బార్; దాడికి ఉపయోగించిన ట్రక్కు

న్యూయార్క్, జనవరి 2: ట్రంప్ సర్కారు కొలువుదీరే వేళ.. ప్రజలంతా కొత్త సంవత్సరం వేడుకల్లో మునిగి ఉండగా.. అమెరికాలో ఉగ్రవాద ఘటనలు కలకలం రేపుతున్నాయి. వరుస ఘటనలతో అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున న్యూ ఆర్లిన్స్‌లో.. ఐఎస్ ఉగ్రవాద సంస్థ నుంచి ప్రేరణ పొందిన మాజీ సైనికుడు షంషుద్దీన్ జబ్బార్ ట్రక్కుతో దాడి చేసి 15 మందిని పొట్టనబెట్టుకోగా.. లాస్ వెగాస్‌లోని ట్రంప్ హోటల్ సమీపంలో కారు బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. న్యూయార్క్ క్వీన్స్‌కౌంటీలో.. అమజురా నైట్‌క్లబ్‌లో కాల్పుల ఘటన నమోదైంది. ఇక్కడ 11 మందికి గాయాలయ్యాయి.

మాజీ సైనికుడే ఉగ్రవాది!

న్యూ ఆర్లిన్స్ ఘటనలో నిందితుడిని షంషుద్దీన్ జబ్బార్(42)గా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) అధికారులు గుర్తించారు. అతణ్ని పోలీసులు కాల్చి చంపగా.. ఘటనకు ఉపయోగించిన కారులో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) జెండా, పేలుడు పదార్థాలున్నట్లు నిర్ధారించారు. అతను ఒంటరి తోడేలు(లోన్ వోల్ఫ్) దాడి చేసి ఉంటాడని భావిస్తున్నారు. టెక్సస్‌కు చెందిన జబ్బార్ అమెరికా పౌరుడు కాగా.. అతను యుక్తవయసులోనే ఇస్లాం మతాన్ని స్వీకరించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. 2005-15 మధ్య కాలంలో అమెరికా సైన్యంలో మానవ వనరులు-సమాచార విభాగంలో మేనేజర్‌గా పనిచేశాడు. 2009లో ఆఫ్ఘానిస్థాన్‌లో కూడా విధులు నిర్వర్తించాడు. 2015-20 మధ్యకాలంలో ఆర్మీ రిజర్వ్‌లో ఐటీ నిపుణుడిగా సేవలందించాడు. గత ఏడాది నౌకాదళంలో చేరేందుకు జబ్బార్ పేరు ఖరారైనా.. బూట్ క్యాంప్ వెళ్లకపోవడంతో తొలగించారు. 2021 నుంచి అతను డెలాయిట్ ఆడిటింగ్ సంస్థలో ఏటా 1.2 లక్షల డాలర్ల వేతనంతో సీనియర్ సొల్యూషన్ స్పెషలిస్టుగా పనిచేశాడు. జబ్బార్‌కు గత నేర చరిత్ర కూడా పెద్దగా లేదని.. 2014లో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన రికార్డు మాత్రం ఉందని.. 2002లో హారిస్‌కౌంటీలో ఓ చిల్లర దొంగతనం కేసులో 9 నెలలపాటు కమ్యూనిటీ సూపర్‌విజన్ శిక్షను అనుభవించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. అతనికి రెండు పెళ్లిళ్లవ్వగా.. విడాకులు తీసుకున్నాడని, రెండో భార్య కేసులో తాను పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినట్లు, తన రియల్‌ఎస్టేట్ కంపెనీ కూడా నష్టాల్లో ఉందని లాయర్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ వైపు ఆకర్షితుడై 'చంపడం' అనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు ఎఫ్‌బీఐ గుర్తించిందని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మీడియాకు చెప్పారు. ఘటనకు ముందు అతను సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియోను పోస్టు చేశాడని, ఎఫ్‌బీఐ కూడా దాడిపై తనకు ముందుగానే సమాచారం ఇచ్చిందని వివరించారు. 'టూరో' అనే యాప్ సాయంతో ఫోర్డ్ ఎఫ్-150లైటెనింగ్ అనే భారీ ఎలక్ట్రిక్ పికప్ ట్రక్కును అద్దెకు తీసుకున్నాడని, ఆ వాహనంతోనే న్యూ ఆర్లిన్స్‌లో దారుణానికి ఒడిగట్టాడని గుర్తించామన్నారు. ఈ ఘటనలో బుధవారం 10 మంది చనిపోగా.. గురువారానికి మృతుల సంఖ్య 15కు పెరిగినట్లు తెలిపారు. మరోవైపు.. లాస్ వెగాస్‌లోని డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన ఇంటర్నేషనల్ హోటల్ వెలుపల టెస్లా సైబర్ ట్రక్ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు చనిపోగా.. ఏడుగురు గాయపడ్డారు. కారులో ఉన్న పేలుడు పదార్థాల కారణంగా ఈ ఘటన జరిగిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. అయితే.. న్యూ ఆర్లిన్స్, లాస్ వెగాస్ సంఘటనలకు సంబంధం ఉండి ఉంటుందని స్పేస్ ఎక్స్ చీఫ్ ఈలాన్ మస్క్ అనుమానం వ్యక్తం చేశారు. ఈ రెండు ఘటనల్లోనూ దుండగులు 'టూరో' నుంచి వాహనాలను అద్దెకు తీసుకున్నట్లు గుర్తుచేశారు. కాగా, లాస్ వెగాస్ ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే.. ఫ్రీమాంట్ స్ట్రీట్‌లో ఓ దుండగుడు హల్‌చల్ చేశాడు. ఓ బస్సులో తనను తాను బంధించుకున్న దుండగుడి వద్ద పేలుడు పదార్థాలున్నట్లు పోలీసులు అనుమానించారు. న్యూ ఆర్లిన్స్ తరహాలో దాడికి దుండగుడు కుట్రపన్ని ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా, న్యూయార్క్‌లో మరోమారు కాల్పుల కలకలం నెలకొంది. గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బుధవారం రాత్రి క్వీన్‌కౌంటీలోని అమజురా నైట్‌క్లబ్‌లో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 11 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

దాడిని ఖండించిన ప్రధాని మోదీ

అమెరికాలోని న్యూ ఆర్లిన్స్‌లో జరిగిన ఉగ్రదాడిని భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు.

క్యాన్సర్‌కు హైడ్రోజెల్ చికిత్స

- ఐఐటీ గువాహటి పరిశోధకుల ఆవిష్కరణ
- ఎలుకల్లో ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ, జనవరి 2: ఐఐటీ గువాహటికి చెందిన పరిశోధకులు క్యాన్సర్‌కు ఓ వినూత్న చికిత్సను అభివృద్ధిపరిచారు. క్యాన్సర్ సోకిన భాగంలోకి ఒక హైడ్రోజెల్‌ను పంపించటం ద్వారా ఈ చికిత్స అందిస్తారు. దీనివల్ల ప్రస్తుతం కీమోథెరపీ వంటి క్యాన్సర్ చికిత్సల కారణంగా తలెత్తే దుష్పరిణామాలు ఉండవని, ఇది సురక్షితమైనదని పరిశోధకులు వెల్లడించారు. కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన ఈ పరిశోధన తాలూకు వివరాలు.. రాయల్ సొసైటీ కెమిస్ట్రీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఐఐటీ గువాహటి రసాయనశాస్త్రం విభాగానికి చెందిన ప్రొఫెసర్ దేబప్రతిమ్‌దాస్ ఈ పరిశోధన గురించి వెల్లడిస్తూ.. 'అంతర్గత అవయవాలకు క్యాన్సర్ వచ్చినప్పుడు ఆ అవయవాలను శస్త్రచికిత్స చేసి తొలగించటం కుదరదు. అలాగే, కీమోథెరపీ వల్ల క్యాన్సర్ కణాలతోపాటు ఆరోగ్య కణాలు కూడా దెబ్బతింటాయి. వీటికి పరిష్కారంగా.. క్యాన్సర్ ఉన్న భాగంలోకి మాత్రమే ఔషధాన్ని తీసుకెళ్లే విధంగా హైడ్రోజెల్‌ను రూపొందించాం. క్యాన్సర్ కణితి ఉన్న ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా హైడ్రోజెల్ నియంత్రిత విధానంలో ఔషధాన్ని విడుదల చేస్తుంది. అల్ట్రాషార్ట్ పెప్టైడ్స్‌తో రూపొందే హైడ్రోజెల్ జీవద్రవ్యాల్లో కరిగిపోకుండా స్థిరంగా నిలిచి ఉంటుంది కాబట్టి ఔషధాన్ని అందించటంలో ఎటువంటి అంతరాయం ఉండదు' అని తెలిపారు. ప్రీ క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా ఎలుకల్లో రొమ్ము క్యాన్సర్‌కు ఈ చికిత్సను పరీక్షించగా.. 18 రోజుల్లోనే కణితి సైజు 75% మేర తగ్గిపోయిందని దాస్ వెల్లడించారు. ఇతర రకాల క్యాన్సర్లలో కూడా ఈ చికిత్సను ఉపయోగించటంపై అధ్యయనం జరుపుతున్నామని, దాని తర్వాత క్లినికల్ ట్రయల్స్‌కు దరఖాస్తు చేసుకుంటామని ఆయన తెలిపారు.

బాబాయ్,అబ్బాయ్ మధ్య సయోధ్య!

- పవార్‌లు కలవాలని కోరుతున్న అజిత్ తల్లి
- శరద్ పవార్ మాకు దేవుడు: ప్రఫుల్ పటేల్





ముంబై, జనవరి 2: మహారాష్ట్ర ఎన్‌సీపీలోని వైరివర్గాలు ఒక్కటి కాబోతున్నాయా? కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు బాబాయి శరద్ పవార్, అబ్బాయి అజిత్ పవార్ విభేదాలు మరచి రాజీపడబోతున్నారా..? అజిత్ తల్లి ఆశా తాయి, ఆయన వర్గం ఎన్‌సీపీ అగ్రనేత ప్రఫుల్ పటేల్ వ్యాఖ్యలు ఈ సంకేతాలే ఇస్తున్నాయి. ఆశా తాయి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం పండరీపురంలో పాండురంగ విఠలుడి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. బాబాయి, అబ్బాయి తిరిగి కలవాలని, కుటుంబంలో సమస్యలన్నీ తీరిపోవాలని పాండురంగడిని వేడుకున్నానని తెలిపారు. ఆ దేవుడు తన కోరికలు నెరవేరుస్తాడని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ప్రఫుల్ పటేల్ గడ్చిరోలిలో విలేకరులతో మాట్లాడారు. 'ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ మాకు దేవుడిలాంటివారు. మా అందరికీ తండ్రిలాంటివారు. గత నెలలో ఆయన జన్మదినం సందర్భంగా మేం ఆయన్ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాం కూడా. అయితే అది రాజకీయ భేటీ కాదు. మేం భిన్న రాజకీయ వైఖరి తీసుకున్నప్పటికీ శరద్ పవార్‌పై అత్యున్నత గౌరవం ఉంది. పవార్ కుటుంబం ఒక్కటైతే మేమంతా సంతోషిస్తాం. నన్ను నేను వారి కుటుంబ సభ్యుడిగానే భావిస్తున్నాను. ఇద్దరూ తిరిగి కలిస్తే ఎవరూ అగౌరవంగా భావించాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. 2023 జూలైలో ఎన్‌సీపీని చీల్చి అజిత్ పవార్ 40 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ-శిండే శివసేన కూటమి ప్రభుత్వంలో చేరి ఉపముఖ్యమంత్రి అయిన సంగతి తెలిసిందే. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పార్టీ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది. కానీ ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శిండే శివసేన-అజిత్ ఎన్‌సీపీతో కూడిన మహాయుతి కూటమి భారీ విజయం సాధించింది. పవార్, అజిత్ కలిసిపోతే ఎన్‌సీపీ కార్యకర్తలు ఎంతో లాభపడతారని ఎన్‌సీపీ నేత, రాష్ట్ర మంత్రి నరహరి జిర్వాల్ అన్నారు.

దీక్ష విరమణ ఇష్టం లేదా?

దల్లేవాల్‌ను ఆస్పత్రికి ఎందుకు తరలించలేదు?.. నచ్చజెప్పడంలో పంజాబ్ ప్రభుత్వం విఫలం

- సుప్రీంకోర్టు అసంతృప్తి
- చికిత్స పొందుతూ నిరసన కొనసాగించవచ్చని స్పష్టీకరణ



మోదీతో భేటీ అయిన దిల్జిత్ దొసాంజ్

న్యూఢిల్లీ, జనవరి 2: నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగజ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించనందుకు సుప్రీంకోర్టు గురువారం పంజాబ్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజీ పడొద్దన్నట్టుగా ప్రభుత్వ వైఖరి ఉంద ని వ్యాఖ్యానించింది. పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దల్లేవాల్ గత ఏడాది నవంబరు 26 నుంచి పంజాబ్-హరియాణా సరిహద్దులోని కౌనడీ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను మంగళవారం (డిసెంబరు 31)లోగా ఆస్పత్రికి తరలించాలని గత నెల 20న సుప్రీంకోర్టు ఆదేశించింది. అవసరమైతే శిబిరం సమీపంలో తాత్కాలిక ఆస్పత్రి ఏర్పాటు చేయవచ్చని, కావాలనుకుంటే అక్కడ దీక్ష కొనసాగించుకోవచ్చని తెలిపింది. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయన్‌ల ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే దీక్ష కొనసాగించుకోవచ్చన్న విషయాన్ని దల్లేవాల్‌కు అర్థమయ్యేలా నచ్చజెప్పడంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని వ్యాఖ్యానించింది. పైగా సుప్రీంకోర్టే నిరాహార దీక్ష ఆపాలని ఆదేశాలు ఇచ్చిందంటూ కొందరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రైతు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించింది. దీనిపై పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ సమాధానం ఇస్తూ చికిత్సలు చేసుకోవాల్సిందిగా దల్లేవాల్‌ను మధ్యవర్తులు నచ్చజెప్పుతున్నారని తెలిపారు. చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తేనే వైద్య సేవలు పొందుతానని దల్లేవాల్ అంటున్నారని తెలిపారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి మేం కమిటీ వేసిన విషయాన్నయినా చెప్పారా?" అని అడిగారు. ఏజీ బదులిస్తూ ఆ కమిటీ శుక్రవారం రైతులతో చర్చలు జరుపుతుందని తెలిపారు. తదుపరి విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది. కాగా, రైతుల ఆందోళనపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మీడియా ప్రశ్నించినప్పుడు.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్చలు జరుపుతామని తెలిపారు.

మోదీని కలిసిన గాయకుడు దిల్జిత్

ప్రధాని మోదీని పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాంజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మోదీ, దిల్జిత్ భేటీకి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా గాయకుడు దిల్జీత్‌పై మోదీ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. అతడు ప్రజల హృదయాలను గెలిచాడని, దిల్జిత్ అనే పేరును సార్థకం చేసుకున్నాడని ప్రశంసించారు. మరోపక్క ప్రధాని నుంచి తాను ఎంతగానో స్ఫూర్తి పొందానని గాయకుడు దిల్జిత్ కొనియాడారు. అయితే ప్రధాని మోదీతో దిల్జిత్ భేటీ కావడంపై రైతు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జలమే గరళం!

- పల్నాడు జిల్లాలోని భూగర్భ జలాల్లో అధికంగా నత్రజని
- తెలంగాణలో రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేటల్లోనూ..
- దేశంలోని 440 జిల్లాల్లో భూగర్భ జలాలు విషతుల్యం
- అనేక ప్రాంతాల్లో పరిమితికి మించి ఫ్లోరైడ్, ఆర్సెనిక్
- కేంద్ర భూగర్భ జలమండలి తాజా నివేదికలో ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 2: నేడు భూగర్భ జలాలు కాలుష్యమై చాలామందికి సురక్షిత, స్వచ్ఛమైన తాగునీరు అందకుండా పోతోంది. కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) తాజా నివేదిక దేశంలో పెరుగుతున్న జల కాలుష్యం, దాంతో వచ్చే అనారోగ్య సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. తెలుగు రాష్ట్రాల్లోని పల్నాడు, రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేటతోపాటు దేశవ్యాప్తంగా 440 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో నత్రజని స్థాయిలు అధికంగా ఉన్నాయని సీజీడబ్ల్యూబీ తాజా వార్షిక నివేదికలో పేర్కొంది. దేశవ్యాప్తంగా సేకరించిన నమూనాల్లో 20శాతం వాటిలో అనుమతించినస్థాయి కంటే అధిక నత్రజని గుర్తించినట్టు తెలిపింది. నత్రజని ఆధారిత ఎరువులు, జంతు వ్యర్థాలను ఎక్కువ వినియోగించే ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంది. అలాగే 9.04శాతం నమూనాల్లో పరిమితికి మించి ఫ్లోరైడ్ స్థాయిలు ఉన్నాయని, 3.55శాతం శాంపిల్స్‌లో ఆర్సెనిక్ కనిపించినట్టు తెలిపింది. 2023 మేలో భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా మొత్తం 15,259 ప్రాంతాల నుంచి నమూనాలు సేకరించారు. వాటిని పరీక్షించగా 20శాతం శాంపిల్స్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ నిర్దేశించిన లీటరుకు 45 మిల్లీగ్రాముల నత్రజని పరిమితికంటే అధికంగా ఉంది. రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడుల్లో 40శాతం నమూనాల్లో కాలుష్య స్థాయిలు ఎక్కువున్నట్టు గుర్తించారు. మహారాష్ట్రలో 35.74శాతం, తెలంగాణలో 27.48శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 23.5శాతం, మధ్యప్రదేశ్‌లో 22.58శాతం శాంపిల్స్‌లో కాలుష్యం అధికంగా ఉన్నట్టు కనుగొన్నారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, హరియాణాల్లో 2017 నుంచి 2023 వరకు నీటి కాలుష్యం పెరిగిందని గుర్తించారు. ఉత్తరప్రదేశ్, కేరళ, ఝార్ఖండ్, బిహార్‌ల్లో కాలుష్యం తక్కువ ఉన్నట్టు నివేదిక పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్, అసోం, గోవా, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్‌లో భూగర్భ జలాలు సురక్షితంగానే ఉన్నాయని తెలిపింది. నీటిలో నైట్రేట్ స్థాయిలు అధికంగా ఉంటే తాగేందుకు సురక్షితం కాదని, ఇది శిశువుల్లో బ్లూ బేబీ సిండ్రోమ్ వంటి అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నివేదిక హెచ్చరించింది.

దేశవ్యాప్తంగా 15జిల్లాల్లో నైట్రేట్ స్థాయిలు అధికంగా ఉన్నట్టు సీజీడబ్ల్యూబీ గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, తెలంగాణలోని రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేటతోపాటు రాజస్థాన్‌లోని బార్మర్, జోధ్‌పూర్, మహారాష్ట్రలోని వార్ధా, బుల్దానా, అమరావతి, నాందేడ్, బీడ్, జల్గావ్, యవాత్మల్, తమిళనాడులోని విల్లుపురం, పంజాబ్‌లో భఠిండాజిల్లాల్లోని భూగర్భ జలాల్లో నైట్రేట్ స్థాయిలు ఎక్కువ ఉన్నట్టు తెలిపింది. రాజస్థాన్, హరియాణా, కర్ణాటక, ఏపీ, తెలంగాణలో పరిమితికి మించి ఫ్లోరైడ్ సాంద్రత ఉండడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. రాజస్థాన్, గుజరాత్, హరియాణా, పంజాబ్, తమిళనాడు, ఏపీ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో సేకరించిన నమూనాల్లో యురేనియం సాంద్రత అధికంగా ఉండడాన్ని గుర్తించినట్టు తెలిపింది. ఓవరాల్‌గా తెలంగాణ, ఏపీ, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, హరియాణా, పంజాబ్, కర్ణాటకల్లో జల కాలుష్యం అధికంగా ఉన్నట్టు నివేదిక పేర్కొంది.


ఎంఎన్‌జేలో ఎముక క్యాన్సర్‌కు ఆధునిక చికిత్స

- అందుబాటులోకి 3డీ ప్రాసెస్ విధానం

హైదరాబాద్ సిటీ, జనవరి2 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రోగులకు చికిత్స అందించే ప్రభుత్వ ఆస్పత్రి, హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎముక క్యాన్సర్ రోగులకు ఆధునిక వైద్య విధానం అందుబాటులోకి వచ్చింది. ఎముక క్యాన్సర్ రోగులకు ఎంఎన్‌జేలో 3డీ ప్రాసెస్ విధానంలో చికిత్స అందిస్తున్నారు. ఎవరైనా ఈ క్యాన్సర్ బారిన పడితే ఇన్నాళ్లూ ఆ ఎముక మొత్తాన్ని తొలగించి ఆ స్థానంలో కృత్రిమ ఎముకను అమర్చేవారు. కానీ 3డీ ప్రాసెస్‌లో ఎముకలో క్యాన్సర్ సోకి దెబ్బతిన్న భాగాన్ని గుర్తించి... ఆ భాగం వరకే తొలగిస్తారు. అనంతరం కృత్రిమంగా తయారు చేసిన భాగాన్ని ఆ ప్రాంతంలో అమరుస్తారు. ఇది రోగులకు ఎంతో ఉపయోగకరమని వైద్యులు చెబుతున్నారు. ఎంఎన్‌జేలో ఇప్పటికే ఇద్దరు రోగులకు ఈ విధానంలో చికిత్స అందించామని తెలిపారు. 3డీ ప్రాసెస్ విధానం ద్వారా క్యాన్సర్ వల్ల దెబ్బతిన్న ఎముక భాగాన్ని కచ్చితంగా గుర్తించడమేకాకుండా, కచ్చితమైన కొలతలతో ఆ భాగాన్ని కృత్రిమంగా తయారు చేయించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గతంలో దెబ్బతిన్న ఎముకను శస్త్రచికిత్స ద్వారా తొలగించి కృత్రిమ ఎముకను అమర్చినప్పుడు రోగులు ఇబ్బందులు పడేవారు. అయితే, 3డీ ప్రాసెస్ చికిత్స వల్ల రోగులకు ఈ సమస్య తప్పింది. కృత్రిమంగా తయారు చేసే ఎముక భాగాలను బెంగళూరు, పుణె నుంచి తెప్పించి రోగులకు అమరుస్తారు. టైటానియంతో తయారు చేసే ఈ భాగాలు రోగులకు సౌకర్యంగా ఉంటాయని వైద్యులు తెలిపారు. ఈ 3డీ ప్రాసెస్ వైద్యానికి కార్పొరేట్ ఆస్పత్రులు రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు వసూలు చేస్తాయని.. ఎంఎన్‌జేలో ఈ చికిత్సను ఉచితంగా అందిస్తున్నామని వైద్యులు వెల్లడించారు.

ఇద్దరు సీఎంలనూ ఆహ్వానించాం

- ప్రాథమిక విద్యలో తెలుగును తప్పనిసరి చేయాలని కోరతాం
- ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్
- నేటి నుంచి హైదరాబాద్‌లో 3 రోజుల పాటు మహాసభలు



ఇందిరాదత్

హైదరాబాద్ సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులనూ ఆహ్వానించామని ఆ సంస్థ అధ్యక్షురాలు, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, కళలు, చరిత్ర పరిరక్షణ ధ్యేయంగా ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిపే ఈ మహాసభలను ఈసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందని చెప్పారు. హెచ్‌ఐసీసీలోని హోటల్ నోవాటెల్ వేదికగా జరిగే మహాసభల్లో మొదటి రోజు శుక్రవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా అంకుర సంస్థలను ప్రోత్సహించేలా లిటిల్ ఏంజెల్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. చివరి రోజు ఆదివారం సాయంత్రం ముగింపు కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించామని చెప్పారు. ప్రాథమిక విద్యా బోధనలో తెలుగును తప్పనిసరి చేయమని ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులకు తమ వేదిక ద్వారా విన్నవిస్తామని తెలిపారు. మాతృభాషలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం లాంటి విషయాలమీద ఆలోచనలను రేకెత్తించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. తెలుగు జీవ భాష కావాలంటే మన భాషలో ఉద్యోగ అవకాశాలు పెరగాలన్నారు. దీని కోసం మహాసభల్లో వ్యాపారవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు.

ఇదేం ఫార్ములా..!?

(మొదటి పేజీ తరువాయి)

చెల్లిస్తానని ఏస్ నెక్స్ట్ జెన్ అనే సంస్థ ముందుకు వచ్చింది. రేస్ వాణిజ్య వ్యవహారాలను తాను చూసుకుంటానని చెప్పింది. ఈ మేరకు మూడు పార్టీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. అంతే తప్పితే.. ప్రమోటర్ తప్పుకుంటే ఆ బాధ్యత ప్రభుత్వానిదని, ఎఫ్ఈవోకు చెల్లించాల్సిన డబ్బులను ప్రభుత్వమే చెల్లించాలంటూ ఒప్పందంలో ఎక్కడా లేదు. అటువంటి నిబంధన కూడా లేదు. కానీ, రెండో విడత రేస్ నిర్వహణ సమయంలో స్పాన్సరర్ తప్పుకోవడంతో ప్రభుత్వమే స్పాన్సరర్ అవతారం ఎత్తింది. ఈ వ్యవహారంపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

తనకు సంబంధం లేకపోయినా..

తనకు ఏమాత్రం సంబంధం లేకపోయినా స్పాన్సరర్ అవతారాన్ని ప్రభుత్వం ఎత్తడం ఏమిటనే అంశం ఇప్పుడు కీలకంగా మారింది. త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా మొదటి రేసును 2023 ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ క్రమంలో రేస్ ట్రాక్, సివిల్ పనులకు పురపాలక శాఖ రూ.12 కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. ఎఫ్ఈవోకు చెల్లింపులు, ఇతర నిర్వహణ ఖర్చులను ఎఫ్ఈవోకు చెల్లించడం స్పాన్సరర్ అయిన ఏస్ నెక్స్ట్ జెన్ బాధ్యత. కానీ, 2023 మేలో పదో సెషన్ నిర్వహించాల్సి ఉండగా.. నష్టాలు వస్తున్నాయంటూ ముందే ఆ కంపెనీ తప్పుకొంది. అప్పటికే 50 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. దానిని చెల్లించలేదు. ఆ తర్వాత ఈవెంట్‌కు ముందే మరో 50 శాతం చెల్లించాలి. ఇందులో స్పాన్సర్ కంపెనీ విఫలమైతే.. 4 శాతం వార్షిక వడ్డీతో ఎఫ్ఈవోకు నష్టపరిహారం చెల్లించాలి. అయినా, ఏస్ నెక్స్ట్ జెన్ తప్పుకొంది. తనకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా ఆ బాధ్యతను పురపాలక శాఖ నెత్తికి ఎత్తుకుంది. పదో సెషన్‌కు సంబంధించి రూ.46 కోట్లను ఎఫ్ఈవోకు చెల్లించింది. ఆ చెల్లింపులను కూడా పురపాలక శాఖ నుంచి చేయలేదు. హెచ్ఎండీఏ బాధ్యతలు కూడా తానే చూస్తుండడంతో అప్పటి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆ నిధులను హెచ్ఎండీఏ ఖాతా నుంచి చెల్లించారు.



అంతేనా.. లండన్‌కు చెందిన ఎఫ్ఈవోకు డాలర్లలోనే చెల్లింపులు చేశారు. నిజానికి, డాలర్లలో చెల్లింపులు చేయాలంటే అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి ఉండాలి. కానీ, దానిని తీసుకోలేదు. ఇక్కడ తనకు ఏమాత్రం సంబంధం లేకపోయినా స్పాన్సర్ బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుని.. స్పాన్సరర్ చెల్లించాల్సిన డబ్బులను ఎఫ్ఈవోకు ప్రభుత్వమే చెల్లించడంపై ఏసీబీ కూపీ లాగుతోంది.

ఏమాత్రం అనుభవం లేకుండానే..

ఫార్ములా ఈ కారు రేసును స్పాన్సర్ చేయడానికి ఏస్ నెక్స్ట్ జెన్ అనే కంపెనీ ముందుకు వచ్చింది కదా! ఆ కంపెనీ పూర్వాపరాలూ ఇప్పుడు కీలకంగా మారాయి. కేవలం రూ.2 లక్షల మూలధనంతోనే ఆ కంపెనీ ఏర్పాటైంది. అది కూడా ఒప్పందం కుదుర్చుకోవడానికి కేవలం నాలుగు నెలల ముందే. గ్రీన్ కోలో డైరెక్టర్లుగా ఉన్న వ్యక్తులు వ్యక్తిగత హోదాలో ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. ఫార్ములా ఈ కారు రేసుకు సంబంధించి త్రైపాక్షిక ఒప్పందం 2022 అక్టోబరు 25న జరిగితే.. దానికి కేవలం 4 నెలల ముందు అంటే.. జూన్ 29న రూ.2 లక్షల పెయిడ్ అప్ క్యాపిటల్‌తో ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీని రిజిస్టర్ చేశారు. కంపెనీ డైరెక్టర్లుగా అనిల్ కుమార్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఉన్నారు. వీరిద్దరూ దేశంలోనే అతి పెద్ద ఎనర్జీ కంపెనీ అయిన గ్రీన్‌కోలో డైరెక్టర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిజానికి, గ్రీన్ కో వ్యాపారానికి, ఏస్ నెక్స్ట్ జెన్‌కు, ఫార్ములా ఈ కారు రేస్ నిర్వహణకూ ఎలాంటి సంబంధం లేదు. అయినా.. తమకు తెలియని స్పోర్టింగ్, రిక్రియేషన్ కంపెనీని అనిల్, మహేశ్ ఎందుకు ప్రారంభించారు? కేవలం స్పాన్సరర్ అవతారం ఎత్తడానికే ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీ ఏర్పాటైందా? తెర వెనక తతంగం ఏమిటి? అన్న విషయాలపై ఇప్పుడు ఏసీబీ లోతుగా దృష్టిపెట్టింది. ఒప్పందాన్ని రద్దు చేసుకోకుండా.. ఎఫ్ఈవోకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకుండా ఎందుకు తప్పుకొందనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం వెనక ఎవరు ఉన్నారనే అంశంపై దృష్టిసారించారు.

తప్పు మీద తప్పు

ఇప్పటి వరకూ స్పాన్సరర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ తమకు చెల్లించాల్సిన డబ్బులను ఇవ్వలేదంటూ ఎఫ్ఈవో ప్రతినిధులు పురపాలక ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పాన్సరర్ ఉంటే పదో సెషన్‌ను పూర్తి చేయవచ్చని సూచించారు. దాంతో, పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని అప్పటి పురపాలక మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. పురపాలక శాఖకు ఏమాత్రం సంబంధం లేకపోయినా.. స్పాన్సర్ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలంటూ అప్పట్లో నిర్ణయించారు. ఈ మేరకు పదో సెషన్‌కు సంబంధించి పురపాలకశాఖ స్పాన్సరర్‌గా ఉంటుందంటూ సంబంధిత ఫైల్‌ను 2023 సెప్టెంబరు 27న అప్పటి మంత్రి కేటీఆర్‌కు చేరింది. పదో సెషన్ నిర్వహణకు ఎఫ్ఈవోకు 90 లక్షల పౌండ్లు చెల్లించడానికి అనుమతిని కోరుతూ దీనిలో పేర్కొన్నారు. దీనిపై కేటీఆర్ సంతకం చేశారు. తద్వారా స్పాన్సరర్ బాధ్యతను కూడా పురపాలక శాఖ నెత్తికెత్తుకొంది. ఇందుకుగాను ఎఫ్ఈవోకు పన్నులతో కలిపి రూ.56 కోట్లు చెల్లించారు. ఇక్కడే మరో రెండు అంశాలు కూడా ఉన్నాయి. నిజానికి, ఇక్కడ పురపాలక శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు క్యాబినెట్ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ, దానిని తీసుకోలేదు. పైగా, పురపాలక శాఖ నుంచి కాకుండా హెచ్ఎండీఏ ఖాతా నుంచి ఆ చెల్లింపులు చేశారు. హెచ్ఎండీఏకు, ఫార్ములా ఈ కారు రేస్ నిర్వహణకు అస్సలు ఏమాత్రం సంబంధం లేదు. కానీ, దాని ఖాతా నుంచి చెల్లింపులు చేయడంపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, హెచ్ఎండీఏ బ్యాంకు ఖాతా నుంచి ఎఫ్ఈవోకు డాలర్లలో చెల్లింపులు చేశారు. ఇలా ఓ విదేశీ సంస్థకు డాలర్లలో చెల్లింపులు చేస్తే.. అందుకు ఆర్బీఐ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ, దాని నుంచి ఎటువంటి అనుమతులూ తీసుకోకపోవడం నిబంధనల ఉల్లంఘనగా ఏసీబీ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. ప్రైవేటు స్పాన్సరర్ పాత్రలోకి పురపాలక శాఖ చేరడం నుంచి డాలర్లలో చెల్లింపుల వరకూ అన్నింటా పూర్తిస్థాయిలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని దర్యాప్తు అధికారులు గుర్తించారు. సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, క్యాబినెట్ అనుమతి తీసుకోకపోవడం, రెండో ఒప్పందం అమల్లోకి రావడానికి ముందే ఆర్థిక శాఖ అనుమతి లేకుండా రెండు విడతలుగా ఎఫ్ఈవోకి డబ్బు చెల్లించడం, తదితర విషయాలన్నీ అనుమానాస్పదంగా ఉన్నాయని కౌంటర్ అఫిడవిట్‌లో స్పష్టం చేశారు.

అది వ్యక్తిగత ఒప్పందమే..

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారం తమ దృష్టికి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ త్రైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసింది. ఒప్పందం రద్దు చేసినందుకు తమకు పరిహారం చెల్లించాలంటూ ఎఫ్ఈవో సంస్థ బ్రిటన్లోని ఆర్బిట్రేషన్ కోర్టులో దావా వేసింది. మిగిలిన నిధులు చెల్లించకపోతే ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లేనని సర్కారుకు లేఖ కూడా రాసింది. దీనిపై ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. 'మీకు పరిహారం కట్టడం కాదు. ఇప్పటికే తీసుకున్న ప్రజాధనాన్ని తిరిగి ఇవ్వాల్సిందే. గతంలో ఫార్ములా-ఈ ఒప్పందం వ్యక్తిగతంగా ఓ అధికారితో చేసుకున్నది మాత్రమే. దానికి ప్రభుత్వ అనుమతి కానీ, ఆర్థిక శాఖ అనుమతి కానీ లేవు. ఇప్పటికే చేసిన చెల్లింపులే ఓ మోసం. ఆర్థిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్యాబినెట్‌కు ఎలాంటి సంబంధం లేకుండా ఓ వ్యక్తి చెల్లింపులు చేశారు. సదరు అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాం. ఆ అధికారి ఇప్పుడు విచారణ ఎదుర్కొంటున్నారు" అంటూ ఎఫ్ఈఓకు మున్సిపల్, పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ పంపిన లేఖలో బదులిచ్చారు. ప్రభుత్వానికి సంబంధం లేకుండా వ్యక్తిగత ఒప్పందం కావడంతో ఒప్పంద ఉల్లంఘన ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కాకుండా వ్యక్తిగతంగా ఒప్పందం చేసుకుని రూ.46 కోట్లు తీసుకున్నారని, ఆదాయపు పన్ను శాఖకు రూ.8 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని, మొత్తం రూ.56 కోట్ల ప్రజాధనాన్ని తిరిగి వెనక్కి ఇచ్చేయాలని అందులో స్పష్టం చేశారు. లేకపోతే చట్టపరమైన చర్యలకు సిద్ధం కావాలని హెచ్చరించారు. దాంతో, సదరు సంస్థ వెనక్కి తగ్గింది. ఆర్బిట్రేషన్ పిటిషన్‌ను ప్రస్తుతానికి ఉపసంహరించుకుంది.

ఈ-మెయిళ్లు తవ్వితీస్తున్న ఏసీబీ

ఫార్ములా-ఈతో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు ఈ మెయిల్స్ ద్వారా సాగించిన ఉత్తర ప్రత్యుత్తరాలపై అవినీతి నిరోధక శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఫార్ములా-ఈ ప్రతినిధులు రాష్ట్రానికి రావడం నుంచి ఒప్పందం రద్దు అయ్యేంతవరకు సాగించిన లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాలను జల్లెడ పడుతోంది. ఇందులో ప్రారంభంలో జరిగిన ఒప్పంద చర్చల మెయిల్స్ కూడా ఉన్నాయి. సదరు చర్చల్లో తాను లేనని, అధికారులు చెప్పారనే తాను సంతకాలు చేశానని మాజీ మంత్రి కేటీఆర్ వాదిస్తుండడంతో ఆయన ప్రత్యక్ష పాత్ర ఉందని నిరూపించే ఈ-మెయిళ్లను కూడా ఏసీబీ సేకరించింది. గత ఒప్పందాలపై జరిగిన చర్చల్లో అర్వింద్ కుమార్‌తోపాటు కేటీఆర్ కూడా పాల్గొన్నారని, వారి సమక్షంలోనే అంతా ఖరారైందని ఫార్ములా-ఈ సంస్థ పేర్కొన్న ఈ-మెయిళ్లను ఏసీబీ సేకరించింది.

ఈడీ విచారణకు బీఎల్ఎన్ రెడ్డి డుమ్మా

» కొంత సమయం కావాలని ఈ-మెయిల్

» నేటి విచారణకు రాలేనన్న అరవింద్

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసులో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి గురువారం ఈడీ విచారణకు హాజరు కాలేదు. తనకు కొంత సమయం కావాలని ఆయన ఈ మెయిల్ ద్వారా ఈడీ అధికారులను కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి.. మరోసారి పిలుస్తామని జవాబు ఇచ్చారు. శుక్రవారం విచారణకు హాజరు కావాల్సిన సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ కూడా తాను రాలేనని, మరో తేదీ ఇవ్వాలని కోరారు. దీంతో ఆయనను కూడా మరో రోజు విచారణకు పిలుస్తామని అధికారులు తెలిపారు. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో ఏసీబీ కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వ్‌లో ఉంది. ఆ తీర్పు వచ్చిన తర్వాత విచారణకు హాజరయ్యే విషయంపై నిర్ణయం తీసుకోవాలని బీఎల్ఎన్ రెడ్డి, అరవింద్ కుమార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేటీఆర్‌ను ఈ నెల 7న హాజరు కావాలని ఈడీ ఇప్పటికే సమన్లు జారీ చేసింది. హైకోర్టు తీర్పు తర్వాతే... కేటీఆర్ విచారణకు హాజరవుతారా లేదా అనే విషయం తేలే అవకాశం ఉంది.



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

ఆసిఫాబాద్‌లో వైద్య విద్యార్థుల ఆందోళన

» కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవని నిరసన

ఆసిఫాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తమ కాలేజీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని అంకుశాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. గురువారం తరగతులను బహిష్కరించి కళాశాల ఎదుట ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులు మాట్లాడుతూ, కళాశాలలో తగినంత మంది ప్రొఫెసర్లు లేక తరగతులు పూర్తిస్థాయిలో కొనసాగడంలేదని తెలిపారు. వైద్య పరిశోధనల కోసం ఎనిమిది మృతదేహాలు ఉండాల్సి ఉండగా ఒక్కటి కూడా లేదని, ల్యాబుల్లో రసాయనాలు లేవని చెప్పారు. వసతిగృహాల్లో బాత్రూంలు కంపుకొడుతున్నాయని, గదుల్లో పై పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో తెలియక భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యార్థులు కలెక్టర్‌కు అందజేశారు.

ఆంక్షలు లేకుండా రైతు భరోసా అమలుచేయాలి

» బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంక్షలు లేకుండా రైతు భరోసా అమలు చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని వాటిని ప్రతివారం ఒకటి చొప్పున బయటపెడతామని ఆయన ప్రకటించారు. గురువారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏలేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులకు రూ. 85 వేల కోట్లు బాకీ పడిందని అన్నారు. రైతు భరోసా విధి విధానాలు ప్రకటించకుండా, సబ్ కమిటీ పేరిట జాప్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజూ సగటున రూ. 340 కోట్ల అప్పు చేస్తోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన 390 రోజుల్లో రూ. 1,38,117కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు.

ఆ వ్యక్తికి స్పీడ్ బ్రేకర్ ప్రాణం పోసింది

» గుండెపోటుతో ఆస్పత్రికి.. మృతిచెందినట్లు వైద్యుల ధ్రువీకరణ

» అంబులెన్స్‌లో ఇంటికి తరలిస్తుండగా స్పీడ్ బ్రేకర్‌తో కుదుపు

» కదిలిన చేతివేళ్లు.. మళ్లీ ఆస్పత్రికి.. చికిత్స తర్వాత పూర్తి స్వస్థత

ముంబై, జనవరి 2: ఆ వ్యక్తికి ఓ స్పీడ్ బ్రేకర్ మళ్లీ ప్రాణం పోసింది. లేదంటే, అప్పటికే అంతిమయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేసిన కుటుంబసభ్యులు చితిమీద పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసేవారే!! చచ్చిబతికిన ఆ వ్యక్తి 65 ఏళ్ల పాండురంగ్ ఉల్పే. ఊరు.. మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని కసబ-బావ్డా! ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఉల్పే మరణించినట్లుగా ప్రకటించేశారు. ఆస్పత్రిలో లాంఛనాలన్నీ పూర్తయ్యాక మృతదేహాన్ని సొంతూరుకు తరలించేందుకు అంబులెన్స్‌లో ఎక్కించారు. మరోవైపు ఊర్లో శోకసంద్రంలో మునిగిన కుటుంబసభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సొంతూరు వైపు వేగంగా సాగుతున్న అంబులెన్స్ ఓ స్పీడ్ బ్రేకర్‌ను దాటగానే కుదుపునకు లోనైంది. రోదిస్తున్న భార్య, స్ట్రెచర్‌పై మృతదేహం వేళ్లు కదలడాన్ని గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేసింది. వెంటనే ఆస్పత్రివైపు అంబులెన్స్ యూటర్న్ తీసుకుంది. యాంజియోప్లాస్టీ నిర్వహించిన వైద్యులు కొన ఊపిరితో ఉన్న ఉల్పే ప్రాణాలను కాపాడారు. రెండు వారాల చికిత్స అనంతరం ఉల్పే పూర్తిగా కోలుకొని ఇంటికి చేరుకోవడంతో కుటుంబసభ్యుల ఆనందానికి అవధుల్లేవు.

ఏజెన్సీలో గజగజ!

» పడిపోతున్న ఉష్ణోగ్రతలు.. వణికిస్తున్న చలి

» సిర్పూర్(యూ)లో 7.3 డిగ్రీల కనిష్ఠం

» తిర్యాణి మండలంలో 8, కోహీర్‌లో 8.4

» 15 వరకు ఇదే పరిస్థితి: వాతావరణ నిపుణులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

చలిపులి మళ్లీ పంజా విసురుతోంది. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రతతో ఆ ప్రాంతాలు గజగజ వణకుతున్నాయి. గురువారం రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠంగా కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 7.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత ఇదే జిల్లా తిర్యాణి మండలంలో 8, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 8.4, ఆదిలాబాద్ జిల్లా రూరల్ మండలం పిప్పల్‌ధరిలో 8.9, బేలలో 9, సంగారెడ్డి జిల్లా అల్గోల్‌లో 9.1, మల్‌చేల్మలో 9.3, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 9.6, జైనథ్‌లో 9.8, మావలలో 9.9 డిగ్రీల కనిష్ఠానికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తుఫానుల ప్రభావంతో గతేడాది డిసెంబరు 18 నుంచి చలి తీవ్రత తగ్గినా ఈ ఏడాది జనవరి 1 నుంచి మళ్లీ పెరిగింది. ఉదయం పొగమంచుతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండడం, దీనికి శీతల గాలులు కూడా తోడు కావడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. దీంతో ప్రజలు ఉదయం 10 గంటల వరకు చలికి భయపడి ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాల్లో జనం వణికి పోతున్నారు. ఉదయం వేళ దట్టమైన పొగమంచు కప్పేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చలి తీవ్రత జనవరి 15 వరకు ఉంటుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

మూసీమూటల వేట, లగచర్ల లడాయిని ఎదుర్కొన్నాం..

» అవినీతి కాంగ్రెస్‌ను గద్దెదించేదాకా పోరాడదాం

» గులాబీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మూసీలో మూటలవేట నుంచి లగచర్ల లడాయి వరకూ అన్యాయం జరిగిన ప్రతి చోటా బాధితుల పక్షాన గట్టిగా నిలబడి ఎదుర్కొన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. గతేడాది కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులు పోరాట స్ఫూర్తిని కనబరిచారని.. హామీల ఎగవేత, మోసపూరిత చర్యలను అడ్డుకోగలిగామన్నారు. ప్రభుత్వం తీరుపై మన పోరాటాన్ని ఇలాగే కొనసాగిద్దాం... నిరసనలు చేపడుతూనే రానున్న రోజుల్లో మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ తోబుట్టువుల్లారా.. అంటూ గురువారం 'ఎక్స్'వేదికగా పార్టీ శ్రేణులకు కేటీఆర్ సందేశం పంపారు. బీఆర్ఎస్ పోరాటం వల్లే అదానీ ఆశజూపిన రూ.100కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందని, లగచర్ల లడాయి.. యావత్‌దేశం ముందు నియంతృత్వ కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టిందన్నారు.

పదేళ్ల తెలంగాణ ప్రగతిలో పూలే దంపతుల స్ఫూర్తి: కేసీఆర్

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడ్డాక పదేళ్ల సామాజిక ప్రగతి ప్రస్థానంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల స్ఫూర్తి ఇమిడి ఉందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా సాధికారత, వారి విద్య కోసం ఆ దంపతులు చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజల జీవన విధానంలో గుణాత్మక మార్పు, వారి హక్కులు కాపాడటం కోసం త్యాగాలు చేసిన భారతీయ మహనీయుల్లో మహాత్మా పూలే దంపతులు ముందు వరుసలో ఉంటారని కేసీఆర్ కొనియాడారు.

అన్నదాతలకు రేవంత్ సున్నంపెట్టే ప్రయత్నం

» స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

» నేడు బీసీ మహాసభ: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అందరి ఆకలితీర్చే రైతన్నలను ప్రభుత్వపరంగా ఆదుకోవాల్సిందిపోయి.. రైతుభరోసా పథకానికి నిబంధనలంటూ సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాత లకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుభరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించిన ప్రభుత్వం ఇంకెన్ని దరఖాస్తులు తీసుకుంటుందని ప్రశ్నించారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటూ తిప్పలుపెడతారా అని నిలదీశారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్‌పార్టీ తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందని, స్థానికసంస్థల ఎన్నికల్లో గులాబీజెండా ఎగరడం ఖాయమన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయలేక సీఎంచేతులెత్తేశారని, దాంతో ప్రజలు కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వర్తింపచేయాలన్న ప్రధాన డిమాండ్లతో శుక్రవారం బీసీ మహాసభ జరగనుంది. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి, బీసీసంఘాలు సంయుక్తంగా చేపట్టనున్న బీసీ మహాసభకు పోలీసుశాఖ అనుమతి ఇచ్చిందని కవిత చెప్పారు.

రావిపహాడ్‌లో 'ఇథనాల్' కంపెనీ రద్దు చేసేవరకూ పోరాటం

» అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతుల రిలే నిరాహారదీక్ష

» నాయకులను బలవంతంగా స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మోతె, జనవరి 2: సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్‌లో నిర్మిస్తున్న ఎస్ఎంకే బయో ఫ్యూయల్స్(ఇథనాల్) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని రద్దు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో చుట్టుపక్కల ఉన్న 10 గ్రామాలకు చెందిన రైతులు నెలరోజులుగా చేస్తున్న నిరసనలు రోజురోజుకూ ఉద్రిక్తమవుతున్నాయి. కంపెనీ నిర్మాణంతో అనారోగ్యం పాలవుతామని ఆందోళన వ్యక్తం చేస్తూ వారు గురువారం కంపెనీ ఎదుట ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50మంది బెటాలియన్ పోలీసులు, ఇతర సిబ్బంది వచ్చి దీక్షలకు అనుమతి లేదంటూ టెంట్లు వేయకుండా అఖిలపక్ష నాయకులను అడ్డుకున్నారు. దాంతో వారు రోడ్డు వెంబడి దీక్ష చేపట్టారు. దీక్షలో ఉన్న వారిని పోలీసులు, బెటాలియన్ సిబ్బంది బలవంతంగా తరలించేందుకు ప్రయత్నించగా పోలీసులు, అఖిలపక్షం నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అఖిలపక్షం నాయకులను పోలీసులు మోతె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇథనాల్ కంపెనీ వ్యతిరేక కమిటీ జేఏసీ నాయకుడు మట్టిపెల్లి సైదులు మాట్లాడుతూ.. ఇథనాల్ కంపెనీ నిర్మాణంతో చుట్టుపక్కల 10గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతారని, పంటలు కాలుష్యంతో నిండుతాయని, మూగజీవాలు వింత జబ్బుల బారిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ నిర్మాణాన్ని ఆపాలని పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. పోలీసులు కంపెనీ యజమానులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ, ఇథనాల్ కంపెనీ నిర్మాణానికి అండగా ఉంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రజాభిప్రాయం సేకరించకుండా అక్రమ మార్గంలో కంపెనీ యాజమాన్యం అనుమతులు పొంది నిర్మాణం చేపట్టిందని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇథనాల్ కంపెనీ అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలన్నారు. ఈ కంపెనీ నిర్మాణాన్ని ఆపాలని, దాని అనుమతులు రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. మరోవైపు ఇథనాల్ కంపెనీ నిర్మాణ పనులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మన్సూర్‌అలీ పరిశీలించారు.

'సాగర్' స్పిల్‌వే గుంతలపై సర్కారు ఆగ్రహం

» వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వండి

» అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేసి రెండేళ్లు పూర్తికాకుండానే నాగార్జున సాగర్ స్పిల్‌వే ఓగీ (క్రెస్ట్ గేట్ల నుంచి విడుదలయ్యే నీరు డ్యామ్ నుంచి వెళ్లే ప్రదేశం)లో గుంతలు పడటంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే దీనిపై నివేదిక అందించాలని అధికారులకు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. 'నాగార్జునసాగర్ స్పిల్‌వేపై గుంతలు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై మంత్రి ఉత్తమ్ అధికారులను ఆరా తీశారు. గుంతలు మళ్లీ పడటానికి కారణాలేంటి? మరమ్మతు పనుల్లో చోటుచేసుకున్న లోపమా? లేక అధికారుల నిర్లక్ష్యమా? నిర్మాణ సంస్థ కారణమా? అని ప్రశ్నిస్తూ వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నాగార్జున సాగర్ స్పిల్‌వే ఓగీకి రూ.16.54 కోట్లతో మరమ్మతులు చేసిన విషయం విదితమే.

గత వరదల అనంతరం గేట్లు మూయడంతో గుంతలు బయటపడ్డాయి. సాగర్ డ్యామ్ 26 బ్లాకులుగా ఉండగా... వాటిలో మీటర్ నుంచి 6 మీటర్ల లోతు దాకా గుంతలు ఏర్పడగా... సుదీర్ఘ విజ్ఞప్తుల అనంతరం గత ప్రభుత్వం మరమ్మతులు చేపట్టింది. 13 ఏళ్లుగా ఈ సమస్య ఉండగా... ఉమ్మడి రాష్ట్రంలో పైపైన మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కీలకమైన స్పిల్ వే ఓగితో పాటు బకెట్ పోర్షన్ (నీళ్లు డ్యామ్ నుంచి కిందికి దిగి... సుడులు తిరుగుతూ వెళ్లే ప్రదేశం)లో మరమ్మతులకు రూ.16.54 కోట్లు వెచ్చించారు. మరమ్మతులు చేస్తున్నప్పుడు ఇవి ఎంతో కాలం ఉండబోవని డ్యామ్‌సేఫ్టీ నిపుణులు హెచ్చరించినా అధికారులు పట్టించుకోలేదు. గుంతలు పడిన ప్రదేశాన్ని ఎయిర్ వాటర్ జెట్‌తో శుభ్రం చేసి... ఆ తర్వాత ప్రదేశాన్ని గ్రౌటింగ్ చేసి... యాంకరింగ్ (డ్రిల్ చేసి, రాడ్లు బిగించడం), పాత, కొత్త కాంక్రీట్‌కు కెమికల్ ట్రీట్‌మెంట్ చేస్తూ... క్రమక్రమంగా పనులు చేయాల్సి ఉండగా... ఆ ప్రక్రియ ఏదీ చేయలేదని నిపుణులు గుర్తించారు. అయితే పనులన్నీ కూడా డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్‌పీ)తో పాటు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) పర్యవేక్షణలో చేస్తే ఫలితాలు వస్తాయని సూచనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. వాస్తవానికి జాతీయ ఆనకట్టల భద్రత చట్టం ప్రకారం ఉమ్మడి ప్రాజెక్టుల రక్షణ బాధ్యత కేంద్రానిదే. అయితే తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీటితో పాటు కోట్లాదిమంది దాహార్తిని తీర్చే కీలక ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ప్రభుత్వం కూడా గుర్తించింది. నివేదిక అందిన అనంతరం శాశ్వత మరమ్మతులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే అవకాశాలున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'బ్రహ్మ' ప్రళయం..!

ఏ సమెత్తు ప్రమాదం లేదని చైనా దబాయిస్తోంది కానీ, టిబెట్‌లోని యార్లుంగ్ జాంగ్‌బో (బ్రహ్మపుత్ర)నదిమీద అది నిర్మించబోయే భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు మన పర్యావరణాన్ని, నీటినీ, ఇంధన అవసరాలను తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయం. దిగువ పరీవాహక దేశాలైన భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌ను కూడా అమితంగా నష్టపరిచే నిర్మాణం ఇది. డ్యామ్ నిర్మాణానికి చైనా 137 బిలియన్ డాలర్లు ఖర్చుచేయబోతోంది. బ్రహ్మపుత్ర నది అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే చోట ఈ ప్రాజెక్టు నిర్మిస్తారని, హిమాలయాల్లోని ఒక భారీ అగాధాన్ని చైనా ఇందుకు ఎంచుకుందని వార్తలు వస్తున్నాయి. త్రీ గోర్జెస్ డ్యామ్‌ను కూడా వెలవెలబోయేట్టు చేసే ఈ ప్రాజెక్టు సాయంతో జలప్రవాహాన్ని చైనా నియంత్రించడమే కాదు, భారీస్థాయిలో వరదనీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం కూడా సృష్టించగలుగుతుందని కొందరి వాదన.

ఈ ప్రాజెక్టు భారత్–చైనా సరిహద్దుకు ముప్ఫై కిలోమీటర్ల దూరంలో ఉంది. బ్రహ్మపుత్ర నీటి ప్రవాహం చైనా నియంత్రణలోకిపోతుంది కనుక, ఎండాకాలంలో ప్రధానంగా అసోం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి రావచ్చు. వర్షాకాలంలో పూర్తిభిన్నమైన స్థితి. బ్రహ్మపుత్రకు భారీ వరదలు వస్తాయి కనుక, ఒక్కసారిగా నీరు విడుదలైతే దిగువ ప్రాంతాలు మునిగిపోతాయి. చైనాతో గతంలో ఉన్న ఆ కాస్త సయోధ్య కూడా ఇటీవలి కాలంలో అడుగంటిపోయింది. అమెరికాతో మన ఆత్మీయత ఆలింగనాల స్థాయికి చేరిపోవడంతో, ఒక్క బుల్లెట్ కూడా పేలని సరిహద్దు కాస్తా కుమ్ములాటలకూ, ఉద్రిక్తతలకు నిలయమైంది. దశాబ్దాలుగా రెండుదేశాల సరిహద్దుల్లోనూ నెలకొని ఉన్న శాంతి నశించి, పరస్పర అపనమ్మకంతో మెలగవలసిన దుస్థితి ఏర్పడింది. సరిహద్దుల్లో ప్రస్తుతానికి ఉభయ దేశాల బలగాలూ వెనకడుగువేసి ఉండవచ్చు. కానీ, అమెరికా పక్షాన చైనాను హద్దుల్లో ఉంచే బాధ్యత మనం నిర్వరిస్తున్నంతకాలం ఆ వేడి కొనసాగుతూనే ఉంటుంది. బ్రహ్మపుత్ర జలాలపై 2002లో తొలిసారిగా ఇరుదేశాల మధ్యా అవగాహన కుదిరింది. ఆ తరువాత మూడుసార్లు అప్పటిపరిస్థితులకు అనుగుణంగా మార్పుచేర్పులు జరిగాయి. చివరి ఒప్పందం 2023లో ముగిసిందనీ, ఆ తరువాత ఆ ఊసే లేకపోయిందని అంటారు. ప్రాజెక్టు నిర్మాణానికి మన అభిప్రాయాన్ని కూడా తీసుకొనేంత సయోధ్య రెండుదేశాల మధ్యా ఎలాగూ లేదు.

ఈ జలవిద్యుత్ ప్రాజెక్టు అరుణాచల్‌ప్రదేశ్‌కు 22కిలోమీటర్ల దూరంలో ఉన్నందున రక్షణపరంగా మనకు పక్కలో బల్లెమే. డ్యామ్ నిర్మాణంలో భాగంగా జరిగే పర్యావరణ విధ్వంసం, భూకంపాలకు అధిక అవకాశం ఉన్న ప్రాంతంలో దీనిని నిర్మించబోవడం ఆందోళన కలిగిస్తున్న అంశాలు. నీటి సహజ ప్రవాహ వేగంలోనూ, దిశలోనూ మార్పుచేర్పులు జరగడం అత్యంత అరుదైన జీవజాలాన్ని ప్రభావితం చేస్తుంది. బ్రహ్మపుత్ర ఆధారంగా భారత్, బంగ్లాదేశ్‌లో సాగే వ్యవసాయం కూడా ప్రభావితం అవుతుంది. తాగునీటి సమస్య కూడా తలెత్తవచ్చును. అరుణాచల్ ప్రదేశ్‌లో తలపెట్టిన జలవిద్యుత్ ప్రాజెక్టులను కూడా పునరాలోచించుకోవాల్సి వస్తుంది.

ఈ భారీప్రాజెక్టుతో దిగువ ప్రాంతాలకు ఎలాంటి సమస్యలు రానివ్వబోనని, అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తానని చైనా హామీ ఇస్తోంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో కూడా మనకు నదీజలాల వివాదాలున్నాయి కానీ, నిర్దిష్టమైన ఒప్పందాలు, కార్యాచరణ విధానాలు కూడా ఉన్నందున సమస్య ఉత్పన్నమైనప్పుడు పరిష్కరించుకోగలిగే అవకాశాలు అధికం. కానీ, చైనాతో బ్రహ్మపుత్ర విషయంలో మనకు ఉన్నది ఐదేళ్ళకోమారు సవరించుకోగలిగే ఎంవోయూ మాత్రమే. చైనా దీనిని కాదుపొమ్మంటే మనం చేయగలిగేది కూడా ఉండదు. ఈ ప్రాజెక్టు విషయంలో చైనా వెనకడుగువేసే అవకాశాలు లేవు కనుక, దానికి మనం సంసిద్ధం కావడం ఉత్తమం. అధికసంఖ్యలో టెలీమెట్రీ స్టేషన్లను నెలకొల్పుకొని బ్రహ్మపుత్ర నీటి స్థితిగతులను నిత్యం గమనించుకోవచ్చు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి పరిస్థితులు మారిపోవచ్చును కనుక, ప్రస్తుతానికి ఉభయదేశాల మధ్యా ఉన్న ఆ కాస్తంత సయోధ్యను ఉపయోగించుకొని ఇప్పుడే కొన్ని అవగాహనలకు, ఒప్పందాలకు మార్గం సుగమం చేసుకోవడం ఉత్తమం. భారతదేశం మీద కత్తికట్టినట్టుగా వ్యవహరిస్తున్న బంగ్లాదేశ్ తనకు ఈ చైనా ప్రాజెక్టువల్ల అధిక ప్రమాదం ఉన్నదని గ్రహించి మనతో కలిసిరావాలి.

ప్రగతికీ జమిలికీ కుదరని బంధం!

ప్రయోజనాలను ఆశించని ఆదర్శాలను ఊహించలేం. రాజకీయాల్లో ఇది మరింత నిజం. ఆదర్శాల కోసమే రాజకీయాలు నడుపుతున్నామని చెప్పే వారి మాటలను పట్టిపట్టి చూడకపోతే అసలు సంగతులు అర్థంకావు. ప్రయోజనం ఆశించినంత మాత్రాన అన్ని ఆదర్శాలకూ స్వలాభమే పరమార్థమనీ చెప్పలేం! ప్రతి ఆదర్శం వెనకనున్న ప్రయోజనాన్ని నిర్దిష్టంగా చూస్తేనే దాని అసలు స్వభావం బయటపడుతుంది. అందుకే ఫలానా ఆదర్శం ఎవరికోసం? సమాజాన్ని అది ముందుకు నడిపిస్తుందా? వెనక్కి నడిపిస్తుందా? ప్రజల హక్కులను బలోపేతం చేస్తుందా? బలహీనం చేస్తుందా? అన్న ప్రశ్నలే ఏ ఆదర్శం విశ్లేషణలోనైనా కీలకపాత్రను పోషిస్తాయి. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయనున్న జమిలి ఎన్నికల ఆదర్శాన్ని ఈ కోణం నుంచి చూస్తే మంచీచెడూ అర్థమవుతుంది. ప్రతిపార్టీకి రాజకీయ ప్రయోజనాలు ఉంటాయి. కానీ ఏ భారీ సంస్కరణనూ ఆ దృష్టితో ప్రతిపాదిస్తున్నట్లు చెప్పదు. దేశ ప్రయోజనం కోసమే దాన్ని తెస్తున్నట్లుగా ప్రజల ముందుకు తెస్తుంది. జమిలి ఎన్నికలనూ అలాగే ప్రచారంలో పెట్టారు.

ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించటం వల్ల స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) 1.5 శాతం పెరుగుతుందనీ దీంతో ప్రజల జీవనప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయనీ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్వర్యంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికలను ఎక్కువమంది ప్రజలు కోరుకున్నారని కూడా కోవింద్ కమిటీ తెలిపింది. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ (ద్రవ్యోల్బణాన్ని మినహాయించకుండా చూస్తే) 370 లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఇందులో 1.5 శాతమంటే రూ.5.5 లక్షల కోట్లు. అంటే ఇంత మొత్తం మన జీడీపీకి అదనంగా తోడవుతుందన్నమాట! కోవింద్ కమిటీ తీసుకున్న జీడీపీ అంచనాలు కాస్త పాతవి. వాటి ప్రకారం జమిలి ఎన్నికలతో రూ.4.5 లక్షల కోట్లు అదనంగా జీడీపీకి తోడవుతాయి. అదనంగా పెరిగే 1.5 శాతం జీడీపీ అయిదు సంవత్సరాల కాలంలో మొత్తంగా పెరిగేదా? లేక ఎన్నికలు ఏటా ఎక్కడో ఒకచోట జరుగుతాయి కాబట్టి అది వార్షిక అదనపు వృద్ధిరేటా? అన్నదానిపై స్పష్టత లేదు. మన ఆర్థికాభివృద్ధిని తొలి ఎన్నికల (1952) నాటి నుంచి విశ్లేషించి చేసిన నిర్ధారణగా దాన్ని చెప్పలేం. జమిలికి సమర్థన కోసం వేసిన అంచనాగా మాత్రమే దాన్ని భావించగలం! జమిలి ప్రక్రియ 2029లో మొదలైతే ఆనాటికి జీడీపీ మరింత పెరుగుతుంది. రూ.700 లక్షల కోట్లకు అది చేరుకునే అవకాశం ఉంది. అంటే జమిలి వల్ల రూ.10 లక్షల కోట్లు అదనపు ప్రయోజనం కలుగుతుంది! అంకెల పరంగా గొప్పగానే ఉంది. ఇక ఆర్థికాభివృద్ధితో పాటు ద్రవ్యోల్బణం తగ్గుదల, పెట్టుబడుల పెంపు, వ్యయంలో గుణాత్మక మార్పు లాంటి ప్రయోజనాలు కూడా జమిలి ఎన్నికల వల్ల కలుగుతాయని కూడా కోవింద్ కమిటీ పేర్కొంది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే అనేక ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది!

మన ఆర్థిక వ్యవస్థపై ఎన్నో ప్రామాణిక పరిశోధనలు జరిగాయి. 2014 తర్వాత ప్రభుత్వ గణాంకాల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తినప్పటికీ ఆర్థిక వ్యవస్థకూ రాజకీయాలకూ ఉన్న సంబంధాల గురించి విలువైన విశ్లేషణలు మాత్రం తగ్గలేదు. జమిలి ఎన్నికలు పట్టాలు తప్పటం 1967 తర్వాత మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి నాలుగో సార్వత్రిక ఎన్నికల నాటి (1967) నుంచి ఎదురుదెబ్బలు ఎదురయ్యాయి. 1962 నాటి ఎన్నికలతో పోల్చితే 78 సీట్లు తగ్గిపోయాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 261 సీట్లు కావాల్సివస్తే కాంగ్రెస్ 283 సీట్లనే గెలుచుకుంది. తొమ్మిది రాష్ట్రాల్లో అధికారాన్నీ కోల్పోయింది. ఆ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన పార్టీలు ఎక్కువకాలం అధికారంలో ఉండలేకపోయాయి. ఒకటిరెండు చోట్ల మినహా కాంగ్రెసే ఏదోవిధంగా తిరిగి అధికారాన్ని పొందింది. కొన్నిచోట్ల అసెంబ్లీలు రద్దు అయ్యి మళ్లీ ఎన్నికలూ జరిగాయి. అప్పటి నుంచి ఏకకాలంలో ఎన్నికలు అసాధ్యమయ్యాయి. 1971లో లోక్‌సభకు కూడా మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 1980, 1991, 1998, 1999ల్లోనూ లోక్‌సభకు ముందుగానే ఎన్నికలు జరపాల్సిన పరిస్థితులు వచ్చాయి. రాజకీయ అస్థిరత వల్ల సకాలంలో విధాన నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితులు ఎదురయ్యాయనటంలో సందేహం లేదు. కానీ అవి దేశ జీడీపీని గణనీయంగా ప్రభావితంచేసే స్థాయికి ఎప్పుడూ వెళ్లలేదు. పూర్తిమెజారిటీ ఉన్న ప్రభుత్వాలు సరైన విధానాలు చేపట్టకపోవటంతో ఆర్థిక వ్యవస్థ అనుకున్నంతగా పరుగులు తీయలేదు. యుద్ధాలు, అనావృష్టి కూడా ఆర్థిక మందగమనానికి తోడ్పడ్డాయి. ఎన్నో విప్లవాత్మక విధానాలను తీసుకువచ్చి ఆచరణలో నీరుకార్చారు. సుస్థిర ప్రభుత్వాల హయాంలోనే ఇవన్నీ జరిగాయి. కానీ జమిలి ఎన్నికలు లేకపోవటంతో ఆర్థిక ప్రగతికి అడ్డంకులు ఏర్పడ్డాయని చెప్పేందుకు సాధికారిక సమాచారం లేదు.



ఏటా ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి విధానాల అమలుకు ఇబ్బందిగా ఉందనే వాదనను రాజకీయ దృష్టితో చేయొచ్చు. విధానాలను చేపట్టలేని అశక్తత నుంచి జమిలి ఎన్నికల ప్రతిపాదన ఉత్పన్నం కాలేదు. మొత్తం ఎన్నికల ప్రచారమంతా ఒకరిద్దరి నాయకుల చుట్టూ తిప్పే స్థాయికి రాజకీయాలు దిగజారిపోవటంతోనే అసలు సమస్య మొదలైంది. రాజకీయ అనిశ్చితిని, సంక్షోభాన్ని జమిలి ఎన్నికలు ఏ రకంగానూ ఆపలేవు. రెండేళ్లలో ప్రభుత్వం పడిపోతే మిగిలిన కాలానికి ఎన్నికలు జరపకా తప్పదు. ఖర్చూ తప్పదు. సభాకాలం తగ్గుతుంది తప్ప ఒరిగేదేమీ ఉండదు.

ఇక ఏకకాలంలో ఎన్నికలు జరిగినప్పుడు మన ఆర్థిక ప్రగతి అద్భుతమని చెప్పలేం. 1967 వరకూ మన తలసరి జాతీయ ఆదాయం పెరుగుదల రెండు సందర్భాల్లోనే 5 శాతం దాటింది. మూడు సందర్భాల్లో మైనస్‌లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాతా మైనస్‌లోకి వెళ్లిన ఏడాదులూ ఉన్నాయి. 2003–04 నుంచే అది 6 శాతం దాటటం మొదలైంది. జీడీపీలో కాస్త గణనీయ పెరుగుదల 1980ల నుంచి ఆరంభమైంది. అంతకుముందు 30 సంవత్సరాల సగటు అభివృద్ధి రేటు 3.5 శాతానికి కాస్త అటూఇటూగానే ఉండిపోయింది. 1980–81 నుంచి 1991–92 వరకూ సగటు వృద్ధి రేటు 5.3 శాతం నమోదైతే ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన తర్వాత అంటే 1992–93 నుంచి 2003–04 వరకూ 5.9 శాతానికి పెరిగింది.

తరచూ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందనీ భావించలేం. హరియాణానే తీసుకుందాం. అక్కడ 1968 నుంచి 2000 సంవత్సరాల మధ్యలో అయిదుసార్లు అసెంబ్లీలకు ముందుగా ఎన్నికలు జరగటంతో పాటు ముఖ్యమంత్రులూ అయిదేళ్లు కొనసాగని సందర్భాలు ఉన్నాయి. అవేమీ హరియాణా అభివృద్ధిపై తీవ్ర ప్రభావాన్ని చూపలేదు. ఇప్పటికీ తలసరి ఆదాయపరంగా మొదటి మూడు రాష్ట్రాల్లో హరియాణా ఉంది. కేరళలో 1960 నుంచి 1991 వరకూ ఆరుసార్లు ముందస్తు ఎన్నికలు వచ్చాయి. అయినా అక్కడ అభివృద్ధి కుంటుపడలేదు. మానవాభివృద్ధిలో ఆ రాష్ట్రమే ముందుంది. తమిళనాడులో మూడుసార్లు, కర్ణాటకలో రెండుసార్లు ముందస్తు ఎన్నికలు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో ఆరుసార్లు ముందస్తు ఎన్నికలు జరిగితే గుజరాత్, బిహార్, పశ్చిమ బెంగాల్‌ల్లో మూడుసార్లు జరిగాయి. ప్రధాన రాష్ట్రాల్లో కనీసం ఒక్కసారైనా ముందస్తు ఎన్నికలకు వెళ్లని పరిస్థితి లేదు. ఎక్కువసార్లు ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో తక్కువ అభివృద్ధి.. తక్కువసార్లు జరిగిన చోట ఎక్కువ అభివృద్ధి ఉన్నట్లు చెప్పటానికి ఆధారాల్లేవు. చేపట్టిన విధానాల్లోని మంచిచెడ్డలే ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేశాయి. ఉదాహరణకు అనేక పార్టీల సమాహారమైన యునైటెడ్ ఫ్రంట్ అధికారంలో ఉన్న 1996–97, 1997–98ల్లో కూడా జీడీపీ మామూలుగా పెరిగింది. రాజకీయ అనిశ్చితి ప్రభావం కన్పించలేదు. 1996–97లో జీడీపీ విలువ రూ.13,94,816 కోట్లు ఉంటే మరుసటి ఏడాది అది రూ. 15,45,294 కోట్లకు పెరిగింది. 1998–99లో రూ.17,72,297 కోట్లకు, 1999–2000 రూ.19,88,262 కోట్లకు చేరుకుంది. నిజానికి ఈ సంవత్సరాలన్నీ రాజకీయంగా తీవ్ర అనిశ్చితితో కొట్టుమిట్టాడాయి. నాలుగేళ్లల్లో మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికలు వచ్చాయి.

అవినీతి, పదవీకాంక్ష, తాయిలాల సంస్కృతి బాగా పెరుగుతున్నా పెద్ద రాష్ట్రాల్లో గత 25 ఏళ్లల్లో అనిశ్చితితో అసెంబ్లీలు రద్దుకాలేదు. గుజరాత్‌లో మాత్రం 2002లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 1980ల్లో ఖలిస్థాన్ హింసతో అట్టుడికిన పంజాబ్‌లో కూడా 1992 నుంచి సుస్థిరతే నెలకొంది. తరచూ ప్రభుత్వాలు పడిపోయి, సకాలంలో విధానాలు చేపట్టలేని దుస్థితి వస్తే జమిలి గురించి ఆలోచించినా అర్థం ఉంటుంది. నిజానికి ఈ 25 ఏళ్లలోనే రాష్ట్రాలు బలాన్ని సంపాదించుకున్నాయి. సొంత అభివృద్ధి నమూనాలను చేపట్టగలిగాయి. మరోవైపు దేశవ్యాప్తంగా కిందికులాలు రాజకీయ అధికారం కోసం పెద్దఎత్తున ప్రయత్నించటం ఆరంభమైంది. ఈ వర్గాలను ఆకట్టుకోటానికే జనాకర్షణ విధానాలు మొదలయ్యాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రకటించి ఎరలు చూపటంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినతరం చేయాల్సి వచ్చింది.



■ రాహుల్ కుమార్

ఏటా ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి విధానాల అమలుకు ఇబ్బందిగా ఉందనే వాదనను రాజకీయ దృష్టితో చేయొచ్చు. విధానాలను చేపట్టలేని అశక్తత నుంచి జమిలి ఎన్నికల ప్రతిపాదన ఉత్పన్నం కాలేదు. మొత్తం ఎన్నికల ప్రచారమంతా ఒకరిద్దరి నాయకుల చుట్టూ తిప్పే స్థాయికి రాజకీయాలు దిగజారిపోవటంతోనే అసలు సమస్య మొదలైంది. రాష్ట్రస్థాయి నాయకులను కాకుండా ప్రధానమంత్రో, మరో కీలక నాయకుడో ప్రచారం చేస్తే తప్ప గత్యంతరంలేని పరిస్థితికి స్థానిక నాయకత్వాలను నిర్వీర్యం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో మొదలైన ఈ సంస్కృతి బీజేపీలో ఇంకా వ్యవస్థీకృతం అయిపోయింది. మితిమీరిన అగ్రనాయక పూజతో వివిధ స్థాయిల్లోని నాయకులు జీరోలుగా మారారు. సర్వంసహా చక్రవర్తులుగా మారిన అగ్రనాయకులకు వస్తున్న ఇబ్బందితోనే జమిలి ఎన్నికల రాగం ఊపందుకుంది. రాజకీయ అనిశ్చితిని, సంక్షోభాన్ని జమిలి ఎన్నికలు ఏ రకంగానూ ఆపలేవు. రెండేళ్లలో ప్రభుత్వం పడిపోతే మిగిలిన కాలానికి ఎన్నికలు జరపకా తప్పదు. ఖర్చూ తప్పదు. సభాకాలం తగ్గుతుంది తప్ప ఒరిగేదేమీ ఉండదు. అయిదేళ్లపాటు విధానసభలు ఉండేలా ఎన్నుకునే స్వేచ్ఛను ఓటర్లకు లేకుండా జమిలి ఎన్నికలు చేస్తాయి.

10 శాతంగా ఉన్న ధనిక వర్గాల నుంచే ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్నారు. డబ్బు పంపకం (కిందటి ఎన్నికల్లో అధికార, అనధికార ఖర్చు అంచనా 1.35 లక్షల కోట్లు), తాయిలాలతో ఎన్నికలను భ్రష్టుపట్టిస్తున్న ఈ వర్గాలకు జమిలి ఎన్నికలతో లాభం ఉంటుంది.


ప్రజాస్వామ్య దేశాల్లో మనంత వైవిధ్యం ఉన్న దేశం ఎక్కడా లేదు. భాషలు, ప్రాంతీయ అస్తిత్వాలు ఆధారంగా బలంగా పాదుకున్న రాష్ట్రాలు భారత్‌లోనే ఉన్నాయి. వీటిని పట్టించుకోని జమిలి ఎన్నికలతో అదనంగా చేకూరే ప్రయోజనం ఏమీ ఉండదు. 10 శాతంగా ఉన్న ధనిక వర్గాల నుంచే ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్నారు. డబ్బు పంపకం (కిందటి ఎన్నికల్లో అధికార, అనధికార ఖర్చు అంచనా 1.35 లక్షల కోట్లు), తాయిలాలతో ఎన్నికలను భ్రష్టుపట్టిస్తున్న ఈ వర్గాలకు జమిలి ఎన్నికలతో లాభం ఉంటుంది. విడివిడిగా జరిగే ఎన్నికలతో ఈ వర్గాలకే ఖర్చు పెరుగుతుంది. ప్రజల హక్కుల కోణం నుంచి చూస్తే మాత్రం జరిగేది లాభమని చెప్పలేం.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

త్రిరత్న శిఖరం

అణగారిన బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే. మహాత్మ జ్యోతిరావు ఫూలే సహచరిగా ఆమె కృషిని కుదించడం క్షమించరాని నేరం. ఆమె భారతదేశపు చదువుల తల్లి. బ్రిటీష్ పాలిత భారతంలో సావిత్రి బాయి జీవితం, ఆమె చేసిన సేవ ఒక సువర్ణ అధ్యాయం. "విద్య లేక వివేకం లేదు. వివేకం లేక నీతి లేదు. నీతి లేక పురోగతి లేదు. పురోగతి లేక విత్తము లేదు. విత్తము లేకనే శూద్రులు అధోగతి పాలయ్యారు" అన్న మహాత్మా జ్యోతిరావు ఫూలే మాటలకు ఒక ఆచరణ రూపం వస్తే సావిత్రిబాయిలాగే ఉంటుంది. భారతదేశ విద్యా వ్యవస్థను ఒక మలుపు తిప్పిన ఈ దంపతుల సేవ, అంకితభావం అజరామరమైంది. తాము పుట్టిన శూద్ర జాతికే కాదు, ఊరవతల ఉండే పంచములకు, వెలివాడలకు సైతం అక్షరాలు అందించాలని ఫూలే దంపతులు తపించారు.

సావిత్రిబాయి జీవితాన్ని, ఆమె నిర్వహించిన పాత్రను సరిగా సమీక్షిస్తే ఆమె పేరును ఉన్నత శిఖరాల మీద నిలుపవలసి ఉంటుంది. ఒకవైపు కులవ్యవస్థ, మరోవైపు దాని ప్రతిఫలంగా కొనసాగిన పితృస్వామ్య వ్యవస్థ కింది కులాలను, స్త్రీలను కనీసం మనుషులుగా గుర్తించ నిరాకరించాయి. తత్ఫలితంగా చదువు, సంపద వంటి సమస్త హక్కులను వారికి దక్కకుండా చేశాయి. దీనికి తోడు విపరీతమైన అమానవీయ విలువలతో కూడిన మూఢాచారాలు ఆనాటి సమాజాన్ని పట్టి పీడించాయి. ఆ తిరోగమన విలువలపై కొరడా ఝుళిపించింది సావిత్రి బాయి. చదువు ప్రాముఖ్యతను గుర్తించి అక్షరాలను అందించి సమాజాన్ని విముక్తి చేయడం కోసం తన వంతు పాత్రను పోషించింది.



సాంఘిక విప్లవకారిణిగా సావిత్రిబాయి వేసిన ప్రభావం విలువైనది. ఇవాళ లక్షలాది మంది అమ్మాయిలు చదువు ద్వారా తమ జీవితాలను మార్చుకుంటున్నారంటే అందుకు కారణం సావిత్రిబాయి నాడు ప్రారంభించిన విద్యా ఉద్యమమే. చదువు, సేవ, సాహిత్యమనే మూడు రత్నాలను అధిరోహించిన సాహసి సావిత్రి బాయి. ఆ మహాతల్లిని భారత రత్నతో సత్కరించుకోవాలి.

వేదాలు వింటే చెవుల్లో సీసం పోసిన వ్యవస్థ. వేదాలు చదివితే నాలుకలు తెగ్గోసిన చరిత్ర. ఇలాంటి మనువాద సమాజంలో తొమ్మిదేళ్ల సావిత్రి బాయికి, పన్నెండేళ్ళ జ్యోతిరావు ఫూలేతో వివాహం అయ్యింది. స్త్రీవిద్య ద్వారా తన కుటుంబమే కాదు, ఈ సమాజానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని గ్రహించాడు ఆ మహనీయుడు. అట్లా సావిత్రిబాయిని వివాహ అనంతరం చదివించాడు. చదువు విలువను కనుగొన్న సావిత్రిబాయి దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా ఎదిగింది. బాలికల కోసం తొలి పాఠశాలను 1848లో నెలకొల్పారు. ఫలితంగా ఫూలే దంపతులను ఈ సమాజం వెలేసింది. అయినా సరే పట్టువిడువకుండా విద్యావ్యాప్తికి కృషి చేసి కేవలం నాలుగేండ్లలోనే ఇరవై పాఠశాలలు నెలకొల్పారు. అట్లా అప్పటి దాకా విద్యకు దూరం చేయబడిన దళితులు, శూద్రులు, మహిళలకు విద్యను నేర్పడంకోసం వారి జీవితకాలంలో 52 పాఠశాలలు నెలకొల్పి సరికొత్త చరిత్రను సృష్టించారు సావిత్రిబాయి.

విద్య ద్వారా అందివచ్చిన చైతన్యంతో సావిత్రిబాయి అప్పటి సమాజంలోని దురాచారాల మీద యుద్ధం ప్రకటించింది. వితంతువులకు శిరోముండనాలు చేయొద్దని పోరాటం చేసింది. అలాగే 1873లో ఫూలే స్థాపించిన 'సత్య శోధక్ సమాజ్' ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించి సమాజాన్ని ఆలోచింపజేశారు. భర్త చనిపోతే భార్యను సైతం కాష్టంలో వేసి తగలబెట్టిన సమాజంలో, వాటిని అడ్డుకొని వితంతువులకు ఆశ్రయం కల్పించారు సావిత్రిబాయి. మహిళల హక్కుల కోసం 1852లో మహిళా సేవా మండల్‌ను ఏర్పాటు చేశారు. ఈ దురాచారాలకు ఆధారంగా నిలుస్తున్న కుల వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించే ప్రయత్నం చేశారు సావిత్రి. అంతేకాదు సామాజిక సేవ కార్యక్రమాలను అలుపెరుగకుండా కొనసాగించారు. 1870, 1896లలో వరుసగా వచ్చిన దుర్భర కరువు కాలంలో పేదలను ఆదుకునేందుకు సావిత్రిబాయి నడుం కట్టారు. రోజుకు 2 వేల మంది అనాథ పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం జోలెపట్టి విరాళాలు సేకరించారు. అంతేకాదు ప్రాణాలకు తెగించి 1897లో పూణే పరిసర ప్రాంతాల్లో సంభవించిన ప్లేగు వ్యాధి బాధితులకు సేవలు చేశారు. ఆ ప్లేగు బారినే పడి ప్రాణాలు విడిచారు.

ఇక సామాజిక ఉద్యమకారిణిగా, ఉపాధ్యాయురాలిగా, సంఘసంస్కర్తగానే కాదు; కవయిత్రిగా, రచయిత్రిగా సావిత్రిబాయి సంధించిన అక్షర అస్త్రాలు ఎంతో విలువైనవి. హేతుబద్ధతే ప్రామాణికమైన సావిత్రి బాయి కవిత్వం 'కావ్యఫూలే' (1854), 'పావన కాశీ సుబోధ రత్నాకర్' (1891)లతో పాటు 'కర్జ్' వంటి వ్యాసాలు రాశారు. సాంఘిక విప్లవకారిణిగా సావిత్రి బాయి వేసిన ప్రభావం విలువైనది. ఇవాళ లక్షలాదిమంది అమ్మాయిలు చదువు ద్వారా తమ జీవితాలను మార్చుకుంటున్నారంటే అందుకు కారణం సావిత్రిబాయి నాడు ప్రారంభించిన విద్యా ఉద్యమమే. ఇన్ని రకాల పాత్రల్లో ఒదిగిపోయిన ఆ మహాతల్లికి ఈ సమాజం పట్ల ఎనలేని మమకారం ఉంది. తాను ఎదిగి వచ్చిన సమాజానికి తన వంతుగా తిరిగి అందించడం సామాజిక బాధ్యతగా భావించారు. అడుగడుగునా అవాంతరాలను, అడ్డంకులను ఎదుర్కొని సావిత్రిబాయి కొనసాగించిన చారిత్రాత్మకమైన పాత్రను ఇవాళ పాలకులు గుర్తించాలి. చదువు, సేవ, సాహిత్యమనే మూడు రత్నాలను అధిరోహించిన సాహసి సావిత్రిబాయి. ఆ మహాతల్లిని భారతరత్నతో సత్కరించుకోవాలి. అలాగే తమ జీవితాలను మార్చిన చదువుల తల్లి సావిత్రిబాయి జన్మదినాన్ని బహుజనులు ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలి. ఆమె మార్గంలోనే చదువు, మూఢనమ్మకాల నిర్మూలన, సామాజిక సేవను రోజు వారి జీవితంలో భాగం చేసుకోవాలి. అదే ఆ మహాతల్లికి ఘననివాళి అవుతుంది.

● డా. పసునూరి రవీందర్

(నేడు సావిత్రిబాయి ఫూలే జయంతి)

బైటపడిన బీజేపీ బండారం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా బి.ఆర్. అంబేడ్కర్ గురించి అవహేళనకరంగా, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్రమైన వ్యతిరేకతకు దారితీశాయి. దళిత, బహుజన వర్గాలు అమిత్ షా రాజీనామా చేయాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో– ముఖ్యంగా మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ నాయకత్వంలో– పార్లమెంట్‌లో అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టారు. అంబేడ్కర్‌పై అవహేళనను ఖండిస్తూ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులు నిరసనను వ్యక్తం చేశాయి.

పార్లమెంట్‌లో జరిగిన చర్చలో రాజ్యాంగ నిర్మాణంలో బీజేపీ లేదా ఆరెస్సెస్ పాత్ర ఏ మాత్రం లేదు. బీజేపీ మూల శక్తులు స్వాతంత్ర్య పోరాటంలో నిష్క్రియంగా ఉండడమే గాక, రాజ్యాంగ రూపకల్పనలో కూడా ఎలాంటి పాత్ర పోషించలేదు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందిన భారత రాజ్యాంగం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచింది. సహజంగానే రాజ్యాంగంపై ఈ చర్చ బీజేపీకి అసహనాన్ని కలిగించింది. అంబేడ్కర్ ప్రాముఖ్యతను తట్టుకోలేకపోతున్న బీజేపీ నేతలు ఆయనపై విమర్శలు చేయడం ద్వారా తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను బీజేపీ అణచివేసే ప్రయత్నాలు చేస్తోంది. రాహుల్‌గాంధీపై తప్పుడు ఆరోపణలు చేసి కేసులు పెట్టడం, కాంగ్రెస్ నేతల గొంతులను నొక్కేందుకు కుట్రలు పన్నడం దీనికి స్పష్టమైన ఉదాహరణ. అయితే ప్రజలు ఈ కుట్రలను గమనిస్తూ బీజేపీని తిరస్కరిస్తున్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత హామీల్లో చాలా వరకు విఫలమైంది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా అదానీ అంబానీ వంటి కొద్దిమంది వ్యాపారవేత్తల కోసం దేశ ఆర్థిక వ్యవస్థను తాకట్టు పెట్టింది. బీజేపీ పాలనలోని వైఫల్యాలపై, అన్యాయాలపై ప్రజలు గళమెత్తుతున్నారు. అంబేడ్కర్‌ను అవమానించడమే కాకుండా, రాజ్యాంగ స్ఫూర్తిని హరించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవడానికి బీజేపీ ప్రయత్నించిన మార్గాలు ఇక సాగవు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం దేశ ప్రజలు ఏకతాటిపైకి వస్తున్నారు.

– వేముల వీరేశం, నకిరేకల్ శాసనసభ్యులు

ఆ పదేళ్ళూ ఏమైంది మీ బీసీ ప్రేమ?

నేడు దేశవ్యాప్తంగా మొత్తం జనాభా లెక్కలతో పాటు కులాలవారీగా అన్ని సామాజిక వర్గాల జనాభా లెక్కలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఎంతో ఉంది. ముఖ్యంగా బీసీ జనాభా ఎంత ఉన్నదో అంతకు తగినట్టు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు లేక పోవడంతో వారు చట్టసభలలో తగిన ప్రాధాన్యతను పొందలేకపోతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుల గణన బీసీల రాజకీయ రిజర్వేషన్లకు, ఆర్థిక అసమానతల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని యావత్ బీసీ కులాలు భావిస్తున్నవి. ముఖ్యంగా బీసీ, ఎంబీసీల మధ్య రాజకీయ ప్రాతినిధ్యంలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. ప్రభుత్వాల నుంచి పొందే అవకాశాలలో కూడా అంతే స్థాయిలో అసమానతలు ఉన్నాయి. వీటిని సమతుల్యం చేసేలా ప్రత్యేక బీసీ కమిషన్‌తో పూర్తి సమాచారాన్ని సేకరించి, రిజర్వేషన్ ఫలాలు అందని బీసీలకు ఈ కులగణన లెక్కలతో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట తప్పదని బీసీలు భావిస్తున్నారు.



గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఒక రోజు సమగ్ర కుటుంబ సర్వేను అసలు ఎందుకు చేశారో, ఆ లెక్కలు ఎక్కడున్నాయో, అందులో బీసీ జనాభా శాతం ఎంతో, ఆ లెక్కలు బయట పెట్టకుండా పదేళ్ళ పాటు ఏం చేశారో ఎవరికీ తెలియదు. కల్వకుంట్ల కవిత మాత్రం ఇప్పుడు బీసీలు 52 శాతం పైగా ఉన్నారు అంటున్నది. ఈ లెక్క వారికి తెలిసినప్పుడు తమ పార్టీ ఒక దశాబ్ద కాలం అధికారంలో ఉన్నప్పుడు, ఎందుకు బీసీలు, ఎంబీసీలు గుర్తుకు రాలేదు? గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ బీసీలకు చట్టసభల్లో ఎన్ని సీట్లు ఇచ్చిందో, అధికారంలో బీసీల ప్రాధాన్యత ఏంటో మన కళ్ళ ముందు కనిపిస్తున్నది కదా! తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ 2014–22 వరకు ఎనిమిదేళ్ళ పాటు టీఆర్ఎస్ పార్టీగా, 2022 నుంచి రెండేళ్ళ పాటు బీఆర్ఎస్ పార్టీగా, మొత్తం పదేళ్ళు అధికారంలో ఉండి, ఏ రోజు కూడా బీసీ కుల గణన గురించి, రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదు. అధికారం కోల్పోయిన తర్వాత బీసీలపై, కుల గణనపై మొసలి కన్నీరు కారుస్తోంది. గతంలో బీసీలతో ఒక్క మాటా ముచ్చట లేకుండా, ఎలాంటి కమిటీ వేయకుండా 33 శాతం ఉన్న రిజర్వేషన్స్ 23 శాతానికి తగ్గించినప్పుడు కవిత ఎందుకు కేసీఆర్‌ను ప్రశ్నించి ఎన్నికలను అడ్డుకోలేదు? ఎందుకు బీసీలపై జరుగుతున్న దాడులను, అన్యాయాలను అరికట్టడానికి బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురాలేకపోయారు? వీటన్నింటినీ ప్రశ్నించేందుకు అప్పుడు ఒక్క బహిరంగ సభకైనా ఎందుకు పిలుపునివ్వలేదు? స్థానిక సంస్థలలో తీరని అన్యాయం జరుగుతుందని అనేక బీసీ సంఘాలు, మేధావులు, బీసీ విద్యార్థి సంఘాలు ధర్నాలు, సెమినార్ల ద్వారా ఆవేదనను వ్యక్తం చేసినప్పటికీ ఏనాడూ బీసీలను పిలిచి మాట్లాడే సమయమే ఇవ్వని కేసీఆర్ కుటుంబం–నేడు అధికారం కోల్పోయిన తర్వాత బీసీల రిజర్వేషన్లపై అధ్యయనం పేరిట పార్టీ నాయకుల బృందాన్ని ఒక్కో రాష్ట్రానికి పంపి 'అదిగో బీసీలకు ఆ రాష్ట్రాల్లో రిజర్వేషన్స్ ఇలా ఉన్నాయి, మీరు ఇలా చేయండి' అంటూ సరికొత్త డ్రామా మొదలెట్టింది.

ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీకి బీసీలపైన ఎక్కడ లేని చిత్తశుద్ధి పుట్టుకొచ్చినట్టుంది. బీసీలకు నాయకత్వం వహించడానికి ఒక్క బీసీ లీడర్ కూడా లేదు అన్నట్లు కవిత నాయకత్వం వహించడం బీసీలకు అవమానకరం. అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు ఫూలే విగ్రహం పెట్టాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. కానీ ముందు ఆయన కోరుకున్న సమానత్వాన్ని మీరు మీ పార్టీలో అమలు చేయాలి కదా! పార్లమెంటులో మహిళా బిల్లు పెట్టినప్పుడు అందులో బీసీ మహిళల వాటా గురించి ఎన్నడూ మాట్లాడని కవిత తెలంగాణలో చేస్తున్న కుల గణనలో తప్పులు వెతుకుతూ బీసీలకు న్యాయం జరగాలని బీసీ కమిషన్‌కి వినతిపత్రం ఇవ్వడం ఆశ్చర్యమే! ఈ బీసీ రిజర్వేషన్ల వల్ల గతంలో ఆయా సామాజిక వర్గాల నుంచి తమ పార్టీకి ఉన్న పట్టు కోల్పోతామేమో అన్న భయం బీఆర్ఎస్‌లో మొదలైంది. కుల గణనపై వారికి ఏ భయమూ లేనట్టయితే వారు చేసిన ఒక్కరోజు సమగ్ర కుటుంబ సర్వే ఫలితాలను ఆనాడే ప్రజలకు చెప్పేవారు. కానీ అలా జరగలేదంటే వారికి ఎక్కడో, ఎందుకో బీసీల భయం పట్టుకుంది. అందుకే కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఇంత ద్వేష భావం ఎందుకు? ఇది బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చేసి తీరుతామన్న రాహుల్‌గాంధీపై, రేవంత్‌రెడ్డిపై ద్వేషమా? లేక బీసీలపై ద్వేషమా?

■ మండ్ల రవి
ఉస్మానియా యూనివర్సిటీ

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 1976లో నెల్లూరు జిల్లా కావలి, ప్రస్తుత జవహర్ భారతి కళాశాలలో, కీ.శే. మలిరెడ్డి పట్టాభి రామరెడ్డి నేతృత్వంలో పురుడుపోసుకుంది. అప్పటి నుండి నేటి వరకు క్రమం తప్పకుండా, వార్షిక సభలు జరుపుకొంటున్నది. ఈ సభల్లో సంస్థ సభ్యులు తమ తమ పరిశోధనా రంగాల్లో చేస్తున్న కృషి ఆధారంగా, పరిశోధన పత్రాలు సమర్పిస్తున్నారు. వాటిని సంపాదీకరించి, సంపుటంగా, ఇప్పటికి 46 సంపుటాలు ప్రచురించింది. ఈ క్రమంలో మొదటి సంపుటం 2003లో విడుదలై, 2016లో ముగిసింది. ఆఖరి సంపుటం– తెలుగువారి చరిత్ర-సంస్కృతులకు సంబంధించిన ఆధారాలను, అన్నింటినీ సమీకరించి, క్రోడీకరించి (5000 బి.సి–ఎ.డి. 2006 వరకు) ఒక బృహత్ సంపుటంగా 2017లో వెలువరించింది. తెలుగువారి చరిత్రకు సంబంధించిన సమస్త ఆధారాలను, చారిత్రక దశలవారీగా విభజించి, ప్రచురించింది. చరిత్రకారులకు, పరిశోధకులకు ఈ సంపుటం కరదీపికలాంటిది. కేవలం గ్రంథాల వివరణ మాత్రమే కాక, వివిధ పరిశోధనా సంచికల్లో వెలువడ్డ వ్యాసాలను క్రమపద్ధతిలో అమర్చింది.

ఈ బృహత్తర కృషి భావితరాలకు అందించేందుకు వీలుగా, మనసు ఫౌండేషన్ చైర్మన్ వెంకటరాయుడు ఈ ప్రచురణలను డిజిటలైజ్ చేసి భావితరాలకు అందే వీలు కల్పించారు. ఈ సంవత్సరం చరిత్ర సభలు జనవరి 4, 5 తేదీలలో తిరుపతి జిల్లా గూడూరులోని ఎస్.కె.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డా. కె.శివప్రసాద్, స్థానిక కార్యదర్శి డా. గోవిందు సురేంద్రల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ నలు మూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంలో కీ.శే. మామిడిపూడి వెంకట రంగయ్య స్మారకోపన్యాసం, గ్రంథావిష్కరణలు ప్రత్యేకించి తెలుగు వారి ప్రాచీన కళారూపం తోలుబొమ్మలాట ప్రదర్శన జరుగుతుంది.

– వకుళాభరణం రామకృష్ణ
ఆం.ప్ర. చరిత్ర కాంగ్రెస్ సంస్థాపక సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



పరుగుల కెరటం.. అర్జున కిరీటం..



పారా ఒలింపిక్స్‌లో సాధించిన కాంస్య పతకంతో దీప్తి (ఫైల్)



ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ అవార్డుకు జీవంజి దీప్తి ఎంపిక

- ఈ ఘనత సాధించిన తొలి పారా అథ్లెట్‌గా గుర్తింపు
- అవమానాలు, కష్టాలను ఎదురొడ్డి లక్ష్యం వైపు పరుగెత్తిన సివంగి
- క్రీడావేదికపై రెపరెపలాడిన ఓరుగల్లు పతాక

7

ఆమె అందరి లాంటి అమ్మాయి కాదు. ఎన్నో అవమానాలను దాటిన ధైర్యశాలి. సూటిపోటి మాటలను లెక్కచేయక.. లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం శ్రమించిన సాహసి. పతకాలే లక్ష్యంగా పరిగెత్తిన సివంగి. పేదరికం మాటున పుట్టిపెరిగినా.. కష్టాలు, కన్నీటిని దిగమింగి తల్లిదండ్రులు, గురువులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఓరుగల్లు కీర్తిపతాకను రెపరెపలాడించిన పరుగుల కెరటం జీవంజి దీప్తి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి స్వగ్రామంలోనే పదో తరగతి చదివింది. అక్కడే అథ్లెటిక్స్‌లో రాణించిన ఆమె 2016నుంచి హైదరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, వరంగల్‌కు చెందిన నాగపురి రమేష్ వద్ద శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించింది. ఈ క్రమంలోనే గతేడాది ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 9 వరకు పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో 400మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని ముద్దాడి.. రాష్ట్రం నుంచి పారా ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది. అలా ఎన్నో సవాళ్లు, అవమానాలు, పేదరికాన్ని, వైకల్యాన్ని జయించి మరీ ఓరుగల్లు కీర్తి బావుటా ఎగురవేసిన దీప్తిని కేంద్రం ప్రభుత్వం అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. దీంతో ఉమ్మడిజిల్లా వాసులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తుండగా... గతంలో ద్రోణాచార్య అవార్డు అందుకున్న గురువు రమేష్‌కు తగిన శిష్యురాలిగా దీప్తి ప్రశంసలందుకుంటోంది.

- వరంగల్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, జనవరి2(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ మహిళల అభివృద్ధి జరుగుతుందన్నారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయటం, మహిళా సంఘాల ద్వారా ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ కేంద్రాలను గుర్తించడం, ప్రతీ మండంలో 350 మందిని గుర్తించి వారికి టైలరింగ్ తర్ఫీదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధి కారులకు సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, డీఆర్‌ఓ గణేష్, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు, తహశీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్‌కు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయిస్తాం..

- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- ముసలమ్మకుంట వద్ద స్థల పరిశీలన చేసిన కలెక్టర్



పండ్ల మార్కెట్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన కలెక్టర్ సత్యశారద, చాంబర్ అధ్యక్షక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తదితరులు

వరంగల్ వ్యవసాయం, నవరి 2:(ఆంధ్రజ్యోతి): పండ్ల మార్కెట్ వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయిస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశంలో మిర్చి, కాటన్, టర్మరిక్ ఎగుమతులపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి జిల్లాలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన మామిడి పండ్లకు ఇతర దేశాలలో మంచి డిమాండ్ ఉందని, పండ్ల పంటలను, మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ సత్యశారద గురువారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, మార్కెట్లో చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పండ్ల మర్చంట్స్ అధ్యక్షుడు వెల్ది సాంబయ్య ఇతర ప్రతినిధులతో కలిసి ముసలమ్మకుంట సమీపంలోని గోదాముల వద్ద స్థలాన్ని సందర్శించారు. అక్కడ పండ్ల మార్కెట్ ఏర్పాటుకు కావల్సిన రోడ్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై మార్కెట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ -2 కార్యదర్శి రామోజు రాము, పండ్ల వ్యాపారుల ప్రతినిధులు దొంగల చెన్నమల్లు యాదవ్, వెల్ది చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

8

- ఐక్యంగా పార్టీ పటిష్ఠానికి పాటు పడాలి
- సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో పని చేయాలి
- కార్యకర్తల సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి

8

సాఫల్యమయ్యేదెన్నడో

ఎంజీఎంలో ఐవీఎఫ్ కేంద్ర ఏర్పాటులో తీవ్రజాప్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వివాహమై ఏళ్లు గడిచినా సంతానం కలగని దంపతులు ఎంతో మంది ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అమ్మ, నాన్న అని పిలుపించుకోవాలనే తాపత్రాయంతో రూ.లక్షల్లో ఖర్చు చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ ఫర్టిలిటీ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. పేద, మధ్య తరగతి వారికి ఇది తలకు మించిన భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో సంతానలేమి సమస్యలను పరిష్కరించేందుకు.. పేద, మధ్యతరగతి వర్గాల వారికి ఫర్టిలిటీ సేవలు అందించేందుకు ప్రభుత్వం నుంచి సరైన ప్రయత్నాలు జరగకపోవడంతో ఆయా వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. సర్కారు దవాఖానాల్లో ఈ సౌకర్యాలు లేకపోవటంతో కొందరు తప్పనిపరిస్థితుల్లో ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంతానలేమి సమస్యతో బాధపడేవారికి ఊరట కలిగించేలా.. పైసా ఖర్చు లేకుండా చికిత్స అందించేందుకు వరంగల్ ఎంజీఎంలో ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ దిశగా ఐదేళ్లుగా జరుగుతున్న ప్రయత్నాలు ఎప్పటికి సఫలమవుతాయనేది చర్చగా మారింది.

- ఐదేళ్లుగా తప్పని ఎదురుచూపులు
- 2017లో జీవో జారీ.. 2023లో నిధుల కేటాయింపు
- నేటికీ ముందుకు పడని అడుగులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 30 నుంచి 40శాతం మందిలో ఫర్టిలిటీ సమస్యలు
- సంతానం కల సాకారం కోసం 'ప్రైవేట్'ను ఆశ్రయిస్తున్న దంపతులు
- వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు
- ఇదే అదనుగా ఆస్పత్రుల యాజమాన్యాల వసూళ్ల దందా
- పేద, మధ్యతరగతి వర్గాలకు మరింత భారం
- పెద్దమొత్తంలో చెల్లించలేక మానసిక, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలు




సంతానలేమితో సతమతం

కాలానికి అనుగుణంగా ఆహార అలవాట్లు, మానవుల జీవన విధానం మారుతోంది. దీంతో పాటే సంతాన ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతోంది. ఉరుకులపరుగుల జీవితంలో డబ్బు సంపాదనపై ఉన్న ఆశతో రాత్రింబవళ్లు విధులపైనే ఫోకస్ చేస్తున్నవారు ఉన్నారు. దీంతో పాటు ఆహార అలవాట్లు, ఇతరత్రా కారణాలతో సంతాన భాగ్యానికి నోచుకోలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26శాతం మంది దంపతులు సంతానలేమితో బాధపడుతున్నట్లుగా ఇటీవల ఓ సర్వే తేల్చింది. అందులో ఉమ్మడి వరంగల్ లాంటి ప్రాంతంలో ఈ సమస్య 30నుంచి 40శాతం వరకు ఉన్నట్టుగా గుర్తించింది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని దంపతులు ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పిల్లలు లేకపోతే సమాజంలో తలెత్తుక తిరిగే పరిస్థితి లేదని భావిస్తున్నవారు చాలామంది ఉన్నారు. అలాంటివారు పిల్లల కోసం ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాలను సంప్రదిస్తున్నారు. ఇటీవల కాలంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాలతో పాటు మహబూబాబాద్, జనగామ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కూడా ఈ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. పిల్లల కోసం వచ్చే దంపతుల ఆకాంక్షలను ఆసరాగా చేసుకుని రూ.1లక్ష నుంచి రూ.ఐదారు లక్షలకు పైగా లాగేస్తున్న సెంటర్లు కూడా ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఈ ఐవీఎఫ్ సెంటర్లపై పర్యవేక్షణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా ఫీజులు లాగుతున్నారనే విమర్శలున్నాయి. అయితే రూ.లక్షల్లో ధారబోసినా సంతానం కలగని వారు కూడా అనేక మంది ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్య కేంద్రాల ద్వారా ఉచితంగా సేవలు అందించాలనే లక్ష్యంతో అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ ఐదేళ్లైనా వరంగల్ ఎంజీఎంలో సంతాన సాఫల్య కేంద్రానికి మోక్షం లభించకపోవటంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు.

ఐదేళ్ల కల.. ఐవీఎఫ్ కేంద్రం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలామంది దంపతులు సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. పెళ్లయి ఏళ్లు గడుస్తున్నా సంతానం లేకపోవటంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల్లో ఖర్చు చేస్తూ సంతాన సాఫల్య కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం హైదరాబాద్ గాంధీ అస్పత్రితో పాటు వరంగల్ ఎంజీఎం అస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 2017లో జీవో నెం.520ని విడుదల చేసింది. రూ.2.50కోట్ల వ్యయంతో ఎంజీఎంలో ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. 2018లోనే వరంగల్ సీకేఎం అస్పత్రిలో ఐవీఎఫ్ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలు చేసింది. ఆ సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు కనుమరుగైంది. ఆ తరువాత 2020, 2021లో కరోనా విజృంభించటంతో పాటు నిధుల లేమితో ఐవీఎఫ్ కేంద్రం ఊసేలేకుండా పోయింది. 2023లో మళ్లీ తెరపైకి సర్కారు సంతాన సాఫల్య కేంద్రం వచ్చింది. సీఎంకేం అస్పత్రిలో ఐవీఎఫ్ సెంటర్ ఏర్పాటుకు వైద్యాధికారులు స్థల పరిశీలిన చేశారు. ఐవీఎఫ్‌కు కావాల్సిన అనుకూల పరిస్థితులు లేకపోవడంతో 2023 మార్చి 8వ తేదీన ఎంజీఎం అస్పత్రిలో మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్‌సీ) భవనంపై అంతస్థులో 3,500 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. వరంగల్ ఎంజీఎంతో పాటు హైదరాబాద్‌లోని గాంధీ అస్పత్రి, పేట్లబురుజు అస్పత్రుల్లో ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.23,48,418ను విడుదల చేసింది. అందులో వరంగల్ ఎంజీఎంలో ఏర్పాటు చేసే ఐవీఎఫ్ సెంటర్ కోసం రూ.7.83కోట్లను రాష్ట్ర వైద్యఆరోగ్య, మౌలిక సేవల సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) నుంచి కేటాయించారు. అయితే గాంధీతో పాటు పేట్లబురుజు అస్పత్రిలో ఐవీఎఫ్ సెంటర్లు పూర్తయినా వరంగల్ ఎంజీఎంలో మాత్రం సంతాన సాఫల్య కేంద్రం పనులు అడుగు ముందుకు పడటం లేదు. ఐదేళ్లుగా సంతాన సాఫల్య కేంద్రం

మిగతా 7వ పేజీలో...



జావలిన్ త్రోలో పాల్గొన్న క్రీడాకారిణి

ముగిసిన సీఎం కప్ క్రీడలు

రెజ్లింగ్, అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

8

లక్ష్యాలను సకాలంతో పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో వేగం పెంచి అక్ష్యాలను పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బల్దియా పరిధిలో స్మార్ట్‌సిటీ నిధులతో పాటు ఇతర నిధులతో చేస్తున్న పనులను బల్దియా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. బాలసముద్రం, పోతననగర్ సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్వహణ పరిశీలనతో పాటు వివిధ ప్రాంతాల్లో స్మార్ట్‌సిటీ నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాంపూర్ బయో మైనింగ్ పనులు రెండు మాసాల్లో వంద శాతం పనులు పూర్తి చేయాలన్నారు. నయీంనగర్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్ పనులలో పురోగతి సాధించాలన్నారు. అదే విధంగా క్రిష్టియన్ కాలనీలో నిర్మితమవుతున్న కమ్యూనిటీ హాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్, డీఈ సంతోష్‌బాబు, స్మార్ట్‌సిటీ పీఎంఈ భాస్కర్‌రెడ్డితో పాటు ఏఈలు పాల్గొన్నారు.

ఈ నెల 5న ఓ సిటీ ప్లాట్లకు వేలం

'కుడా' ఆధ్వర్యంలో వరంగల్ ఓ సిటీలో అభివృద్ధి చేసిన ప్లాట్లను ఈ నెల 5న వేలం పాట ద్వారా విక్రయిస్తున్నట్టు కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. గురువారం కుడా పరిధిలోని ఓ సిటీ ప్లాట్లను వారు సంయుక్తంగా సందర్శించారు. కుడా లేఔట్ ద్వారా గుర్తింపు పొంది 200, 300 స్కేర్ యార్డ్స్ ప్లాట్లను విక్రయించనున్నట్టు వారు వెల్లడించారు. వరంగల్ నగరంతో పాటు వరంగల్ రైల్వే స్టేషన్‌కు అతి తక్కువ దూరంలో ఈ ప్లాట్లు విక్రయించనున్నట్లు, ఆసక్తి కలిగిన ప్రజలు కొనుగోలు చేసి లాభాలు ఆర్జించాలన్నారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజీత్‌రెడ్డి, ఈఈ భీంరావు, సెక్రెటరీ మురళీధర్‌రావులతో పాటు జేపీవో శంకర్ పాల్గొన్నారు.



పోతననగర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కదం తొక్కిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

- మాటిచ్చిన రేవంత్‌రెడ్డి మరువొద్దని వేడుకోలు
- నగరంలో మహార్యాలీ
- కాళోజీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతులు



కాళోజీ విగ్రహానికి వినతిపత్రం అందచేస్తున్న జేఏసీ నాయకులు

హనుమకొండ టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు కదం తొక్కారు. సమగ్రశిక్ష అసోసియేషన్ ఆల్‌వింగ్స్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేర కు 27 రోజులుగా ఏకశిలా పార్కు వద్ద దీక్షలు చేస్తున్న వారు గురువారం మహార్యాలీ నిర్వహించారు. ర్యాలీకి వేలాదిమంది మంది ఎస్‌వోలు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, డీఎల్ఎంటీలు, యూఆర్ఎస్ సీఆర్టీలు, సీఆర్పీలు, ఐఈ ఆర్పీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు పీటీఐలు, ఎంఐఎస్‌లు, మెస్సెంజర్‌లు తరలి రావటంతో హనుమకొండ కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు దద్దరిల్లింది. రెగ్యులరైజ్ చేసే వరకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలంటూ నినాదాలతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 19,350 మంది 27రోజులుగా సమ్మెదీక్షలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎటువంటి హామీ ఇవ్వకుండా మంత్రులు నిర్లక్ష్యంగా సమ్మె విరమించమనటం అన్యాయం అన్నారు. సీఎం చేతిలోనే విద్యాశాఖ కూడా ఉన్నందున తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా భారతమాత, రాణిరుద్రమ, శివుడు, సమ్మక్క, ప్రతాపరుద్రుడు, పోతరాజుల వేశాధారణల నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. కాళోజీ, అంబేద్కర్ విగ్రహాలకు ఎస్ఎస్ఏ డిమాండ్‌ల వినతిపత్రాలను అందించి నిరసన వ్యక్తం చేశారు. కిలోమీటర్‌ల మేర ర్యాలీ కొనసాగటంతో పోలీసులు ట్రాఫిక్ బందోబస్త్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దొనికెల శ్రీధర్‌గౌడ్, షఫీ, కుమార్, రమేష్, మనోజ, సరిత, రుద్రారపు రాజు, తండా రమేష్, పాకనాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరింస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 1 నుంచి 31 వరకు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం హుస్నాబాద్‌లోని క్యాంపు ఆఫీస్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆర్టీఏ అధికారులు ఆవిష్కరింపజేశారు. అదే విధంగా జిల్లాలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీటీసీ పుప్పాల శ్రీనివాస్ మాసోత్సవాల్లో భాగంగా నిత్యం ప్రమాదాలకు కారణమయ్యే 9 అంశాలపై ఈ నెలాఖరు వరకు ప్రజలకు అవగహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ అదనపు ఏసీపీ రవి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎంవీఐలు రమేశ్ రాథోడ్, కిషోర్‌బాబు, ఉదయ్, శ్రావ్య, రోడ్డు భద్రత ఇన్‌స్పెక్టర్ బొలగాని శ్రీనువాస్‌రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జంగా రాఘవరెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఆయిల్‌సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయంలో తెలంగాణ ఆయిల్‌సీడ్ కార్పొరేషన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి నాగేశ్వర్‌రావుతో కలిసి రాఘ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జంగా

సీపీని కలిసిన జనగామ నూతన ఏఎస్పీ

వరంగల్ క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ డివిజన్ నూతన ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పండరి చేతన్ నితిన్ గురువారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఏఎస్పీ.. గత ఏడాది శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తుండగా ప్రభుత్వం జనగామ ఏఎస్పీగా నియమించింది.



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ చేతన్ నితిన్

నర్సంపేటకు స్టేషన్‌కు శిక్షణ కోసం ట్రెయినీ ఐపీఎస్



ఐపీఎస్ అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నర్సంపేట టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో భాగంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించేందుకు ఐపీఎస్ అధికారి మనన్‌భట్ గురువారం నర్సంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఐపీఎస్ అధికారికి నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ రమణమూర్తి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవికుమార్, అరుణ్‌లు పాల్గొన్నారు.

అవినీతికి నిలయం 'కల్వకుంట్ల' కుటుంబం

రేపోమాపో జైలుకు కేటీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు నిలయంగా కల్వకుంట్ల కుటుంబం మారిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం చిలుపూర్ మండలం మల్కాపూర్ పరిధిలోని కొత్తపల్లెను సందర్శించి, గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. కడియం మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సంపదను దోచుకుందే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. లిక్కర్ స్కాంలో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవిత ఇప్పటికే తీహార్ జైలు కెళ్లిందని, ఫార్ములా ఈ కారు కేసులో రేపోమాపో కేటీఆర్ జైలుకెళ్లక తప్పదన్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ నివేదిక వస్తే కేసీఆర్, హరీష్‌లు కూడా జైలుకెళతారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటై ఏడాది పూర్తయిందని, అప్పుడే సీఎం రేవంత్ రెడ్డితోపాటు, ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ సోషల్‌మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



మల్కాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తాను పాటుపడుతున్నానని, డివిజన్ కేంద్రంలో రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్, డిగ్రీ కళాశాల, వందపడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తదితర నిర్మాణాలకు సీఎంతో మాట్లాడి రూ.750కోట్ల నిధులను మంజూరు చేయించానన్నారు. శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలను కలుపుకుని స్టేషన్ ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా చేయించానన్నారు. దళితబంధులో కమిషన్ల పేరుతో పేదల నుంచి లక్షలు దండుకున్నవాళ్లు, రాజకీయ పార్టీలు ఛీత్కరించిన వాళ్లు నీతులు మాట్లాడుతున్నారని, వారికి తన పేరెత్తే అర్హత ఏ మాత్రం మాజీ ఎమ్మెల్యే రాజయ్యనుద్దేశించి కడియం అన్నారు.

గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి..

మల్కాపూర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, జీపీ నూతన భవనం కోసం రూ.20 లక్షలు, 500 మీటర్ల సీసీ రోడ్డు, మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు కడియం ప్రకటించారు. పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యమందేలా వైద్యశాఖ కమిషనర్‌తో మాట్లాడతానన్నారు. అర్హులైన లబ్ధిదారులకు 100 ఇళ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవి, పోరెడ్డి బుచ్చిరెడ్డి, నామాల మల్లేష్, బీరప్ప, మార్కెట్ డైరెక్టర్ యశ్వంత్‌రెడ్డి, నాయకులు ఏడవెళ్లి మల్లారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, నారాయణరెడ్డి, పసుల వెంకటేష్, గుర్రాల వెంకట్ రెడ్డి, ఊరడి సతీష్, వెంకటచలం, మాదంశెట్టి కనకతార పాల్గొన్నారు.

ఖరీఫ్ నాటికి ఎగువ ప్రాంతాలకూ సాగునీరు

● ఎమ్మెల్యే కడియం ● ఎత్తిపోతల పనులను వేగవంతం చేయాలని ఆదేశం

చిలుపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా ఎగువ ప్రాంతాల్లోని గ్రామాలకు లిఫ్ట్ ఇరి గేషన్ ద్వారా సాగునీరందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం హన్మకొండలోని ఆయన నివాసంలో సాగునీటి శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ 104 కోట్లతో మల్లన్నగండి రిజర్వాయర్‌పై మూడు లిఫ్టులను ఏర్పాటు చేసేందుకు ప్రభు త్వం ఇటీవల చర్యలు చేపట్టింది. ఇందులో మూడు లిఫ్టులను ఏర్పాటు చేసి 6600 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడంతో పాటు, చెరువులను నింపేందుకు నిర్ణయించింది. సంబంధించిన పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లిఫ్ట్-2 పనులను ప్రారంభించి హన్మకొండ జిల్లా వేలేరు మండలంలోని గుండ్లసాగరం, సోడషపల్లి తదితర గ్రామాలకు సాగునీరందిస్తున్నామని, వారం రోజుల్లోనే లిఫ్ట్ -1, లిఫ్ట్ -3 పైప్‌లైన్, పంప్‌హౌస్ పనులను ప్రారంభిస్తామన్నారు.

ఈ లిఫ్ట్‌ల ద్వారా మండలంలోని శ్రీపతిపల్లి, కొండాపూర్, లింగంపల్లి, మల్కాపూర్, నష్కల్, వంగాలపల్లితో పాటు, ధర్మసాగర్ మండలంలోని పీచర, వేలేరు, మద్దెలగూడెం, మల్లికుదుర్ల గ్రామాల రైతాంగానికి రెండు పంటలకు సాగునీరందుతుందని స్పష్టం చేశారు. సమీక్షలో ఇరిగేషన్ శాఖ ఈఈలు ప్రవీన్, సీతారాం, డీఈలు శ్రీకాంత్, కృష్ణప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఏజన్సీలు పాల్గొన్నారు.



హనుమకొండలోని తన నివాసంలో మల్లన్నగండి రిజర్వాయర్ పరిధిలోని ఎత్తిపోతల పనులపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

నిందితుడికి ఖాకీల వత్తాసు?

మహిళ నుంచి బంగారం ఆభరణాలు, నగదు కాజేసిన ఓ వ్యక్తి

సీపీ ఆదేశాలతో కేసు నమోదు చేసిన రాణా అధికారి

అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారంటూ ఆరోపణలు

వరంగల్ క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడాల్సిన పోలీసులు.. కాసుల కక్కుర్తి కోసం నేరగాళ్లకు వంత పాడుతూ కాపాడుతున్నారనే చర్చ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విస్తృతంగా జరుగుతోంది. బాధితులు రాణా అధికారులను ఆశ్రయించి తమకు జరిగిన అన్యాయాన్ని మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోకుండా నేరస్థులతో ములాఖత్ అయి జేబులు నింపుకుంటూ బాధితులను హింసిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ డివిజన్ ఏసీపీ, సీఐ కలిసి ఓ మహిళను మోసం చేసిన కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని కాపాడేందుకు రూ.3,50,000దండుకున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. వివరాల్లోకి వెళితే..

పొరుగు జిల్లా నుంచి ఓ వివాహిత వచ్చి నగరంలో నివాసం ఉంటోంది. స్నేహంగా ఉంటున్న ఓ వ్యక్తి మహిళను నమ్మించి ఆమె నుంచి 40 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.20 లక్షలను కాజేశాడు. తిరిగి తీసుకున్న సొమ్మును ఇవ్వక పోగా.. బెదిరిస్తుండటంతో సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ ఠాణాను బాధిత మహిళ ఆశ్రయించింది. ఎన్ని రోజులైనా నిందితుడిపై చర్యలు తీసుకోకపోవడంతో సదరు మహిళ సీపీని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీపీ ఆదేశించగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని మహిళ మొదటగా ఫిర్యాదు చేసిన పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సీపీ ఆదేశాలతో ఎట్టకేలకు నిందితుడిపై కేసు నమోదు చేసిన సంబంధిత ఠాణా అధికారి.. అరెస్టు చేయడంలో వెనుకడుగు వేస్తున్నట్లుగా తెలుస్తోంది.

అలాగే మందుస్తు బెయిల్ పొందే వరకు అరెస్టు చేయకూడదనే ఒప్పందాన్ని నిందితుడితో ఏసీపీ, సీఐ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఏసీపీ రూ.2 లక్షలు, సీఐ రెండు విడతల్లో రూ.లక్ష యాభై వేలను తీసుకొని నిందితుడు జైలుకు వెళ్లకుండా కాపాడుతున్నారని విశ్వసనీయమైన సమాచారం. కాగా, సదరు సీఐతో పాటు ఏసీపీ పలు విషయాల్లో వివాదాస్ప దులుగా నిలుస్తూ రాజకీయనాయకులు, రౌడీషీటర్ల చేతిలో కీలు బొమ్మల య్యారనే పేరు రాగా, సీపీ వారిద్దరిని తీవ్రంగా మందలించినట్లు సమాచారం.

లస్కర్ల నియామకానికి పైరవీలు

అనుచరుల కోసం అధికారులపై ఒత్తిడి

హనుమకొండ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగు నీటి కాల్వల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ద్వారా లస్కర్ల నియామకానికి ప్రత్యేక జీవో జారీ చేసింది. హనుమకొండలోని చింతగట్టు సాగునీటి పారుదల సర్కిల్ కార్యాలయంలో రెండు నెలల నుంచి లస్కర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరించారు. సుమారుగా 200పై చిలుకు లస్కర్ల నియామకం చేపడుతామని సాగు నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొనడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ నియోజకవర్గాల నుంచి వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేశారు. కాగా, ఎమ్మెల్యేల లెటర్ ప్యాడ్‌లతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం పొందేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. లస్కర్ల నియామకం కోసం అధికారుల పేర్లు చెప్పి పైరవీకారులు బాధితుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ డబ్బుల విషయం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని పలువురు ఆశావహులు బహిరంగంగా చర్చించుకోవడం కనిపించింది. అయితే లస్కర్ల నియామకాలలో ఎలాంటి రాజకీయ పైరవీలు లేకుండా పారదర్శకంగా అర్హులైన వారిని నియమించాలని దరఖాస్తుదారులు అధికారులను కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి ఏకశిల విద్యార్థుల నిత్యావసర వస్తువులు అందజేత



వృద్ధులకు నిత్యావసన వస్తువులు అందజేస్తున్న విద్యార్థులు

రాంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లిలోని సహృదయ ఆనాథ వృద్ధాశ్రమానికి గురువారం హనుమాన్‌నగర్‌లోని ఏకశిల పాఠశాల విద్యార్థులు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా విద్యార్థుల్లో మానవతా విలువలు అభివృద్ధి చెందుతాయన్నారు. చేయూతనందించే కార్యక్రమంలో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించిన తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బేతి శైలజా రెడ్డి, ఉపాధ్యాయులు గుర్మీత్ కౌర్, వైశాలి, శ్రీకాంత్, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రకాష్

వడ్డెపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడెపల్లి ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు మట్టెపల్లి మోహన్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ గురువారం మృతుడి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం రాష్ట్ర సెక్రటరి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర, జిల్లా నాయకులు పులి రజినీకాంత్, బుస్స మల్లేశం, మండల సమ్మయ్య, పులి ప్రభాకర్, టి.రవీందర్ ఉన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ధర్మసాగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఈఎంఐ విషయంలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నోటీసులిచ్చిందన్న మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో జరిగింది. వివాహిత కటుంబసభ్యులు, ఎస్ఐ జానీ పాషా తెలిపిన వివరాల ప్రకారం ఎలుకుర్తి గ్రామానికి చెందిన కేతిరి వెంకటయ్య కూతురైన ఎలేంద్ర(35)ను జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన అంగడి ఉపేందర్‌కు ఇచ్చి 17 సంవత్సరాల క్రితం వివాహం చేశారు.



ఆత్మహత్యకు పాల్పడిన ఎలేంద్ర

కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఎలేంద్ర స్టేసన్‌ఘన్‌పూర్‌లో ఆరు సంవత్సరాల క్రితం ఓ ప్రైవేట్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ వద్ద ఇంటి నిర్మాణం కోసం రూ.15లక్షలు రుణం తీసుకున్నారు. కొద్ది నెలల పాటు ఇంటి ఈఎంఐ సక్రమంగానే చెల్లించగా.. కొన్ని నెలలుగా సంక్రమంగా చెల్లించక పోవడం తో సదరు ఫైనాన్స్ సంస్థ వారు ఇటీవల ఆ ఇంటికి నోటీసులు అంటించారు. దీంతో మనస్తాపానికి గురైన ఎలేంద్ర ఎలుకుర్తిలోని పుట్టింటికి వచ్చిన ఆమె గురువారం ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎలేంద్ర, ఉపేందర్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకున్నామని ధర్మసాగర్ ఎస్ఐ తెలిపారు.

వలస కూలీ అదృశ్యం



సూర్యకర్

మడికొండ, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ఒడిషాకు చెందిన వలస కూలీ ఐదు రోజులుగా కనిపించకుండా పోయాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన ప్రకారం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన సూర్యకర్ తన భార్య దేవొకికర్, మరికొంత మందితో కలిసి డిసెంబరులో కాజీపేట మండలం కొత్తపల్లి శివారులోని ఎం.డి. సర్వర్‌కు చెందిన ఇటుక బట్టీలో కూలీ పని చేయడానికి వచ్చారు. మరుసటి రోజు సాయంత్రం 6 గం టల సమయంలో సూర్యకర్ బియ్యం తీసుకు వస్తానని చెప్పి బయటికి వెళ్లి తిరిగి రాలే దు. చుట్టుపక్కన వెతికినా, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. అతడు ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో ఆకుపచ్చ రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. సూర్యకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు మడికొండ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి

కాజీపేట, జనవరి 2 (ఆంధ్ర జ్యోతి):డ్ర గ్స్, గుట్కా మత్తుపదార్థాలను అరికట్టాలని కాజీపేట ప్రభుత్వ పాఠశాలలో గురువారం జాగృతి పోలీస్ కళా బృందం కళాప్రదర్శన నిర్వ హించారు. సైబర్ క్రైం, సైబర్ హెల్ప్‌లైన్ 1930 ప్రాధాన్యత ను తెలుపుతూ పాటలు పాడి, మ్యూజిక్ షోతో పలు ప్రదర్శనలు చేశారు. గంజాయి, గుట్కా మత్తు పదార్థాల బారిన పడొద్దని, ఎవరైనా అమ్మినా, సేవించినా 87125 84473 మొబైల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, కళాబృందం ఇన్‌చార్జి నాగమణి, సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, తోపాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాప్రదర్శనలో పాల్గొన్న పోలీసులు

ఎన్పీడీసీఎల్ సీఎండీకి శుభాకాంక్షలు తెలిపిన డైరెక్టర్లు

రాంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యూఇయర్‌ను పురస్కరించుకొని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిని డైరెక్టర్స్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తులందరికీ సీఎండీ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎండీని కలిసిన వారిలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్, సీఈలు, జీఎంలు ఉన్నారు. అలాగే గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎండీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎండీని కలిసిన వారిలో కంపెనీ అధ్యక్షుడు భూక్య వాలునాయక్, కార్యదర్శి అజ్మీరా శ్రీరాం నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్, అర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పీడియాట్రీషన్లకు ఇంటర్వ్యూలు

వరంగల్ మెడికల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని పీడియాట్రిషన్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య గురువారం తన ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రసూతి ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ విభాగంలో ఖాళీగా ఉన్న రెండు పీడియాట్రిషన్ పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకం కోసం ఈనెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ డాక్టర్స్ కాలనీలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హులైన వారు తమ విద్యార్హతలకు సంబంధిం చిన ఒరిజినల్ సర్టిఫికెట్స్, క్యాస్ట్, స్టడీ సర్టిఫికేట్స్‌తో పాటు ఒక జిరాక్స్ సెట్, ఫొటోతో హాజరు కావాలని సూచించారు.

ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా సమ్మయ్య



హనుమకొండ సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తెలం గాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా మండల సమ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ గురు వారం రాత్రి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. హను మకొండ వడ్డెపల్లికి చెందిన సమ్మయ్య నాలుగు దశాబ్దా లకు పైగా పార్టీకి సేవలు అందిస్తున్నారు. పార్టీ మార కుండా క్రమశిక్షణ గల కార్యకర్తగా మెలిగిన సమ్మయ్యను ఎట్టకేలకు గుర్తించి పదవి ఇవ్వడం పట్ల పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. తనకు పదవి లభించడం పట్ల రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు సహకరించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సమ్మయ్య కృతజ్ఞతలు తెలియచేశారు. ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీకి అంకితభావంతో సేవలు అందిస్తానన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2565	2345
పల్లికాయ (సూక)	7200	5600
పల్లికాయ (పచ్చిది)	4680	4500
కందులు	-	-
పెసళ్లు	7500	4000
పత్తి	6970	5800
కొత్తపత్తి	-	-
పసుపు (కాడి)	11329	10235
తేజ ఏసీ	15400	14000
తేజ మిర్చి	15000	9000
తేజ మిర్చి (కొత్తది)	15500	12000
వండర్‌హాట్ ఏసీ	14000	13000
యూఎస్341ఏసీ	15500	14500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

లా టైమ్స్ బుక్‌లో శివునిపల్లి

» సర్పంచ్ పదవి విషయంలో హైకోర్టు తీర్పు » మాజీ సర్పంచ్ విష్ణు కేసుకు దక్కిన చోటు



శివునిపల్లి జీపీ కార్యాలయం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ధర్మాసనం వెలువరించే చారిత్రాత్మక తీర్పులను నమోదు చేసే ఆంధ్ర లా టైమ్స్ బుక్‌లో శివునిపల్లికి చోటు దక్కింది. స్టేషన్‌ఘన్‌పూర్ జంట పట్టణమైన శివునిపల్లి గ్రామ పంచాయతీపై ఏడాది క్రితం వెలువరించిన తీర్పును ఆ బుక్‌లో చేర్చడం గమనార్హం. సుప్రీంకోర్టు పరిధిలో 2023లో ఆన్‌లైన్‌లో నమోదైన కేసుల్లో శివునిపల్లి జీపీ తీర్పును, 2023 ఆఫ్ సుప్రీంకోర్టు కేసులు టీఎస్ 4,243 నెంబర్‌తో వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఒక గ్రామానికి చెందిన కేసు తీర్పు వివరాలు సుప్రీంకోర్టు ధర్మాసనం వైబ్ సైట్‌లో చోటు లభించడం చారిత్రాత్మకమైన విషయంగా చెబుతున్నారు.

హైకోర్టును ఆశ్రయించిన విష్ణు

పంచాయతీరాజ్ చట్టం 2018, 38 (3) క్లాజ్ ప్రకారం సర్పంచ్, ఉప సర్పంచ్‌లు, జీపీలకు ఎంపిక కానట్లైతే 15 రోజుల వ్యవధిలోనే నియమించాల్సి ఉంటుందనే నిబంధనతో వార్డు సభ్యుడిగా గెలిచిన విష్ణు తనకు ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించాలని హైకోర్టులో రిట్ పిటిషన్ 5,455ను దాఖలు చేశారు. 2023లో జనవరి 11న తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు ఇవ్వాలని డీపీవోను ఆదేశించింది. డీపీవో సెక్షన్ 2(14), 136 (3) (ఇద్దరు లేదా ముగ్గురు వార్డు సభ్యులు ఉంటేనే ఇవ్వాలనే నిబంధన)ను చూపుతూ రిజెక్ట్ చేశారు. విష్ణు మరోమారు హైకోర్టులో గతేడాది ఫిబ్రవరిలో రిట్ పిటిషన్ 8,973ను దాఖలు చేశారు. దీంతో కోర్టు విష్ణుకు తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించాలని ఏప్రిల్‌లో కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేయగా 2(14),136 (3) సెక్షన్లను చూపుతూ కలెక్టర్ తిరస్కరించారు.


ఈ క్రమంలో విష్ణు మేలో మరోమారు హైకోర్టును ఆశ్రయించి మరో రిట్ పిటిషన్ 14,667 వేశారు. హైకోర్టు జడ్జి విజయసేనా రెడ్డి ఆధ్వర్యంలోని ధర్మాసనం ఏకైక వార్డు సభ్యుడిగా ఎన్నికైన విష్ణుకు తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించాలంటూ అక్టోబరు 20న తీర్పును వెలువరించి, అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చింది. రాజ్యాంగం ప్రకారం జీపీలకు ఎన్నికల నిర్వహించడంలో జాప్యం చేయొద్దనే నిబంధనలను పట్టించుకోకుండా ఎన్నికలను జాప్యం చేయడం సరికాదని, జీపీ నుంచి గెలుపొందిన సభ్యులకు కనీస బాధ్యతలు అప్పగించాలని, గ్రామ స్వరాజ్యంతోనే స్థాని క సంస్థలు బలోపేతం అవుతాయని, పంచాయ తీరాజ్ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూడడం సరికాదని కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేస్తూ సంచనల తీర్పును వెలువ రించింది. హైకోర్టు తీర్పును అనుసరించి విష్ణును తాత్కాలిక సర్పంచ్‌గా నియమించాలని అప్పటి కలెక్టర్ గతేడాది నవంబరు 18న డీపీవోకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో డిసెంబరు 8న డీపీవో విష్ణుకు తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్య తలు అప్పగించాలని ఎంపీడీవోకు ఉత్తర్వులిచ్చారు. ఆ తర్వాత విష్ణు డిసెంబరు 13న తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈ వివాదానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను ఆంధ్ర లా టైమ్స్ బుక్‌లో పొందుపరిచారు. 2024 (2) ఎఎల్‌టీ 686 (టీఎస్), ది హైకోర్టు ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ బూర్ల విష్ణు వర్సెస్ ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ అం డ్ అదర్స్' అంటూ.. ఆ బుక్‌లో నమోదు చేశారు.

లా బుక్‌లో చోటు దక్కడం అదృష్టం




తన కేసు విషయంలో ఇచ్చిన హైకోర్టు తీర్పు వివరాలను ఆంధ్ర లా టైమ్స్ బుక్‌లో, సుప్రీంకోర్టు కేసులు 2023 ఆన్‌లైన్‌లో నమోదు కావడం అదృష్టంగా బావిస్తున్నా. హైకోర్టు ధర్మాసనం తన కేసులో ఇచ్చిన ఈ తీర్పు చరిత్రలో నిలిచింది. కోర్టు తీర్పు తర్వాత సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తనకు తక్కువ సమయంలోనే అనేక అభివృద్ధి పనులు చేసే అవకాశం కల్పించిన గ్రామస్థులకు రుణపడి ఉంటా.

బూర్ల విష్ణు, శివునిపల్లి మాజీ సర్పంచ్



ఆంధ్ర లా టైమ్స్ బుక్ (హైకోర్టు ధర్మాసనం బుక్)



82. Interim orders granted earlier if any, stand vacated.

83. Miscellaneous petitions pending if any, stand closed.

2024 (2) ALT 686 (TS)

IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

B. VIJAYSEN REDDY, J.

Writ Petition No.14667 of 2023 – Decided on 20-10-2023.

Burla Vishnu

v.

State of Telangana rep. by its Principal Secretary, Panchayatraj and Rural Development Department, Hyderabad and others

TELANGANA PANCHAYAT RAJ ACT, 2018, Section 38(3) — Temporary Sarpanch — For whatever reasons, elections were not conducted to the post of Sarpanch and 13 ward members — Respondent authorities have not taken steps to conduct elections — The post of Sarpanch and Upa-Sarpanch continued to be vacant — The object of insertion of Part IX of the Constitution [Articles 243 to 243(o)] was to decentralise democratic set ups at the grassroot levels and ...

... post of Sarpanch and 13 ward members, the respondents failed to discharge the Constitutional mandate and they cannot take advantage of their own wrong – Hence, the impugned order is arbitrary and against the spirit of Part-IX of the Constitution of India.

CASES REFERRED:

1. S. Syeda v. Collector (Panchayat Wing), Guntur: 2004 (6) ALT 1 (DB). (Para 5)
2. Ambodi Anji Yadav v. State Election Commission, Hyderabad: 2023 (3) ALT 584 (DB) (TS) = 2023 (1) ALT (Rev.) 252 (DB). (Para 5)

Mr. Lokirev Preetham Reddy, Counsel for the Petitioner.

G.P. for Panchayat Raj Rural Development for Respondent Nos.1 to 5.

Mr. P. Kishore Rao, SC for Grama Panchayat for Respondent No.6.

ORDER

An interesting point, which arises for consideration in this writ petition, is whether the petitioner, who is the sole Ward Member of Sivunipally Gram Panchayat, Station Ghanpur Mandal, Jangaon District, can be appointed as temporary Sarpanch in terms of Section 38(3) of the Telangana Panchayat Raj Act, 2018 (for short 'the Act').

2. Sivunipally Gram Panchayat comprises of 14 wards. Election notification was issued on 12.01.2019 for conducting elections of ...

పుస్తకంలో శివునిపల్లి జీపీ తీర్పు వివరాలు

కేసు, కోర్టు తీర్పు తదితర వివరాలివీ

శివునిపల్లి గ్రామ పంచాయతీకి 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 2011జనాభా లెక్కలను అనుసరించి రోస్టర్ విధానంలో సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. దాంతో ఎస్టీ మహిళ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్రం సాకారమైన తర్వాత 2018లో అప్పటి ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చి, 2019లో జీపీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేశారు. కొత్త చట్టం ప్రకారం శివునిపల్లి సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. రెండు పర్యాయాలు ఎస్టీకి రిజర్వేషన్ ఇవ్వడం సరికాదని గ్రామ నాయకులు జేఏసీగా ఏర్పడి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా 14వార్డులకు, సర్పంచ్ స్థానానికి ఎవరూ నామినేషన్ వేయకుండా అడ్డుపడ్డారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న, ఎన్నికలు జరగని స్థానాలకు ఎన్నికల కమిషన్ మరోసారి 2019లో ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలోనూ జేఏసీ మళ్లీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చింది. అయితే జేఏసీ నిర్ణయాన్ని కాదని గ్రామానికి చెందిన బూర్ల విష్ణు 8వ వార్డుకు నామినేషన్ దాఖలు చేశారు. దీంతో జేఏసీ ఆయనకు ప్రత్యర్థిగా ఓ అభ్యర్థిని నిలబెట్టింది. దీంతో కేవలం 8వ వార్డుకు మాత్రమే 2019 ఫిబ్రవరి 28న ఎన్నికలు జరగ్గా.. అనూహ్యంగా విష్ణు ఘనవి జయం సాధించారు.

సాఫల్యమయ్యేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

ఎంజీఎంలో ఏర్పాటు చేస్తారనేది కలగానే మిగిలిపోయింది. దీంతో వేలాది మంది సంతానలేమి సమస్యతో బాధపడుతూ రూ.లక్షలు ఖర్చు చేస్తూ ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

సర్కారు చొరవ చూపితే సాఫల్యమే..

హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరమైన వరంగల్ ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉంది. ఇప్పటికే వరంగల్‌లోని ఎంజీఎంలో ప్రతిరోజు వేలాది మందికి వైద్యచికిత్స అందిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో సంతానలేమి సమస్య తీవ్రంగా మారుతోంది. పుట్ట గొడుగుల్లా ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50కి పైగా సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. పైసా ఖర్చు లేకుండా సంతానం అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లోని గాంధీ అస్పత్రి, పేట్లబురుజు అస్పత్రుల్లో ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటు చేశారు. అదే తరహాలో వరంగల్ ఎంజీఎంలో కూడా ప్రభుత్వం సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోందనే ఆశతో ఓరుగల్లువాసులున్నారు. ఐవీఎఫ్ సెంటర్‌లో ఆధునాతన పరికరాలు, సౌకర్యవంతమైన వసతులతో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించింది. గైనకాలజిస్టుతో పాటు ఐవీఎఫ్‌లో విధుల నిర్వహించేందుకు వైద్యులు, సిబ్బంది నియామకం చేయనున్నారు. అలాగే ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లు, ఫలదీకరణ చేసేందుకు ఆధునిక యంత్రాలు, సెమన్ ఎనాలాసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ డయాగ్నోస్టిక్ హిస్టరీ లేపరోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపవర్ స్టిమిలేషన్(సీఓఎ)ను సమకూర్చేందుకు ప్రభుత్వం రూ.7.83కోట్ల నిధులను వరంగల్ ఎంజీఎంకు కేటాయించింది. ప్రభుత్వం రెండు చోట్ల ఐవీఎఫ్ సెంటర్లను ప్రారంభించిన నేపథ్యంలో వరంగల్ ఎంజీఎంలో కూడా ఈ సేవలు అందుబాటులోకి వస్తే, ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు, స్కానింగ్, ఇతర వైద్య సేవలన్నీ కూడా సంతానలేమితో బాధపడేవారికి ఉచితంగా అందనున్నాయి. ఈ ఏడాదిలోనే వరంగల్ ఎంజీఎంలో సర్కారు సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందనే టాక్ వినబడుతుంది. మొత్తానికి ఐదేళ్లుగా ఊరిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాన్ని ఎంజీఎంలో ఏర్పాటు చేసి, సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారికి ఉచితంగా సేవలు అందుతాయనే ఆశతో ఓరుగల్లువాసులు ఎదురు చూస్తున్నారు.

ఉద్యోగులు జిల్లా అభివృద్ధికి సహకరించాలి



హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు ఫొటో బహూకరిస్తున్న టీఎన్‌జీవోలు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. టీఎన్‌జీ ఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కలెక్టర్ ఫొటోలను బహూకరించారు. ఈ సందర్భంగా స్కూల్ పిల్లలకు ఉపయోగపడే నోట్ బుక్స్ కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య కేక్ కట్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి ఆకుల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, ఇతర టీఎన్‌జీఓస్ నాయకులు ఉన్నారు.

పరుగుల కెరటం.. అర్జున కిరీటం

- ప్రతిష్ఠాత్మక అవార్డుకు జీవంజి దీప్తి ఎంపిక
- ఈ ఘనత సాధించిన తొలి పారా అథ్లెట్‌గా గుర్తింపు
- అవమానాలు, కష్టాలను ఎదురొడ్డి లక్ష్యం వైపు పరుగెత్తిన సివంగి
- క్రీడావేదికపై రెపరెపలాడిన ఓరుగల్లు కీర్తి పతాక



ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ నాగపురి రమేష్‌తో దీప్తి (ఫైల్)

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొన్ని విజయాలు అనందంతో ముడి పడినవి మాత్రమే కాదు. వ్యక్తిగత విజయానికే పరివితమైనవి కావు. దారిలేని వారికి దారి చూపే వెలుగు రేఖలు. ధైర్యంలేని వారికి అసాధారణ విజయాలు ఇచ్చే ధైర్యాలు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 9 వరకు పారిస్‌లో నిర్వహించిన పారా ఒలంపిక్స్‌లో 400మీటర్ల పరుగు పందెంలో ఓరుగల్లుకు చెందిన జీవంజి దీప్తి పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించి తెలంగాణ రాష్ట్రం నుంచి పారా ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి పారా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించారు.

కాంస్య పతకం సాధించిన దీప్తికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1కోటి నజరానాతో పాటు గ్రూపు-2 ఉద్యోగం, హనుమకొండ నగరం సమీపంలో 500 గజాల ఇంటి స్థలాన్ని అందించి గౌరవంగా సత్కరించిన ఇషయం విదితమే. అదే విధంగా గురువారం కేంద్ర ప్రభుత్వం భారత్ తరపున కాంస్య పథకం సాధించిన తెలంగాణ యువ పారా అథ్లెట్ జీవంజి దీప్తిని అర్జున అవార్డుకు ఎంపిక చేయడంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అథ్లెట్లు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అనందంలో మునిగి తేలుతున్నారు.



కీర్తి పతాక

గురువుకు తగిన శిష్యురాలిగా..

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి ధనలక్ష్మీ - యాదగిరి దంపతుల కుమార్తె దీప్తి కల్లెడలో పదో తరగతి చదువుతూనే అథ్లెటిక్స్‌లో రాణించింది. 2016 నుంచి హైదరాబాద్‌లోని సాయి హాస్టల్‌లో ఉంటూ కోచ్ నాగపూరి రమేష్ వద్ద అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణిస్తూ జిల్లా కీర్తిని విశ్వ వ్యాప్తం చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల భాండాగారానికి నిలయమైన ఓరుగల్లుకు చెందిన భారతదేశ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ వద్ద 8 ఏళ్లుగా అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతోంది.

గురువుకు తగిన శిష్యురాలుగా దీప్తి ప్రతిభ కనబరుస్తూ అర్జున అవార్డుకు ఎంపికై చరిత్ర సృష్టించింది. గురువు రమేష్‌కు ద్రోణాచార్య అవార్డు, శిష్య రాలు దీప్తికి అర్జున అవార్డుకు ఎంపిక కావడం.. వీరిద్దరు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారు కావడం విశేషం.

అవమానాలు ఎన్ని ఎదురైనా..

ఇతర అమ్మాయిల మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో దీప్తిని చాలామంది హేళన చేసేవారు. అబ్బాయి లక్షణాలే దీప్తిలో అధికంగా ఉన్నాయని సూటిపోటి మాటలతో వేధించారు. అయినా పట్టించుకోకుండా ప్రతీ పోటీలో చిరుత వేగంతో దూసుకువెళుతూ పతకమే లక్ష్యంగా ముందుకు సాగింది. నేడు విశ్వవేదికపై ఉమ్మడి వరంగల్ జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇమడింప చేసింది.

కొండా సురేఖ అభినందనలు

జీవంజి దీప్తి అర్జున అవార్డుకు ఎంపిక కావడంతో మంత్రి కొండా సురేఖ దీప్తికి గురువారం ఒక ప్రకటనలో అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించినట్లు కొండా సురేఖ తెలిపారు.



కల సాకారమైంది..

గురువులు చెప్పిన విధంగా నడుచుకొని పట్టుదలతో సాధన చేసినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. ప్రతీ కోచ్‌కు తన శిష్యులు ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే గర్వకారణంగా ఉంటుంది. ఈ రోజు నా శిష్యురాలు దీప్తి ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డుకు ఎంపిక కావడంతో నా కల సాకారమైంది. గతంలో పారిస్ నిర్వహించిన పారా ఒలంపిక్స్‌లో దీప్తి మొక్కవోని దీక్షతో ఎన్నో అవమానాలను ఎదుర్కొంది. నేడు జిల్లా కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం చేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది. పారా ఒలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించడంతో ఆమెలో ఎంతో విశ్వాసాన్ని చూశాను. అన్ని అవయవాలు మంచిగా ఉన్న క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం ఎవరికైనా సాధ్యమే. కానీ దీప్తిలాంటి అథ్లెట్‌కు శిక్షణ ఇవ్వడం సవాళ్లతో కూడుకున్న పని. ఎనిమిదేళ్ల కఠోర శ్రమకు నేడు ఫలితం సాధించామనుకుంటున్నా.

నాగపురి రమేష్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, భారతదేశ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, సాయి అకాడమీ కోచ్

పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడు ?

• నష్టపోతున్న బీడీ కార్మికులు • జీవన భృతి రాక ఇబ్బందులు • పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

హనుమకొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు పీఎఫ్ కటాఫ్ తేదీ వల్ల జీవన భృతి (పింఛన్) పొందలేక పోతున్నారు. అనేక సంవత్సరాలుగా బీడీల తయారీపైనే అధారపడి జీవిస్తున్న కార్మికులు జీవన చరమాంకంలో ఎలాంటి ఆర్థిక భరోసా లేక దుర్భర జీవితం గడుపుతున్నారు. చివరకు ఎలాంటి ఆసరా లేకుండానే కన్నుమూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుసరిస్తున్న వైఖరి వేలాది మంది బీడీ కార్మికుల పాలిట శాపంగా మారుతోంది. 2014 ఫిబ్రవరి 28 వరకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాలో నమోదు అయినవారికి మాత్రమే ప్రస్తుతం జీవన భృతి పింఛన్లు అందుతున్నాయి. కటాఫ్ తేదీ తర్వాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పించన్‌కు పరిగణలోకి తీసుకోవడం లేదు.



ఎత్తివేతపై యూ టర్న్

2022 ఆగస్టులో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్టు ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తర్వాత యూటర్న్ తీసుకున్నది.. ఇక బీడీ పింఛన్లు పెంచేది లేదని చేతులెత్తేసింది. గత ప్రభుత్వం ఈ కటాఫ్ తేదీని ఎత్తివేస్తూ నిర్ణ యం తీసుకున్నది. పీఎఫ్ నెంబరు ఉంటే చాలు అందరికి జీవన భృతి లభిస్తుందని గొప్పగా చెప్పింది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. దీనితో బీడీ కార్మికులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. 18-50 ఏళ్ల వయసువారు 1.5 లక్షల లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, ఈపీఎఫ్ అర్హత ధృవీకరణ పత్రం, ఆన్‌లైన్ స్టేట్‌మెంట్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేశారు. కానీ వారికి ఇప్పటి వరకు పింఛన్ మంజూరు కాలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20వేల మంది వరకు దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇవన్నీ ఇప్పుడు జిల్లాల వారీగా కలెక్టర్ల వద్ద ఉన్నాయి. వీటిపై సర్కార్ యూటర్న్ తీసుకోవడంతో కలెక్టర్లు కూడా ఏమీ చేయలేకపోయారు. దీంతో జీవన భృతి కోసం పెట్టుకున్న దరఖాస్తులకు మోక్షం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎత్తి వేయకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది బీడీ కార్మికులు జీవన భృతి ఆసరా పింఛన్‌కు అర్హులైనప్పటికీ పొందలేక పోతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో లక్ష మంది కార్మికులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష మందికిపైగా బీడీ కార్మికులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో ఉన్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో కూరుకు పోవడంతో పదేళ్ల కాలంలో చాలా బీడీ ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా లో 25కిపైగా బీడీ ఫ్యాక్టరీలు ఉండేవి.

కానీ ఇప్పుడు వాటి సంఖ్య పదికి తగ్గిపోయింది. బీడీ ఫ్యాక్టరీల యజమానులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తమ బ్రాంచీల్లో కొన్నిటిని మూసివేయడంతో అనేక దశాబ్దాలుగా బీడీల తయారీపై ఆధారపడి జీవిస్తున్న బీడీ కార్మికుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది.

గతంలో ఆందోళనలు

పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేయాలని కోరుతూ పలు వామపక్ష కార్మిక సంఘాల నాయకత్వంలో గతంలో అనేక సార్లు బీడీ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పీఎఫ్ జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఇప్పటికీ సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

ఇప్పటికైనా పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితో పాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ చేయాలని, జీవన భృతి కింద నెలకు రూ 2016 అందజేయాలని, బీడీల తయారీకి తగినట్టు తునికాకును సరఫరా చేయాలని, బీడీల తయారీ కూలీ రేటు పెంచాలని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ల నిర్మాణానికి రాయితీ ఇవ్వాలని, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని, తమ పిల్లలకు ఉపకార వేతనాలు మంజూరు చేయాలని ఈఎస్ఐ కార్మిక ఆస్పత్రి ద్వారా వైద్య సేవలందించాలని బీడీ కార్మికులు కోరుతున్నారు.

50 ఏళ్లుగా నాణాలు, కరెన్సీ సేకరణ

అభిరుచి

ప్రత్యేకతను చాటుకుంటున్న సుధాకర్



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఒకటా, రెండా.. వందలు రకాల నాణేలు, కరెన్సీ నోట్లు సేకరించారాయన. సుమారు 50ఏళ్లుగా తన అభిరుచిని కొనసాగిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన యంజాల సుధాకర్. ఈ క్రమంలో రాజుల కాలంలో, స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత వచ్చిన రకరకాల నాణేలు, నోట్లు ఆయన వద్ద ఉన్నాయి. ఎవరి దగ్గరైన ఏదైనా పాత నాణం, నోటు ఉందని తెలిస్తే వారి వద్దకు వెళ్లి మరీ దానిని సేకరించి భద్రపరుస్తున్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మండల ఆఫీసు క్రాస్ రోడ్డులో టెంట్ హౌస్ నిర్వహించే ఆయన వద్ద 1980 వరకు మనం విరివిగా వినియోగించిన పైస, 2 పైసలు, 3 పైసలు, 5 పైసలు, 10 పైసలు, 20 పైసలు, 25 పైసలు, 50 పైసలు, రూపాయి, రూ.5 నాణేలు, రూపాయి, రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు ఉన్నాయి. వీటిలో శ్రీకృష్ణ దేవరాయలు, నిజాం నవాబుల కాలం నాటి నాణేలు కూడా కొన్ని ఉన్నాయి. అప్పడప్పులు ఆయన వీటిని ప్రదర్శనకు పెట్టి మురిసి పోతుంటారు. దీపావళి పండుగ రోజు ధన లక్ష్మీ వ్రతాలు ఆచరించే వారెవరైనా పూజలుర చేసేందుకు అడిగితే కాదనకుండా ఇస్తుంటారు. పూజల అనంతరం మళ్లీ భద్రపరుస్తారు. 1980సమయంలో పాపడాలు అమ్మే వ్యక్తి వద్ద చిల్లర పైసలు ఎక్కువగా ఉండేవని, రకరకాల నాణేలను చూసి తనకు సేకరించాలనే ఆలోచన వచ్చిందని సుధాకర్ చెబుతున్నారు. ఆ రోజుల్లో ఎక్కువగా పోస్టల్ స్టాంపులు, సాలార్ జంగ్ మ్యూజియం చిత్రాలు, అగ్గి పెట్టె మూతలు, మార్బుల్ గోలీలు, పత్తాలు ఎక్కువగా సేకరించే వారని, అలా తాను కూడా ఒక హాబీగా ఎంచుకున్నానన్నారు. పాతతరం నాణేలు, కరెన్సీ నోట్లపై ముద్రించిన సంవత్సరంతోపాటు సంస్కృతీ, సంప్రదాయాలకు సంబంధించిన గుర్తులు ఉంటాయని, మన దేశ భాషలు, జాతీయ చిహ్నాలు, జాతీయ నాయకుల చిత్రాలు, ఆర్‌బీఐ గవర్నర్ పేరు, పంటలు, కళాకారులు, కవులు, నృత్య రీతులు, పాతకాలం నాటి రాజుల బొమ్మలు... ఇలా ఎన్నో అంశాలు తెలుస్తాయన్నారు. ప్రతీ నాణెం, కరెన్సీ నోటు అప్పటి పాలకులు, ప్రభుత్వ విధానాలను తెలియజేసేలా ఉంటాయన్నారు.









సుధాకర్ సేకరించిన నాణాలు, వివిధ దేశాల కరెన్సీ

అభాగ్యులకు అండగా..

● భార్యాభర్తల సమస్యల పరిష్కార వేదిక ● బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్న పోలీసులు ● పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం



వరంగల్ మహిళా సహాయక కేంద్రం

వరంగల్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో కొన్ని కుటుంబాల్లో కొంత మంది మహిళలు తమ భర్త, అత్తమామలు, ఆడబిడ్డల నుంచి వేధింపులకు గురవుతున్నారు. ఈ క్రమంలో కుటుంబంలో కలతలు చెలరేగి విడిపోయిన దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారిని మళ్లీ కలుపడమే లక్ష్యంగా వరంగల్ అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది పనిచేస్తున్నారు. పలువురు మహిళలు వేధింపుల బారిన పడుతూ కుటుంబ పెద్దలను ఆశ్రయించినప్పటికీ కుటుంబాల్లో సఖ్యత వీలుకానప్పుడు చివరి ప్రయత్నంగా మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేస్తే కుటుంబాలు కలిసిపోయే అవకాశం ఉండదని భావించిన పోలీసు సిబ్బంది.. కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా దంపతులతో పాటు ఇరువైపులా కుటుంబసభ్యులకు కూడా దాదాపు నాలుగు సార్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్ నిర్వహించిన కూడా ఫలితం రానప్పుడు బాధిత మహిళల ఫిర్యాదు మేరకు తగిన సాక్ష్యాలతో వివరాలు సేకరించి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.

కేసుల వివరాలు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి (పాత సెంట్రల్ జైలు) ఎదురుగా రంగంపేట ప్రాంతంలో ఉన్న వరంగల్ అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో భార్యభర్తల సమస్యలు, అత్తాకోడళ్ల సమస్యలు, ఆడబిడ్డలతో సమస్యలు ముఖ్యంగా వరకట్న వేధింపులు, అదనపు కట్నం లాంటి కేసులు అండర్ సెక్షన్ 498ఎ- 1961 ఆక్ట్‌పై నమోదవుతాయి. వరంగల్ అర్బన్ మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ ఏసీపీ, హనుమకొండ ఏసీపీ, కాజీపేట ఏసీపీ పరిధిలోని ప్రాంతాలతో పాటు హనుమకొండ జిల్లాలోని అన్ని గ్రామాలకు చెందిన కేసులు నమోదవుతాయి. ప్రస్తుతం వరంగల్ అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఒకరు ఉన్నారు. అదేవిధంగా ఇద్దరు సబ్ ఇన్స్‌పెక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది మంది కానిస్టేబుళ్ల విధులను నిర్వర్తిస్తున్నారు.



మహిళా పోలీస్‌స్టేషన్

బాధితులకు న్యాయం చేస్తాం: కె.సూర్యప్రసాద్, ఎస్‌హెచ్‌వో



వరంగల్ అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధిత మహిళలకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి వారి కుటుంబసభ్యులతో కలపడానికి కృషిచేస్తున్నాం. ఇప్పటివరకు ఒక్క పెండింగ్ కేసు కూడా లేకుండా సమస్యలను పరిష్కరిస్తున్నాం. బాధిత మహిళలను వేధింపులకు గురిచేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఏ ఒక్క బాధిత మహిళకు కూడా అన్యాయం జరగకుండా చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం.

డ్రంకెన్ డ్రైవ్‌లో 51 మందికి జరిమానా

మట్టెవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 51 మంది వాహనదారులకు జరిమానా, వాహనదారుడికి గురువారం మెజిస్ట్రేట్ ఎ.వెంకటేషం మూడు రోజుల సామాజిక సేవా శిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. వరంగల్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌లో తనిఖీల్లో పట్టుబడ్డ 51 మంది వాహనదారులకు రూ.51,200 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వరంగల్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ ఐనవోలు ప్రాంతానికి చెందిన గుండెబోయిన రాజుకు మెజిస్ట్రేట్ మూడు రోజుల సామాజిక సేవా శిక్షను విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామక్రిష్ణ తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

కరీమాబాద్, జనవరి 2,(ఆంధ్రజ్యోతి): తమతోటి మిత్రుడు అకాల మరణం చెందడంతో అతడితో కలిసి చదువుకున్న తోటి మిత్రులు ఆ మిత్రుడి కుటుంబ సభ్యులకు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. కరీమాబాద్ ప్రాంతానికి చెందిన వనం రాజ్‌కుమార్ రెండేళ్ల కిందట అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. అతడికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా తమ తోటి మిత్రడు మృతి చెందడంతో ముగ్గురు కుమార్తెలతో ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతుందని తెలుసుకున్న 1997-98 బ్యాచ్ శ్రీ వెంకటేశ్వర పాఠశాల తోటి మిత్రులు కరీమాబాద్ ప్రాంతం నానామియ తోటలో ఉంటున్న అతడి భార్య సునీతకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎలగొండ రాజేశ్వర్, కోరె రమేష్, వనం రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకాన్ని పోరాట ఆయుధంగా మార్చిన వీరుడు హాష్మీ

కరీమాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వీధి నాటకాలను పోరాట ఆయుధంగా మార్చిన మహావీరుడు సప్దర్ హష్మీ అని ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా కార్యదర్శి వలదాసు దుర్గయ్య అన్నారు. గురువారం ఉర్సు గుట్ట వద్ద గల సీపీఎం పార్టీ కార్యాలయంలో సప్దర్ హష్మీ 35వ వర్థంతి సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి దుర్గయ్య మాట్లాడుతూ.. హష్మీ అభ్యుదయ నాటక రచయిత, దర్శకుడు, నటుడు, గీత రచయిత పలు భూమికలు పోషించారని అన్నారు. జననాట్య మండలి మంచ్ వ్యవస్థాపకులలో ఒకరుగా ఉన్నారని, కాశ్మీర్, ఢిల్లీ విశ్వవిద్యాలయాల్లో ఆంగ్ల సాహిత్యంలో లెక్చరర్‌గా పనిచేశారని అన్నారు. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నికలలో రిగ్గింగ్ చేశారని ఆరోపించినపుడు ఆ వివాదానికి ప్రతిస్పందనగా కుర్సీ కుర్సీ కుర్సీ అనే వీధి నాటకం నిర్మించి విస్తృతంగా ప్రచారం నిర్వహించారని అన్నారు. ఢిల్లీ శివార్లలోని ఘజియాబాద్ మున్సిపల్ ఎన్నికల సంద్భంగా అల్లా బోల్ అనే వీధి నాటకం పారిశ్రామిక వాడలలో వేలాదిమంది కార్మికుల మధ్యన కార్మికుల హక్కుల కోసం ప్రదర్శిస్తుండగా అనాటి పాలకవర్గాలు ఓర్వలేక వీధినాటిక ప్రదర్శన మధ్యలోనే హష్మీని హత్య చేయించారని అన్నారు. వీధి నాటికను పోరాటా ఆయుధంగా, ప్రజాచైతన్యాన్ని కలిగించి పాలకవర్గాల్లో దడ పుట్టించిన మహోన్నత కళాకారుడు సప్దర్ హష్మీ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు డి.రవి, జానీ, రాజు, మోగిళి, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖో ఖో టోర్నమెంట్‌ను నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేయాలి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండలో ఈ నెల 8 నుంచి 11 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఖో ఖో టోర్నమెంట్‌కు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఖో ఖో టోర్నమెంట్‌లో సుమారుగా 500 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని, అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాలన్నారు. క్రీడలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి జయలక్ష్మి, డీఈవో జ్ఞానేశ్వర్, గీసుగొండ ఎమ్మార్వో రియాజుద్దీన్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

తండాలను విలీనం చేస్తే ప్రతిఘటిస్తాం

వరంగల్ కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లంబాడీ తండాలను పంచాయతీ గ్రామాల్లో విలీనం చేస్తే ప్రతిఘటిస్తామని, విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్ డిమాండ్ చేశారు. లంబాడీ తండాలను పంచాయతీ గ్రామాల్లో విలీనం చేసే విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు, లంబాడీ గిరిజనులు భారీ ఎత్తున తరలి వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ఎల్‌హెచ్‌పీఎస్ పోరాట ఫలితంగానే 500 జనాభా కలిగిన తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. చిన్న గ్రామ పంచాయతీలతోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. చిన్న రాష్ట్రాలతో ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చెప్పిన స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. లంబాడీ తండా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించి ఆర్థిక పరిపుష్టి కల్పించాలని డిమాండ్ చేశారు. తండాలను పంచాయతీ గ్రామాల్లో విలీనం చేయవద్దని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌తో జిల్లా కలెక్టర్ సత్యశారదను ధర్నా అనంతరం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు గుగులోత్ రామస్వామి నాయక్, భానోతు సారంగపాణి, జాటోత్ రమేష్, భూక్య జగన్, జాటోత్ భీమ్లా, లక్ష్మణ్ నాయక్, మురళి నాయక్, సుభాష్, శోభన్, స్వామి నాయక్, భానోత్ హరిశంకర్ నాయక్‌తో పాటు లంబాడా మహిళలు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

శంభునిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు భగీరథ్ కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో భగీరథ్‌కు అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. కేయూ ప్రొఫెసర్ ఎమ్డీ ముస్తఫా పర్యవేక్షణలో అంతరించిపోతున్న సారాలియా కొరిలిఫోలియా అనే ఔషధ మొక్కపై చేసిన పరిశోధనలకు కేయూ నుంచి డాక్టరేట్ లభించింది. అధ్యాపకులు తన అనుభవాన్ని విద్యార్థులకు పంచి మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, స్టాఫ్ సెక్రెటరీ డాక్టర్ వెంకటేశ్వర్లు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పరమేష్, అధ్యాపకులు డాక్టర్ పీఎల్ఎన్.మూర్తి, రమేష్, సుస్మిత, శైలజ, మినాజుద్దీన్, నాగపరమేష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ పోతరనేని రాజన్న, షరీఫ్, సమీనా, గీసగోని గీత తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో పత్తి వ్యాపారి ఆకస్మిక మృతి

వరంగల్ సిటీ, జనవరి 2: (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన వరంగల్ మార్కెట్ కాటన్ సెక్షన్ మాజీ సభ్యుడు, వెంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీస్ యజమాని పత్రి చిన్నకొమ్మాలు (54) గురువారం తెల్లవారు జామున సుమారు 2.00 గంటల సమయంలో గుండెపోటుకు గురై మృతి చెందారు. దీంతో బాలాజీనగర్‌లో విశాదం చోటుచేసుకుంది. మరోపక్క ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ తమ సంతాపాన్ని తెలిపింది. సుదీర్ఘకాలంగా పత్తి వ్యాపారం చేసిన చిన్న కొమ్మాలు రైతులు, కార్మికులు, తోటి వ్యాపారులతో సఖ్యతతో మెలిగేవాడు. ఆయన లేని తీర్చలేనిదని, ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపింది. అదే విధంగా సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.


చిన్న కొమ్మాలు(ఫైల్)

నూతన భవనాల మంజూరు పట్ల హర్షం

గిర్మాజిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాల నూతన భవనాలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ.5కోట్ల 98 లక్షలతో ప్రభుత్వం చేపడుతుండడంపై స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ గురువారం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. గురువారం మధ్యాహ్నం భోజనం వేళ పాఠశాల విద్యార్థులకు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు ప్రిన్సిపాల్ శరద్యుతితో కలిసి కార్పొరేటర్ అనిల్ కుమార్ మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల, జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అనిల్ కుమార్

శబరిమలకు తరలిన భక్తులు

శంభునిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున శబరిమలకు తరలివెళ్తున్నారు. నగరంలోని రంగశాయిపేట రామలింగేశ్వరాలయంలో గురువారం అయ్యప్ప మాలాధారులు పెద్ద సంఖ్యలో ఇరుముడులు కట్టుకున్నారు. గురుస్వామి వెలిదె ప్రదీప్ శాస్త్రి చేతుల మీదుగా రామలింగేశ్వరాలయం, మహంకాళి దేవాలయంలో ఇరుముడులు కట్టుకున్నారు. 41 రోజుల దీక్షను ముగించుకొని హరిహర సుతుడైన అయ్యప్ప స్వామిని దర్శించడానికి గురువారం రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల నుంచి సుమరు వంద మంది అయ్యప్ప మాలాధారులు శబరిమలైకి పయనమయ్యారు. ఇరుముడి కార్యక్రమంలో అయ్యప్ప స్వాములతో పాటు కుటుంబ సభ్యులు, భక్తులు అయ్యప్ప నామస్మరణాలతో వేడుకున్నారు. శబరిమలైకి తరలిన వారిలో కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, కావటి కరుణాకర్, రంజిత్, పవన్, భవిత్, శ్రీధర్, రాంబాబు, భిక్షపతి, మాధవ్, మనీ రాహుల్, మనోహర్, మణిదీప్ తదిరులుయపెద్ద సంఖ్యలో ఉన్నారు.


రంగశాయిపేటలో ఇరుముడులు కట్టుకున్న అయ్యప్ప మాలాదారులు

రేపు కేయూ మహిళా ఇంజనీరింగ్ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జనవరి 4న శనివారం కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. ఈ మేరకు సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మేళనం వివరాలను వెల్లడించారు. 2013లో కళాశాల ప్రారంభమైందని 2017 తర్వాత నుంచి కళాశా ల బ్యాచ్‌లు వెళ్లాయని వెల్లడించారు. కళాశా లలో ఇంజనీరింగ్ కోర్సులైన సీఎస్‌సీ, ఐటీ, ఈఈఈ బ్రాంచ్‌లలో విద్యార్థులు చదివారని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళ నంలో పాల్గొనే విద్యార్థులందరూ ఇప్పుడు కళాశాలలో చదివే విద్యార్థులకు మార్గదర్శనం చేస్తారని తెలిపారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు తమ జాబ్ అనుభవాలు, ఇంటర్న్‌షిప్ తదతర అంశాలపై విద్యార్థులకు సమాచారం ఇస్తారని తెలిపారు. ప్రతీ ఏడాది జనవరి మొదటి శనివారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జనవరి 4న జరిగిన కేయూ మహిళ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ పీవీ వైష్ణవిలు పాల్గొంటారు.

29వ డివిజన్‌లో కార్మికుల పనులు బంద్


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సింగారపు బాబు

వరంగల్ చౌరస్తా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట 29వ డివిజన్‌లో ఈ నెల 4, 5 తేదీల్లో మున్సిపల్ కార్మికుల పని బంద్ దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింగారపు బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీవో ప్రకారం కార్మికుల వేతనాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు అందించే చెప్పులు, బూట్లు, మాస్కులు ఇతర పరికరాలను కూడా ప్రభుత్వం అందించాలని ఆయన కోరారు. రెండు రోజుల పాటు జరిగే దీక్షలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.సుమన్, ఎం.డి. ఖలీల్, సాంబరాజు, మైదం సతీష్, బాలయ్య, శంకర్, ఇందిర, శిరీష, అనిత, సమ్మక్క, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ రేట్లను పెంచాలి

వరంగల్ వ్యవసాయం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీ కార్మికుల రేట్లను పెంచుతూ వెంటనే జీవో జారీ చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో గురువారం సివిల్ సప్లై గోదాముల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీ రేట్లను పెంచాలని కోరుతూ కార్మికులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉంపెల్లి మునీశ్వర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు హమాలీ రేట్లకు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామెర క్రిష్ణ, దేవరబేనా రాంబాబు, గంద్రకోట చంద్రమౌళి, కంచె రవి, పోశాల అనిల్ తదితరులు పాల్గొన్నారు .


మార్కెట్లో సివిల్ సప్లై గోదాముల వద్ద సమ్మె చేస్తున్న హమాలీ కార్మికులు

మాజీ ప్రధాని మన్మోహన్ ఆశయాలను కొనసాగించాలి

ఖిలావరంగల్, జనవరి 2:(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ ఆశయా లను నేటి యువత కొనసాగించా లని టీపీసీసీ ఎస్టీ సెల్ మాజీ కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాయపురం సాంబయ్య అన్నారు. ఖమ్మం రోడ్ వద్ద గల ఆయన కార్యాలయంలో గురువారం ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాన మంత్రి మన్‌మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి రెండుసార్లు ప్రధానమంత్రిగా ఆయన ఎనలేని సేవచేశారన్నారు. గతంలో దేశ ఆర్థిక వ్యవస్థ చాలా ఇబ్బందులలో ఉన్నప్పుడు అనేక సమీకరణాలు చేసి దేశాన్ని అభివృద్ధి పథకంలో నడిపించిన గొప్పమేధావి అన్నారు. ఆయన ఆయన మృతి దేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకు లకు తీరనిలోటన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇల్లందుల సమ్మయ్య, ఇల్లందుల ఎలీషా, సుమతి, రబ్బాని, పాలకుర్తి సురేందర్, పాలకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాంబయ్య

రూ.4.80 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

గిర్మాజిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 27వ డివిజన్‌లో రూ 4.80కోట్ల వ్యయంతో ముఖ్యమంత్రి హమీల పథకం వరంగల్ మహానగర పాలక సంస్థ చేపట్టిన సీసీ రోడ్డు పనులను అప్పనివారి వీధిలో గురువారం స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27 డివిజన్‌లో అబ్బనికుంట, గిర్మాజిపేట, గోవిందరాజుల గుట్ట,యాకుత్‌పురా తదితర ప్రాంతాలలో రూ 4.80కోట్లతో 8సీసీ రోడ్లు, 20బాక్స్ డ్రైనేజీలు, కమ్యూనిటీహాల్ చేస్తున్నట్లు చెప్పారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోవడంతో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో పనులను ప్రారంభించి పూర్తి చేస్తున్నట్లు కార్పొరేటర్ అనిల్ కుమార్ చెప్పారు. డివిజన్‌లోని శతాబ్దల నాటి సన్నని గల్లీలను స్థానికుల సహకారంతో విస్తరి స్తున్నామన్నారు. చారిత్రక గోవిందరాజుల గుట్ట వద్ద కమ్యూనిటీ హాల్‌ను కూడ ముఖ్యమంత్రి హమీల పథకం నిధులతో చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.


27వ డివిజన్ అప్పనివారి వీధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్

ముగిసిన సీఎం కప్ క్రీడలు

రెజ్లింగ్, అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడు రోజులుగా జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు ముగిశాయి. గురువారం జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, సీఎంవో ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మూడు రోజులుగా రెజ్లింగ్, అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల మధ్య జరిగిన పోటీల్లో గెలుపే లక్ష్యంగా పోటీ పడ్డారు. కాగా, రెజ్లింగ్‌లో ఆతిథ్య హనుమకొండ జిల్లాకు చెందిన రెజ్లర్లు తమ సత్తా చాటి ఏకంగా ఏడు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు రమేష్, రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని అన్నారు. డీఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్, అథ్లెటిక్స్‌లో నిర్వహించిన పోటీల్లో 2వేల మంది పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి రియాజ్ , డీఎస్ఏ కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



రెజ్లింగ్‌లో పతకాలు సాధించిన హనుమకొండ జిల్లా క్రీడకారులతో నిర్వాహకులు

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు

శాయంపేట, జనవరి 2 (ఆంధ్రజోయి): గం జాయి రవాణా చేస్తున్న ము గ్గురిని శాయంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ పరమేశ్వర్ తెలి పిన వివరాల ప్రకారం.. వరంగల్ ఏనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన దారంగుల దేవేందర్, సీష్, కొండపల్లి రాకేష్ అనే ముగ్గురు యువకులు సోమవారం గోవిందాపూర్ స్టేజి వద్ద ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద 30 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనపరుచుకుని, ముగ్గురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ప్రారంభమైన టెట్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ అర్హత పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలతో పాటు నర్సంపేటలో ఏర్పాటు చేసిన 9 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గం టల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరిగింది. జయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మోక్షిత్ కంప్యూటర్స్, అయాన్ డిజిటల్ జోన్, నోబెల్ టెక్నాలజీస్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, జయముఖి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్, తాళ్ల పద్మావతి కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వశిష్ట టెక్నాలజీస్ తదితర ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వరంగల్ మెడికల్, జనవరి 2 (ఆంధ్ర జ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియచేసేందుకు తన వద్దకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. ఎవరి బాధ్యత వారు నిర్వర్తిస్తూ అందరం సమష్టిగా సామాజిక ఆరోగ్యం కోసం కృషి చేద్దామన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో టి.మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, ఇమ్యూనైజేషన్ అధికారి మహేందర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య నివేదన
శుక్రవారం • 3 జనవరి 2025

ఆలయదర్శనం



పంచరంగాలు చూసొద్దాం!


గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతీ, నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు...

దేశంలో అత్యంత పవిత్రమైనవిగా పూర్వులు పేర్కొన్న ఏడు నదుల్లో కావేరి ఒకటి. ఒక పురాణ కథ ప్రకారం... కవేర ముని కుమార్తె కావేరి. ఆమె అగస్త్య మహాముని రెండో భార్య. అగస్త్యుడు నిరంతరం దేశ సంచారంలో ఉండేవాడు. ఆయనతోనే ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించిన కావేరి... నీటిగా మారింది. ఆయన కమండలంలో స్థిరపడింది. అలా ఒకసారి సహ్యాద్రి ప్రాంతంలో (పశ్చిమ కనుమల్లో) అగస్త్యుడు పర్యటిస్తూ... ఒక చోట ధ్యానం కోసం ఆగాడు. అదే సమయంలో... ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని భావించిన భగవంతుడు... ఒక కాకిలో ప్రేరణ కలిగించాడు. ఆ కాకి ఎగురుతూ వచ్చి, అగస్త్యుడి కమండలాన్ని తోసేసింది. కమండలంలో నుంచి నీరు ఉధృతంగా ప్రవహించి, నదీ రూపం దాల్చింది. అదే కావేరి. కావేరీ నదిని సాక్షాత్తూ విష్ణుస్వరూపంగా భావిస్తారు. ఆ నదీ తీరంలో... కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో నెలకొన్న అయిదు రంగనాథుడి ఆలయాలు... పంచ రంగ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ క్షేత్రాల్లో రంగనాథస్వామి శయన భంగిమలో దర్శనమిస్తాడు. వైష్ణవులకు ఇవి అత్యంత పవిత్రమైనవి. ముఖ్యంగా ధనుర్మాసంలో వీటిని భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకొని, రంగనాథుణ్ణి పూజిస్తారు.



శ్రీరంగపట్నం:

పంచరంగ క్షేత్రాలలో శ్రీరంగపట్నంలోని రంగనాథుడి ఆలయం మొదటిది. కర్ణాటకలోని మైసూరు నగరానికి సుమారు 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం వెయ్యేళ్ళ పూర్వం నాటిది. పశ్చిమ గంగవంశానికి చెందిన పాలకులు దీన్ని కట్టించారని చరిత్ర చెబుతోంది. శ్రీరంగపట్నాన్ని రాజధానిగా చేసుకొని టిప్పుసుల్తాన్ పరిపాలించాడు. విశిష్టాద్వైత ప్రతిపాదకుడైన శ్రీమద్రామానుజాచార్యులు ఇక్కడ కొంతకాలం నివసించారు. ఆలయం గర్భగుడిలో రంగనాయకీ సమేతుడైన శ్రీ రంగనాథస్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడు, నారసింహుడు, హనుమంతుడు, గరుత్మంతుడు తదితర దేవతామూర్తులు కూడా ఈ ఆలయ ప్రాంగణంలో కొలువుతీరి ఉన్నారు.



కోవిలడి (తిరుప్పర్‌నగర్):

వైష్ణవులు పవిత్రంగా భావించే 108 దివ్యదేశాలలో ఒకటైన అప్పక్కుడుతాన్ పెరుమాళ్ ఆలయం తమిళనాడులోని ప్రధాన నగరాల్లో ఒకటైన తిరుచిరాపల్లి (తిరుచ్చి)కి 28 కిలోమీటర్ల దూరంలోని కోవిలడిలో ఉంది. ఇక్కడి రంగనాథుడికి 'అప్పక్కుడుతాన్ పెరుమాళ్' అనే పేరు రావడం వెనుక ఒక కథ... స్థలపురాణంలో కనిపిస్తుంది. ఉపమన్యుడనే మహారాజుకు శ్రీమహావిష్ణువు వృద్ధ రూపంలో దర్శనం ఇచ్చాడు. తనకు ఆహారం కావాలని అడిగాడు. ఉపమన్యుడు ఎన్ని పదార్థాలను నివేదించినా... స్వామి ఆకలి శాంతించలేదు. ఏం చెయ్యాలో తెలియక... తనకు మార్గం చూపించాలని పరాశర మహర్షిని ఉపమన్యుడు ఆశ్రయించాడు. అప్పాలను భక్తిపూర్వకంగా స్వామికి సమర్పించుకోవాలని పరాశరుడు సలహా ఇచ్చాడు. వాటితో సంతృప్తుడైన మహా విష్ణువు... అక్కడ కొలువయ్యాడు. మధ్యయుగ చోళుల కాలం నాటి ఈ ఆలయంలో శ్రీరంగనాథుడు భూదేవి, కోమలవల్లీ తాయార్ సమేతుడై ఉంటాడు.



కుంభకోణం:

ఆలయాలకు నిలయంగా ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని కుంభకోణంలోని అతి పెద్ద వైష్ణవాలయాల్లో సారంగపాణి ఆలయం ఒకటి. భృగుమహర్షి... లక్ష్మీ నిలయమైన మహావిష్ణువు వక్షస్థలం మీద తన్నడం, లక్ష్మీదేవి భృగువుపై ఆగ్రహించడం, భృగువు అరికాలిలో ఉన్న కన్నును మహావిష్ణువు చిదిమెయ్యడంతో... భృగువు అహంకారం తొలగిపోవడం... ఈ కథ 'శ్రీవేంకటాచల మహాత్మ్యం'లో కనిపిస్తుంది. ఆ తరువాత లక్ష్మీదేవిని భృగువు ప్రార్థించి, ప్రసన్నం చేసుకొని, తన కుమార్తెగా పుట్టాలని కోరుకుంటాడు. ఆ తరువాత హేమమహర్షిగా భృగువు, ఆయన కుమార్తె కోమలవల్లి (కోమలాంబాళ్)గా లక్ష్మీదేవి జన్మించారు. హేమమహర్షి కోరికపై విష్ణుమూర్తి తన విల్లును (సారంగాన్ని) చేతపట్టి, భూలోకానికి వచ్చి, కోమలవల్లిని పెళ్ళి చేసుకొని, అక్కడే స్థిరపడిపోయాడని స్థలపురాణం వివరిస్తోంది. అందుకే ఈ స్వామిని 'వీట్టోడు మాప్పిళ్ళై' (ఇల్లరికం అల్లుడు) అని పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణం క్రీస్తు శకం ఏడు, ఎనిమిది శతాబ్దాల్లో తొలి చోళ రాజుల కాలంలో జరిగి ఉండొచ్చని చరిత్రకారుల అభిప్రాయం. కాగా పంచరంగ క్షేత్రాల్లో ఒకటిగా... ఈ ఆలయానికి బదులు తమిళనాడులోని నాగపట్నం జిల్లా వడ(ట)రంగంలో ఉన్న రంగనాథపెరుమాళ్ ఆలయాన్ని కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి.



తిరుఇందలూర్:

తమిళనాడులోని మయిలాడుతురై పట్టణ శివార్లలోని తిరుఇందలూర్‌లో కొలువుతీరిన రంగనాథస్వామిని 'పరిమళ పెరుమాళ్' అని పిలుస్తారు. స్థల పురాణం ప్రకారం... శాపగ్రస్థుడైన చంద్రుడు ఆ శాపం నుంచి విముక్తి పొందడానికి ఇక్కడ తపస్సు చేశాడు. అనుగ్రహించిన మహావిష్ణువు ప్రత్యక్షమై, చంద్రుణ్ణి శాపవిముక్తుణ్ణి చెయ్యడంతో పాటు అతని కోరికపై ఇక్కడ వెలిశాడు. ఇందుడు అంటే చంద్రుడు... ఆ పేరుమీద ఈ క్షేత్రానికి 'తిరుఇందలూర్' అనే పేరు వచ్చింది. వెయ్యేళ్ళకు పైగా చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని మధ్య యుగ చోళులు, విజయనగర రాజులు, మధుర నాయకులు అభివృద్ధి చేశారు. పరిమళ పెరుమాళ్ దేవేరి పరిమళ రంగనాయకి. ఆమెను 'చంద్రశాప విమోచనవల్లి', 'పుండరీకవల్లి' అని కూడా పిలుస్తారు. గర్భాలయంలో నదీ దేవతలైన గంగ, కావేరి విగ్రహాలు ఉంటాయి. ఈ ఆవరణలో యోగనరసింహుడు, రామాంజనేయులు, సూర్య చంద్రులు తదితర ఉపాలయాలు కూడా ఉన్నాయి. మయిలాడుతురై పట్టణ కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

శ్రీరంగం:

108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అత్యంత ప్రధానమైన శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం 'భూలోక వైకుంఠం'గా, 'ఇండియన్ వాటికన్'గా ప్రసిద్ధి చెందింది. దీన్ని 'పెరియ కోయిల్ (పెద్ద గుడి) అని కూడా పిలుస్తారు. 'శ్రీరంగ మహాత్మ్యం'తో సహా అనేక గ్రంథాల్లో ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించిన ఎన్నో కథలున్నాయి. ఈ ఆలయ గోపురం క్షీరసాగర మథనంలో ఆవిర్భవించిందనేది వాటిలో ఒకటి. విభీషణుడు ఈ ఆలయాన్ని నిర్మించాడని స్థలపురాణం చెబుతోంది. రామాయణం, మహాభారతం, పద్మ, బ్రహ్మాండ, గరుడ పురాణాల్లో, అనేక ప్రాచీన గ్రంథాల్లో శ్రీరంగనాథుడి ప్రస్తావన ఉందని 'శ్రీరంగ మహాత్మ్యం' పేర్కొంటోంది. కాగా, క్రీస్తుపూర్వం 500 నుంచి 300 మధ్యకాలానికి చెందిన సంగమ యుగ తమిళ సాహిత్యం కూడా శ్రీరంగ క్షేత్ర విశిష్టతను వివరించింది. ధనుర్మాసంలో గానం చేసే తిరుప్పావై పాశురాలను రచించిన గోదాదేవి (ఆండాళ్)కి, శ్రీరంగనాథుడికి వివాహం కూడా జరిగిన ప్రదేశంగానూ దీనికి ప్రశస్తి ఉంది. 150 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయంలో 21 గోపురాలు, ఏడు ప్రాకారాలు ఉన్నాయి. 236 అడుగులతో, పదమూడు అంతస్తుల్లో ఉండే సమున్నతమైన రాజగోపురం ప్రత్యేక ఆకర్షణ. అలాగే ప్రపంచంలోనే పెద్దదైన రంగనాథస్వామి విగ్రహం ఈ ఆలయంలో ఉంది. స్వామి దేవేరి శ్రీరంగనాయకి. ఆమెను 'రంగనాయకి నాచియార్' అని కూడా వ్యవహరిస్తారు. ఈ ఆలయంలో అనేక ఉపాలయాలతో పాటు శ్రీరామానుజ స్వామి భౌతిక దేహం కూడా దాదాపు 1200 ఏళ్లుగా భద్రపరచి ఉండడం మరో విశేషం. తిరుచిరాపల్లి (తిరుచ్చి)కి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.



ఆదిమధ్యాంత రంగాలు

కావేరీ నది తీరంలోని మూడు వేర్వేరు దీవుల్లో ఉన్న రంగనాథ ఆలయాలను 'ఆది', 'మధ్య', 'అంత్య' రంగాలుగా పేర్కొంటారు. వీటిలో శ్రీరంగపట్నలోనిది ఆద్యరంగం, శ్రీరంగంలోనిది అంత్యరంగం కాగా... కర్ణాటకలోని శివసముద్రంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని 'మధ్యరంగం'గా వ్యవహరిస్తారు. ఇక్కడ రంగనాథస్వామి యవ్వనంలో ఉంటాడని భక్తుల నమ్మకం. కాబట్టి ఆయనను 'మోహన రంగడు', 'జగన్మోహన రంగడు' అని పిలుస్తారు.



గీతాసారం

ఆ అర్హత పొందేది అప్పుడే...

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖ దుఃఖదాః
ఆగమాపాయినో నిత్యాః స్తాం స్తితీక్షస్వ, భారత!




"అర్జునా! ఇంద్రియాలతో విషయాల సంయోగం వల్ల..., క్షణికమైన సుఖాలు, దుఃఖాలు కలిగినట్టు అనిపిస్తూ ఉంటుంది. అవి అనిత్యమైనవి. శీతాకాలంలా, ఎండాకాలంలా వస్తూ పోతూ ఉంటాయి. వాటి వల్ల కలత చెందకుండా... అంటే సుఖం వచ్చినప్పుడు సంతోషపడకుండా, కష్టం వచ్చినప్పుడు దుఃఖపడకుండా... ఓర్పుతో వాటిని సహించాలి" అని ఈ గీతాశ్లోకంలో శ్రీకృష్ణుడు బోధించాడు. సమకాలీన సమాజంలో ఈ భావాన్నే 'అది కూడా దాటిపోతుంది' అని వ్యక్తీకరిస్తూ ఉంటాం. అనుభవాత్మకమైన స్థాయిలో మనం దీన్ని అలవాటు చేసుకోగలిగితే... ఈ ద్వంద్వాలను అధిగమించ గలుగుతాం, వాటిని సమానంగా చూడగలుగుతాం.

మనకు చూపు, వినికిడి, వాసన, రుచి, స్పర్శ అనే అయిదు ఇంద్రియానుభూతులు ఉన్నాయి. వాటిని వ్యక్తీకరించే భౌతిక సాధనాలు... కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం. సంబంధిత అవయవాల ద్వారా వచ్చే సమాచారాన్ని క్రమబద్ధీకరించడానికి మెదడులో కూడా ఒక్కొక్క ఇంద్రియానికి ఒక్కొక్క భాగం ఉంటుంది. ఇంద్రియ సాధనలకు అనేక పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు కన్ను ఒక రకమైన పౌనఃపున్యంగల కాంతిని మాత్రమే క్రమబద్ధం చెయ్యగలదు. దీన్నే మనం 'దృశ్యమాన కాంతి' (విజిబుల్ లైట్) అంటాం. ఇక రెండో విషయమేంటంటే... కన్ను సెకెనుకు 15 బొమ్మల కన్నా ఎక్కువ గుర్తించలేదు. తెరపై చూసినప్పుడు మనకు ఆనందాన్ని ఇచ్చే వీడియోలు, సినిమాల సృష్టి వెనుక సూత్రం ఇదే. మూడోది... దేన్నయినా చూడడానికి కనీసం కొంత కాంతి అయినా అవసరం. ఇంద్రియాలకు ఉన్న ఈ పరిమితులు 'సత్' (శాశ్వతం), 'అసత్' (అశాశ్వతం) మధ్య తేడాను గమనించే మన సామర్థ్యానికి అడ్డుపడతాయి. తాడుని చూసి చుట్టుకున్న పాము అని భ్రమ పడేలా చేస్తాయి.

ఈ భౌతిక పరికరాలకు అనుబంధంగా ఉండే మెదడులోని భాగాలు కూడా ఈ పరికరాలకు ఉన్న పరిమితుల కారణంగా వైకల్యానికి గురి అవుతాయి. ప్రత్యేకించి, మన బాల్యంలో పెంపకం ద్వారా మనకు నేర్పిన అంశాల వల్ల... మెదడులోని కొన్ని కణాలైన న్యూరాన్లు ప్రత్యేకమైన నిర్మాణాన్ని సంతరించుకుంటాయి. దీన్నే 'హార్డ్ వైరింగ్' అంటారు. ఇది ప్రేరేపితమైన అవగాహనను కలిగిస్తుంది. అంటే మనం దేన్ని చూడాలనుకుంటున్నామో దాన్నే చూసేలా చేస్తుంది. 'సత్'ను చూడలేని ఈ అసమర్థత, 'అసత్' వైపు ఒరిగే స్వభావం దుఃఖానికి కారణం అవుతాయి. సుఖం, దుఃఖం లాంటి ధ్రువాలు దాడి చేసినప్పుడు మనం సంతులనంతో ఉండగలిగితే... అంటే వివేకంతో సుఖ, దుఃఖాలను సమానంగా చూస్తూ, వాటి వల్ల బాధపడకుండా ఉన్నప్పుడు... అమృతానికి (మోక్షానికి) అర్హత సంపాదించుకుంటామని...

యం హి న వ్యథయం త్యే
తే పురుషం
పురుషర్షభ
సమదుఃఖ సుఖం ధీరం
సోమృతత్వాయ కల్పతే... అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు అభయం ఇచ్చాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ముత్యాల ముగ్గు





19 చుక్కలు
5 వరుసలు
అటు ఇటు వదిలి 5 వరకు



సి.హెచ్. మాధవి
అల్వాల్, హైదరాబాద్

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

జీవితమే సందేశం

పూర్వం ఒక ధనికుడి దగ్గర ఒక సామాన్యుడు పనిచేస్తూ ఉండేవాడు. రోజూ అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి తెచ్చేవాడు. బావిలో నీళ్ళు తోడేవాడు. ఆ ఇంట్లో వారు చెప్పిన ఇతర పనులన్నీ చేసేవాడు. యజమాని పెట్టిన తిండి తినేవాడు. ఇచ్చిన వస్త్రాలు ధరించేవాడు. ఏదో ఒక మూల నిద్రపోతూ ఉండేవాడు. అయితే అతనిలో జ్ఞానపిపాస ఉండేది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. అలా ఒక రోజు అతను ఆలోచిస్తూ, ఆలోచిస్తూ తాదాత్మ్యస్థితిలోకి వెళ్ళిపోయాడు. అకస్మాత్తుగా అతనికి జ్ఞానోదయం కలిగింది. అతని హృదయంలో ప్రేమ, ఆనందం ఉప్పొంగాయి. క్రమంగా అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. అతణ్ణి చూసినవారికి ఏదో తేజస్సు కనిపించేది. క్రమంగా జనం ఆయన పట్ల ఆకర్షితులయ్యారు. అతణ్ణి అనేక విషయాల గురించి అడిగేవారు. అతను ఏదో చెప్పి తప్పించుకొనేవాడు. కానీ అతను గొప్పవాడనే ప్రచారం చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యాపించింది. గురువుగా అతణ్ణి భావించేవారు. అలాగే పిలిచేవారు.

ఈ గురువు గురించి తెలుసుకున్న ఒక వ్యక్తి... తన సందేహాలను చర్చించడం కోసం దూరప్రాంతం నుంచి ఆ గ్రామానికి బయలుదేరాడు. ఊరు బయటే అతను కనిపించడంతో... పలకరించాడు. కొద్దిసేపు మాట్లాడిన తరువాత... అతనికి జ్ఞానోదయం కలిగిందని స్పష్టమయింది. "మీరు జ్ఞాని అయ్యారు కదా! అంతకుముందు మీరేం చేసేవారు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆ గురువు నవ్వి "మా యజమాని కోసం కట్టెలు కొట్టి తెచ్చేవాణ్ణి. బావికి వెళ్ళి నీరు తోడి తెచ్చేవాణ్ణి" అని సమాధానం ఇచ్చాడు.


"ఇప్పుడు మీరు జ్ఞాని కదా! ఇప్పుడేం చేస్తున్నారు?" అని అడిగాడు ఆ వ్యక్తి.

"ఇప్పుడూ అదే పని చేస్తున్నాను" అన్నాడు గురువు.

"మరి తేడా ఏముంది? మీరు జ్ఞాని కావడం వల్ల ప్రయోజనం ఏముంది?" అని ప్రశ్నించాడు ఆ వ్యక్తి.

అప్పుడు గురువు

సద్బోధ



"ఎంతో తేడా ఉంది. అంతకుముందు కట్టెలు కొట్టి తెచ్చినా, బావి నుంచి నీరు మోసుకువచ్చినా యజమాని మీద కోపంతో ఎప్పుడూ ఏదో గొణుక్కొంటూ ఉండేవాణ్ణి. ఆ పనులన్నీ తిట్టుకుంటూ చేసేవాణ్ణి. పనిపట్ల విసుగు, యజమానిపట్ల ద్వేషం ఉండేవి. తినే తిండి నచ్చేది కాదు. కంటికి నిద్ర పట్టేది కాదు. మనసుకు ప్రశాంతత అసలే ఉండేదికాదు. కానీ ఇప్పుడు ఆ పనులన్నీ నాకు ఎంతో ఆనందదాయకమైన, ఆహ్లాదమైన కార్యాలు. వాటిలో అందం, ఆనందం ఇంతా అంతా అని చెప్పలేను. ఇప్పుడు నా దృష్టిలో ఆ యజమాని... నా శ్రేయోభిలాషి, నా సంరక్షకుడు. అతని పట్ల నాకు అమితమైన కృతజ్ఞతాభావం ఏర్పడింది. ఎందుకంటే నాకు కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర ప్రసాదిస్తున్నాడు. సరే! ఇప్పటికే ఆలస్యమయింది. నా యజమాని నాకోసం ఎదురుచూస్తూ ఉంటాడు. వెళ్ళొస్తాను" అని ప్రశాంత వదనంతో, మెరిసేకళ్ళతో చెబుతూ వెళ్ళిపోయాడు.

ఈ కథను ఒక సందర్భంలో ఓషో (రజనీశ్) ఉదహరించారు. శిష్యులతో సేవలు చేయించుకొనే గురువుల గురించి మాత్రమే విన్న మనకు ఇతరులకు సేవలు చేయడానికి ఉబలాటపడే గురువుల గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. "ధ్యానం చేస్తాను, జపం చేస్తాను, ప్రవచనం చెబుతాను" అనే గురువులే తెలిసిన మనకు... "ఆకలైనప్పుడు తింటాను, నిద్రవస్తే నిద్రపోతాను" అని చెప్పే గురువుల తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ ఇది నిజం. ఇలాంటివారు ఎందరో ఉన్నారు. ఎంతో సాధారణ వ్యక్తుల్లా జీవిస్తారు. వారు ఎక్కడా ఏ ప్రత్యేకతా కోరుకోరు. ప్రతి పనిని మనస్ఫూర్తిగా, సంతోషంగా చేయాలి, వాటిలో ఆనందం వెతుక్కోవాలి. మన చుట్టూ ఉన్నవారిని ప్రేమించాలి. ఆదరించేవారిపట్ల కృతజ్ఞతతో ఉండాలి. అలాంటి జీవితాన్ని గడపడం ద్వారా... తమ జీవితాన్నే ఒక సందేశంగా బోధించే గురువులకన్నా గొప్పవారు ఇంకెవరుంటారు?


రాచమడుగు శ్రీనివాసులు

చింతన

మనం స్వేచ్ఛగానే ఉన్నామా?

మనకు ఇష్టం వచ్చిన మతాన్ని మనం అనుసరిస్తాం. నచ్చిన రాజకీయ పార్టీకి ఓటు వేస్తాం. నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకుంటాం. నచ్చిన ప్రదేశంలో జీవిస్తాం. ప్రజాస్వామ్యం పుణ్యమా అని మనకు అంత స్వేచ్ఛ ఉంది. మన దేశ చరిత్రలో కనీవినీ ఎరుగనంత సేచ్ఛను ఈనాడు అనుభవిస్తున్నామంటే అతిశయోక్తి కాదు. మరి మనం నిజంగానే స్వేచ్ఛగా ఉన్నామా?

జిడ్డు కృష్ణమూర్తి దృష్టిలో ఈ స్వేచ్ఛ కేవలం ఒక భ్రాంతి మాత్రమే. నిజానికి మనం ఎన్నో ప్రభావాలకు లోనై ఉంటాము. ఉదాహరణకు, మన వృత్తికి సంబంధించిన నిర్ణయం వెనుక ఎన్నో ఆదర్శాలు, ఆశలు, దురాశలు, దేశ కాల పరిస్థితులు గుప్తంగా ఉంటాయి. మనం ప్రేమించి పెళ్ళి చేసుకొనే వ్యక్తి కూడా అంతే. అసలు అందం అనే భావం మీద ఎన్నో ప్రభావాలు కనిపిస్తాయి. ఈ ప్రభావాలకు అతీతమైన అందం ఏదైనా ఉంటుందా? అనేది ఒక పెద్ద వివాదాంశం. "మనిషి తీసుకొనే నిర్ణయాల మీద ఈ ప్రభావాలు ఉన్నంతకాలం... మనిషిని స్వేచ్ఛాజీవి అనడానికి వీలు లేదు" అనేది కృష్ణమూర్తి మనకు తెలియజేసే ఒక ముఖ్యమైన సత్యం. అంటే... అన్ని ప్రభావాలను వదిలించుకున్న తరువాతే మనిషికి స్వేచ్ఛ వస్తుంది. మన పెంపకం, చదువుకున్న పుస్తకాలు (అది భగవద్గీత కావచ్చు, కమ్యూనిస్ట్ మేనిఫెస్టో కావచ్చు), నేర్చుకున్న సిద్ధాంతాలు, విద్యలు, మన అనుభవాలు, సమకాలీన పరిస్థితులు, మన సమాజం, మన వాతావరణం, చివరకు మనం తీసుకొనే ఆహారం... వీటన్నిటి ప్రభావం మన చైతన్యం మీద ఉంటుంది. ఈ ప్రభావాలను మనం ప్రయత్నపూర్వకంగా వదిలించుకోవచ్చు. మన చైతన్యాన్ని శుభ్రపరచుకోవచ్చు. అయితే అంతమాత్రాన మనకు నిజమైన స్వేచ్ఛ రాదు. మనిషి చైతన్యం మీద ఇంకొక లోతైన ప్రభావం ఉంటుంది.



కొందరు తత్త్వవేత్తల దృష్టిలో మనిషి ఆలోచించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటున్నప్పుడు... అతడు ఒక స్వేచ్ఛాజీవి. కానీ ఈ ప్రతిపాదనలో ఉన్న దోషాలను కృష్ణమూర్తి చూపిస్తారు. ఆలోచనలలోని అంశాలన్నీ మనం గతంలో జ్ఞానేంద్రియాల ద్వారా సంపాదించిన విషయాలే. వీటన్నిటి సాయంతో మనం... అంటే మన చైతన్యం ఆలోచించగలుగుతుంది. అంటే 'ఆలోచించడం' అనే ఒక ప్రక్రియ... గతానికి బద్ధమై, గతంలోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. గతాన్ని అధిగమించలేని ఆలోచనా ప్రక్రియకు స్వేచ్ఛ ఉండే అవకాశం లేదు. అయితే మనిషి చైతన్యంలో మరో రెండు ప్రగాఢమైన ప్రభావాలు ఉంటాయి, అవి: అహంకారం అంటే 'నేను' అనే భావం, అలాగే కాలం. ఇవి ఆలోచనల్లో పుట్టే అతి క్లిష్టమైన రెండు ప్రభావాలు. అంటే కేవలం ఉపరితలంలో ఉండే పెంపకం, చదువు లాంటి ప్రభావాలను వదిలించుకున్నంతమాత్రాన మనిషికి స్వేచ్ఛ రాదు. మనిషి చైతన్యం ఆలోచనను, అహంకారాన్ని, కాలాన్ని కూడా నిశ్శేషంగా నిర్మూలించాలి. అప్పుడే అతనికి పరిపూర్ణమైన స్వేచ్ఛ లభిస్తుంది. "ఈ మూడింటిని ఒక్క క్షణంలో అధిగమించాలి. నెలల తరబడి, సంవత్సరాల తరబడి చేసే సాధన ద్వారా కాదు. దీనికి వేరే మార్గం ఏదీ లేదు అంటారు" కృష్ణమూర్తి. 'అది ఎలా సాధ్యం?' అనేదే అసలు ప్రశ్న. క్లిష్టమైన శేషప్రశ్న.

గుంటూరు వనమాలి
www.gunturu.de

765 చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

- తుది నోటిఫికేషన్ జారీ.. మిగతా వాటికి ప్రాథమిక నోటిఫికేషన్
- అభ్యంతరాల పరిశీలన తర్వాత తదుపరి ప్రక్రియ
- హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3,342 చెరువులు
- వాటి సంరక్షణకు వేగంగా చర్యలు.. హైకోర్టుకు ప్రభుత్వం వెల్లడి

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో ఉన్న 3,342 చెరువులకుగాను 765 చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. మిగతా చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్‌లు జారీ చేశామని.. వాటిపై అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత ఫైనల్ నోటిఫికేషన్ వెలువరిస్తామని పేర్కొంది. హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్న నేపథ్యంలో.. అన్ని చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ ఫైనల్ నోటిఫికేషన్‌లు జారీ చేయాల్సి ఉందని వెల్లడించింది. చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, ఆక్రమణలకు తావు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయటం వంటి చర్యల అవసరం ఉందని తెలిపింది. ఈ మేరకు ఫైనల్ నోటిఫికేషన్‌లు ఇచ్చే అంశంపై ప్రత్యేకంగా ఒక సుమోటో పిటిషన్‌ను రిజిస్ట్రర్ చేసి ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలియజేసింది. గురువారం ఈ అంశంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత పరిస్థితిపై అదనపు స్థాయీ నివేదికను సమర్పించినట్లు పేర్కొన్నారు. 765 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ ఇప్పటికే జారీ చేశామని.. మిగతా వాటి విషయంలో వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు చెరువుల హద్దులు గుర్తించడం తదితర అంశాల్లో హెచ్ఎండీఏ, ప్రభుత్వం కసరత్తు చేస్తున్నాయని, తదుపరి విచారణ నాటికి మంచి పురోగతి సాధించి ఆ వివరాలు నివేదిస్తామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. మరిన్ని వివరాలతో పనుల పురోగతిపై అదనపు స్థాయీ నివేదిక సమర్పించాలని పేర్కొంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 4కి వాయిదా వేసింది.

బాలికల హాస్టల్ వాష్‌రూంలో వీడియో?

- సీఎంఆర్ ఐటీ కాలేజీ విద్యార్థుల నిరసన
- రెండో రోజూ ఆందోళనల కొనసాగింపు
- పోలీసుల అదుపులో ఐదుగురు.. 12 ఫోన్ల సీజ్
- సుమోటోగా మహిళా కమిషన్ విచారణ


హాస్టల్ వైపు వెళ్లేందుకు గేటు దూకే ప్రయత్నంలో విద్యార్థి సంఘం నేతలు

మేడ్చల్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వాష్‌రూంలో ఉండగా.. వీడియోలు తీశారంటూ కండ్లకోయ సీఎంఆర్ ఐటీ బాలికల హాస్టల్ వద్ద విద్యార్థులు ఆందోళనకు దిగారు. బుధవారం రాత్రి నుంచి హాస్టల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు రంగంలోకి దిగారు. గురువారం కూడా విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగించగా.. విద్యార్థి సంఘాలు అండగా నిలిచాయి. మహిళా కమిషన్ కూడా ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. మేడ్చల్ ఏసీపీ నేతృత్వంలో పోలీసు దర్యాప్తు ప్రారంభమైంది. విద్యార్థులు, పోలీసుల కథనం ప్రకారం.. బాలికల హాస్టల్ విద్యార్థిని ఒకరు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లగా.. వెంటిలేటర్ నుంచి ఎవరో సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్నట్లు గుర్తించి, తోటి స్నేహితులకు చెప్పింది. విద్యార్థులంతా వార్డెన్‌కు విషయం చెప్పగా.. స్పందన లేకపోవడంతో రాత్రికి రాత్రి హాస్టల్ ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న మిగతా హాస్టళ్ల విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఈ ఘటనపై విచారణ జరపాలంటూ హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. హాస్టల్ సిబ్బంది సెల్‌ఫోన్లను విశ్లేషించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటికి శాంతించిన విద్యార్థినులు.. గురువారం ఉదయం తమ ఆందోళనను కొనసాగించారు. పలు విద్యార్థి సంఘాల నేతలు గేటు దూకి, లోనికి చేరుకుని.. విద్యార్థినులకు సంఘీభావం తెలిపారు. చూస్తుండగానే ఆందోళనకారుల సంఖ్య పెరగడంతో మరోమారు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మేడ్చల్ ఏసీపీ నేతృత్వంలోని పోలీసులు అక్కడకు చేరుకోగా.. హాస్టల్ వార్డెన్ తీరును నిరసిస్తూ.. విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. గతంలోనూ వాష్‌రూమ్‌ల వద్ద వీడియోలు తీస్తున్న ఘటనలపై ఫిర్యాదు చేసినా.. వార్డెన్ పట్టించుకోలేదని వివరించారు. తాము ఇంతగా ఆందోళన చేస్తున్నా.. సీఎంఆర్ యాజమాన్యం వివరాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని మండిపడ్డారు. చివరకు సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం విద్యార్థినులతో చర్చలు జరిపారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. అటు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి కూడా విద్యార్థులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఇప్పటి వరకు ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని, 12సెల్‌ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు. వాష్‌రూమ్‌లో వీడియోలు తీసినట్లు తేలితే.. కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర మహిళా కమిషన్ కూడా ఈ ఉదంతాన్ని సుమోటోగా విచారిస్తోంది. కమిషన్ సభ్యురాలు పద్మజ రమణ కూడా బాలికల హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థునులతో మాట్లాడారు. అయితే.. నిందితులను అరెస్టు చేసే దాకా అరెస్టయ్యేదాకా ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థినులు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నేతపై దాడి కేసులో పోలీసుల ముందుకు పట్నం నరేందర్‌రెడ్డి

- మూడు గంటల పాటు విచారణ

బొంరాస్‌పేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతపై దాడి చేసిన కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని బొంరాస్‌పేట్ స్టేషన్ పోలీసులు గురువారం విచారించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 3 గంటల పాటు పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి సమక్షంలో బొంరాస్‌పేట్ ఎస్సై అబ్దుల్ రవూఫ్ పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. అక్టోబరు 25న లగచర్ల పరిధిలోని రోటిబండ తండాలో గిరిజనులు దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అవుటి శేఖర్‌ను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి దాడికి పాల్పడటంతో కేసు నమోదైంది. నరేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. విచారణ అధికారి పిలిచినప్పుడు రావాలన్న ఆదేశాల మేరకు తాజాగా ఆయన పోలీసుల ఎదుట హాజరయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు 20 నుంచి 25 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్‌పై దాడికి ప్రేరేపించింది ఎవరు? ఎందుకు ప్రేరేపించారు? దాడులతో ఎవరికి ఎలాంటి ప్రయోజనం చేకూరిందనే అనే కోణంలో విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం పట్నం నరేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి!

- హైకోర్టులో లగచర్ల నిందితుల పిటిషన్

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లగచర్ల దాడి ఘటనలో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మరో 12 మంది నిందితులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. లగచర్ల దాడి ఘటనలో కొంతమందికి ఇప్పటికే ముందస్తు బెయిల్ లభించగా.. తాజాగా 12 మంది హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్.. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ పోలీసులు, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ ఈనెల 9కి వాయిదా పడింది.

చిత్రజ్యోతి
SINCE 1965

బాలయ్య డైలాగులతో ‘దబిడి దిబిడి’



నందమూరి బాలకృష్ణ అంటేనే డైలాగులకు పెట్టింది పేరు. ఆయన చిత్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన డైలాగ్స్‌తో ఒక పాట తయారు చేస్తే..? ఆయన అభిమానులకు అంతకంటే ఆనందం ఏముంటుంది! అందుకే దర్శకుడు బాబీ కొల్లి ‘డాకూ మహారాజ్’ చిత్రం కోసం ‘దబిడి దిబిడి’ పాటను గీత రచయిత కాసర్ల శ్యామ్‌తో రాయించారు. తమన్ స్వరపరిచిన ఈ పాటను వాగ్దేవి అద్భుతంగా పాడారు. అభిమానుల్లో నిలిచే పోయే ఈ మాస్ నృత్యగీతాన్ని బాలకృష్ణ, ఊర్వశి రౌతేలాపై చిత్రీకరించారు. ఈ పాటను గురువారం విడుదల చేశారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ భారీ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది.

వివాహ బంధంలోకి అర్మాన్ మాలిక్



పాపులర్ గాయకుడు అర్మాన్ మాలిక్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రేయసి, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఆష్నా ష్రాఫ్‌ను గురువారం బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడారు. ఈ విషయాన్ని ఇరువురూ తమ ఇన్‌స్టాగ్రామ్ వేదిక ద్వారా ప్రకటించారు. 2017 నుంచి ప్రేమలో ఉన్న వీరిద్దరికీ గతేడాది నిశ్చితార్థం జరిగింది. కాగా, అర్మాన్ తన పాటలతో తెలుగువారికీ సుపరిచితమే. ‘అలవైకుంఠపురంలో’ సినిమాలోని ‘బుట్టబొమ్మ’.. ‘అరవింద సమేత’లోని ‘అనగనగనగా’.. ‘కాటమరాయుడు’లోని ‘ఏమో ఏమో’.. ‘తొలిప్రేమ’లోని ‘నిన్నిలా నిన్నిలా’.. ‘హలో’ టైటిల్ సాంగ్.. ‘ఎమ్మెస్ ధోనీ’ సినిమాలోని ‘నిన్నే తొలి ప్రేమలో’ పాటలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

మా దర్శకులకు శంకర్ ఒరిజనల్ గ్యాంగ్‌స్టర్

రాజమౌళి



యువ దర్శకులు మమ్మల్ని చూసి గర్వపడుతుంటారు. కానీ మేం మాత్రం శంకర్‌ను చూసి పొంగిపోతుంటాం. దర్శకులకు ఆయన ఓ.జీ.. ఒరిజనల్ గ్యాంగ్‌స్టర్. పెద్ద కలల్ని సినిమాగా తీస్తే డబ్బులు వెనక్కి వస్తాయని అందరిలో కాన్ఫిడెన్స్ క్రియేట్ చేసిన దర్శకుడాయన. ‘గేమ్‌ఛేంజర్’తో వింటేజ్ శంకర్‌ను చూస్తాం’ అన్నారు దర్శకుడు రాజమౌళి. రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ రూపొందించిన ‘గేమ్ ఛేంజర్’ చిత్రం ట్రైలర్‌ను గురువారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేసిన అనంతరం రాజమౌళి మాట్లాడారు. ‘రామ్‌చరణ్ మగధీర’ నుంచి ‘ఆర్ఆర్ఆర్’కే ఎంతో ఎదిగిపోయారు. ఈ సినిమాలో ఆయన హెలికాప్టర్ నుంచి లుంగీ కట్టుకుని కత్తితో దిగుతుంటే విజిల్స్ ఎలా వస్తాయో నాకు తెలుసు’ అన్నారాయన.

‘గేమ్ ఛేంజర్’ సోషల్ కమర్షియల్, మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఓ పొలిటికల్ లీడర్‌కు, ఓ ఐఏఎస్ ఆఫీసర్‌కు మధ్య జరిగే కథ ఇది. ఈ సినిమాతో రామ్‌చరణ్ మళ్లీ అందరి హృదయాలు గెలుస్తారు’ అన్నారు శంకర్.

రామ్‌చరణ్ మాట్లాడుతూ ‘రాజమౌళి, శంకర్.. ఏ విషయంలోనూ రాజీ పడని దర్శకులు. ఇద్దరూ పర్ఫెక్షన్ కోసం ప్రయత్నిస్తుంటారు. ఆర్టిస్టులంతా అద్భుతంగా నటించడం వల్లే ఈ సినిమా ఎలివేట్ అవుతోంది. ఈ నెల 10న మీ ముందుకు వస్తున్నాం’ అని చెప్పారు. ట్రైలర్‌లో చూపించింది యాభై శాతం మాత్రమేనని, అసలు మేటర్ ఈ నెల 10న తెలుస్తుందని నిర్మాత దిల్ రాజు చెప్పారు.పెట్టిన దానికంటే ఎక్కువ లాభాలు రాబోతున్నాయని తెలిపారు.

ప్రపోజ్ చేయమని సవాల్ చేశా



నటి కీర్తి సురేశ్ ఇటీవలే తన చిరకాల ప్రియుడు ఆంటోనీ తట్టిల్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తమ ప్రేమ కథ గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “మాది 15 ఏళ్ల బంధం. ఆర్కుట్ (ఒకప్పటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్)లో చాట్ చేసుకునేవాళ్లం. 12వ తరగతి నుంచే మా మధ్య ప్రేమ చిగురించింది. 2010లో కుటుంబంతో కలసి బయటికి వెళ్లా. అక్కడికి తను వచ్చాడు. భయంతో నన్ను కలవలేకపోయాడు. దమ్ముంటే ప్రపోజ్ చేయమని అప్పుడే సవాల్ చేశా. అలా మొదటిసారి నాకు ప్రపోజ్ చేసి రింగ్ ఇచ్చాడు. పెళ్లయ్యే వరకూ నేను దాన్ని తీయలేదు. ఆ ఉంగరం నేను నటించిన సినిమాల్లో కనిపిస్తుంది. నేను, ఆంటోనీ తగిన సమయం వచ్చే వరకు మా ప్రేమను గోప్యంగా ఉంచాలనుకున్నాం. మేమిద్దరం ప్రేమలో ఉన్నట్లు విజయ్, సమంత, అట్లీ.. ఇలా కొందరికే తెలుసు. ఆంటోనీకి బిడియం ఎక్కువ. తను నాకంటే ఏడేళ్లు పెద్ద. నా కెరీర్ విషయంలో ఆంటోనీ సపోర్ట్ చాలా ఉంది. పెళ్లి చేసుకుని ఒక్కటవ్వడం ఎంతో కాలంగా మేము కన్న కల” అని చెప్పారు.



కొత్త నటుడు కాదు సౌతిండియా స్టార్



ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్, టాలీవుడ్ నిర్మాత నాగవంశీల మధ్య దక్షిణాది, ఉత్తరాది చిత్రపరిశ్రమల మధ్య పోటీపై వాడివేడి చర్చ నడిచిన విషయం తెలిసిందే. ఇదే కార్యక్రమంలో దక్షిణాది హీరోల బాలీవుడ్ అరంగేట్రంపై స్పందిస్తూ ‘జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్‌కు కొత్త నటుడు’ అంటూ బోనీకపూర్ చేసిన ఓ వ్యాఖ్య చర్చనీయాంశమైంది. ‘దక్షిణాది దర్శకులు కొత్త నటుణ్ణి హీరోగా పెట్టి, బాక్సాఫీసు రికార్డు సాధించగలరు, బాలీవుడ్‌లో ఇప్పుడు అలా చేయగలరా? అని సిద్ధార్థ్ బోనీకపూర్‌ను ప్రశ్నించగా, ‘బాలీవుడ్‌లో కూడా ఇలా చేయగలరు, జూనియర్ ఎన్టీఆర్‌ను నిర్మాత ఆదిత్య చోప్రా ‘వార్ 2’ కోసం తీసుకున్నారు కదా’ అని బోనీకపూర్ బదులిచ్చారు. అయితే జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు కొత్త వ్యక్తి కాదని, సౌత్ ఇండియా బిగ్గెస్ట్ స్టార్ అని, ఆయన అగ్ర నిర్మాతలతో సినిమాలు చేశారని సిద్ధార్థ్, నాగవంశీ చెప్పారు. మీ కూతురు జాన్వీకపూర్ ‘దేవర’ చిత్రంలో ఎన్టీఆర్ సరసన నటించిన విషయం కూడా మర్చిపోయారా అంటూ నెటిజన్లు బోనీకపూర్‌ను ప్రశ్నిస్తున్నారు.

బాలీవుడ్‌ను వదిలేస్తా

అనురాగ్ కశ్యప్



‘ఇకపై నేను బాలీవుడ్‌లో సినిమాలు చేయాలనుకోవడం లేదు. దక్షిణాది పరిశ్రమతో కలసి పనిచేస్తాను. ఇన్నేళ్లు పనిచేసినా ఇక్కడ నాకు పెద్దగా గుర్తింపు రాలేదు. బాలీవుడ్‌ను చూస్తుంటే అసహ్యం వేస్తోంది. నిర్మాతలకు ఎంతసేపూ లాభాలు పిండుకోవాలనే యావ తప్ప ప్రయోగాత్మక చిత్రాలకు ఇక్కడ స్థానం లేదు’ అని బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ చెప్పారు. బాలీవుడ్ దర్శకులు హిందీ ప్రేక్షకులను నిర్లక్ష్యం చేయడం వల్లే అక్కడి మార్కెట్‌లో దక్షిణాది చిత్రాలు పాగా వేస్తున్నాయని అన్నారు. ప్రేక్షకుల అభిరుచిని పట్టించుకోకపోతే ఇలానే జరుగుతుంది, బాలీవుడ్ సినిమాల్లో పస లేదు, పరభాషా చిత్రాలను కాపీ కొట్టి సినిమాలు చేస్తున్నారు అని అసంతృప్తి వ్యక్తం చేశారు. దక్షిణాదిన మాత్రం కొత్త తరహా కథలతో సినిమాలు వస్తున్నాయి. అక్కడి సినిమాలను హిందీలో డబ్‌చేసి యూట్యూబ్‌లో పెట్టడం ద్వారా ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకొని మార్కెట్‌ను పెంచుకోగలిగారు’ అని అన్నారు.

రేవ్‌పార్టీ కేసులో హేమకు ఊరట

డ్రగ్స్ కేసులో హై కోర్టు స్టే



నటి హేమకు కర్ణాటక హైకోర్టులో భారీ ఊరట లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లు తనపై నమోదైన కేసులో హేమ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌ను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ చందనగౌడర్ స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది మే 19న బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని జీఆర్ ఫామ్ హౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీలో నటి హేమ సహా పలువురు పాల్గొన్నట్లు పోలీసులు ప్రకటించారు. కానీ తాను హైదరాబాద్‌లో మిత్రులతో కలిసి ఉన్నానని హేమ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. జూన్ 3న హెబ్బగుడి పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద హేమను అరెస్టు చేశారు. కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో జైలుకు వెళ్లారు. పదిరోజుల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు. జైలు నుంచి వచ్చాక పోలీసుల వ్యవహార శైలిపై ఆమె పలు అనుమానాలను వ్యక్తం చేశారు. పార్టీలో తాను డ్రగ్స్ తీసుకోలేదని, శాంపిల్స్‌లోను ఎటువంటి సాక్ష్యాలు లభించలేదని ఆమె హైకోర్టును ఆశ్రయించారు. కేసు నుంచి మినహాయింపు కోరుతూ హేమ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం విచారించి.. స్టే విధించింది. ప్రాసిక్యూషన్‌కు నోటీసులు జారీ చేసింది. - బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మహేశ్‌బాబు - రాజమౌళి సినిమా ప్రారంభం



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. నగర శివారులోని ఓ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ సినిమా పూజా కార్యక్రమం నిర్వహించినట్లు సమాచారం. మహేశ్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు సామాజిక మాధ్యమాల్లో పలు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. సాధారణంగా మహేశ్ బాబు తన సినిమా ఓపెనింగ్ పూజా కార్యక్రమాలకు వెళ్లరు. ఆయన బదులు నమ్రత హాజరవుతుంటారు. అయితే ఈ రోజు రాజమౌళి సినిమా పూజ కోసం మహేశ్ బాబు తన సెంటిమెంట్ మార్చుకొని పూజా కార్యక్రమానికి హాజరయ్యారని అంటున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమానికి సంబంధించిన వీడియోలను, ఫొటోలను చిత్రబృందం అధికారికంగా విడుదల చేయకపోవడం గమనార్హం. కనీసం పూజలో ఎవరెవరు పాల్గొన్నారనే విషయం కూడా బయటకు రాకుండా చిత్రబృందం జాగ్రత్తపడింది. కాగా, భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నారని టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటి వరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.


తమిళ నటుడికి జైలు శిక్ష



ఓ పాత్రికేయురాలి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తమిళ నటుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ శేఖర్‌కు ప్రత్యేక కోర్టు విధించిన ఏడాది జైలు శిక్షను మద్రాసు హైకోర్టు ఖరారు చేసింది. ఆ మేరకు దిగువ కోర్టు వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సమర్పించిన అప్పీలు పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. 2018లో ఓ పాత్రికేయురాలిని కించపరిచేలా ఎస్వీ శేఖర్ తన ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై తమిళ పాత్రికేయుల సంరక్షణ సంఘం కార్యదర్శి మిత్రా మొయుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు ఎస్వీ శేఖర్‌కు నెల రోజుల జైలు శిక్ష రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఎస్వీ శేఖర్ మద్రాసు హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఆ అప్పీలుపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ గురువారం ఎస్వీ శేఖర్ అప్పీలు పిటిషన్‌ను తోసిపుచ్చారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

పుట్టిన వారికి మరణం తప్పదు



జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం ‘జాతస్య మరణం ధ్రువం’. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వంలో ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీని మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో ప్రీతి జంఘియానీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. కాగా, ఈ సినిమాకు ‘జాతస్య మరణం ధ్రువం’ అని టైటిల్ ఖరారు చేసిన మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఒక సంస్కృత పదం నుంచి వచ్చిన ఈ టైటిల్‌కు ‘పుట్టిన వారికి మరణం తప్పదు’ అని అర్థం. ఈ మూవీకి అర్జున్ రాజా డీవోపీ, జిబ్రాన్, రాజ్ ఆషా సంగీతం అందించారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

సిరీస్‌లో ఇప్పటికే 1-2తో వెనుకబడిన వేళ.. సిడ్నీ టెస్టులో భారత జట్టు చావోరేవో తేల్చుకోవాల్సిందే. అయితే ఫలితంపై కాకుండా, ఈ మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడతాడా? పెవిలియన్‌కే పరిమితమవుతాడా? అనేదే ఇప్పుడు అందరికీ ఆసక్తికర అంశం. కోచ్ గంభీర్ సైతం అతడి స్థానంపై భరోసా ఇవ్వకపోవడంతో జరుగబోయేదేంటో అర్థమవుతోంది. పేలవ ఫామ్ కొనసాగిస్తున్న హిట్‌మ్యాన్‌పై వేటు పడితే.. సిరీస్ మధ్యలో ఏకంగా కెప్టెన్‌నే పక్కనబెట్టినట్టవుతుంది. భారత క్రికెట్‌లో ఇలాంటి పరిణామం గతంలో ఎన్నడూ చూడనిది. అదే జరిగితే తొలి టెస్టు మాదిరి ఆఖరి మ్యాచ్‌కు కూడా బుమ్రా కెప్టెన్సీలోనే భారత్ తలపడనుంది.

బరిలోకి టీమిండియా

కెప్టెన్‌గా బుమ్రా

రోహిత్ లేకుండానే?

గాయంతో పేసర్ ఆకాశ్ అవుట్ ● నేటి నుంచి ఆసీస్‌తో ఐదో టెస్టు





ఉదయం 5 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

సిడ్నీ: అత్యంత ఆసక్తిగా సాగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి అంకానికి చేరుకుంది. గురువారం నుంచి జరిగే ఆఖరిదైన ఐదో టెస్టు భారత జట్టుకు అత్యంత కీలకమైనది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌ను సమం చేసుకోగలుగుతుంది. దీంతో పాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ ఆశలను సజీవంగా ఉంచుకోగలుగుతుంది. ఇలా ఒక్క మ్యాచ్.. రెండు ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న టీమిండియా సిడ్నీ టెస్టులో భారీ మార్పులతో బరిలోకి దిగబోతోంది. పేలవ ఫామ్‌తోపాటు నాయకత్వం విషయంలోనూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్ నుంచి తప్పుకొనే అవకాశాలున్నాయి. దీంతో బుమ్రా నాయకత్వంలో జట్టు ఆసీస్‌ను ఎదుర్కొనబోతోంది. ఈ సిరీస్‌లో ఆడిన మూడు టెస్టుల్లో హిట్‌మ్యాన్ కేవలం 6.2 సగటుతో 31 పరుగులు చేయడంతో కోచ్ గంభీర్ అసంతృప్తితో ఉన్నాడు. అలాగే కెప్టెన్సీలోనూ తేలిపోతున్నాడు. మిడిలార్డర్, ఓపెనింగ్ స్థానాల్లో వచ్చినా పరుగుల్లో వెనుకబడి పోవడంతో చివరి టెస్టులో అతడిపై కఠినంగా వ్యవహరించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు మీడియా కథనం. మ్యాచ్‌కు ముందు జరిగిన విలేకరుల సమావేశంలోనూ గౌతీ నర్మగర్భంగా ఇదే విషయాన్ని తెలిపాడు. రోహిత్ ఆడతాడని నేరుగా తేల్చకుండా, పిచ్‌ను పరిశీలించాకే తుది జట్టుపై నిర్ణయం తీసుకుంటామని సమాధానాన్ని దాటవేశాడు. ఒకవేళ శుక్రవారం టాస్ వేసేందుకు రాకపోతే రోహిత్ కెరీర్‌లో మెల్‌బోర్న్ టెస్టే చివరిదని భావించాల్సి ఉంటుంది. మరోవైపు ఆసీస్ జట్టు ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా డబ్ల్యూటీసీ ఫైనల్‌లో చోటు దక్కించుకుంటుంది.

1 సిడ్నీ గ్రౌండ్‌లో తానాడిన 13 టెస్టుల్లో భారత్ ఒక్కసారి మాత్రమే నెగ్గడం గమనార్హం. ఇందులో ఐదు ఓటములు, ఏడు డ్రాలున్నాయి.

మార్పులు ఖాయమే..: సిడ్నీని చేజిక్కించుకోవడం భారత్‌కు అత్యంత ఆవశ్యకం కాబట్టి కోచ్ గౌతీ తుది జట్టును పకడ్బందీగా రూపొందించాలనుకుంటున్నాడు. దీంట్లో భాగంగా నాలుగో టెస్టుకు దూరమైన గిల్‌ను రోహిత్ స్థానంలో తీసుకుని వన్‌డౌన్‌లో ఆడించడం ఖాయంగానే కనిపిస్తోంది. ఓపెనర్‌గా తిరిగి రాహుల్ ఆడతాడు. మరోవైపు నిర్లక్ష్యపు షాట్లతో ఎంసీజీలో జట్టు ఓటమికి కారణమైన కీపర్ పంత్‌పైనా వేటు వేస్తారా? అనేది చూడాల్సిందే. డ్రా కోసం ఓపిగ్గా ఆడాల్సిన వేళ భారీ షాట్‌కు వెళ్లి పంత్ అవుట్ కాగా, ఆసీస్ ఆ తర్వాత టపటపా వికెట్లను పడగొట్టింది. తన స్థానంలో మరో కీపర్ ధ్రువ్ జురెల్ చాన్స్ కోసం చూస్తున్నాడు. నెట్స్‌లోనూ తను ప్రాక్టీస్ చేయడం కనిపించింది. కానీ సిడ్నీ మైదానంలో పంత్ గతంలో అజేయంగా 159 రన్స్ చేసి జట్టును కాపాడాడు. ఒకవేళ పంత్‌ను కొనసాగిస్తే..తుది కూర్పు ఎలావుంటుందో చూడాలి. అలాగే మెల్‌బోర్న్‌లో ఆకట్టుకున్న పేసర్ ఆకాశ్ దీప్ వెన్నునొప్పితో ఈ టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానం కోసం హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ క్రిష్ణ పోటీపడుతున్నారు. బ్యాటింగ్‌లో జైస్వాల్, నితీశ్, రాహుల్ నిలకడగా రాణిస్తున్నారు. విరాట్ కోహ్లీ సైతం ఫామ్‌లేమితో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. సిడ్నీలో స్థాయికి తగ్గట్టు రాణిస్తేనే అతడి కెరీర్ కొనసాగే అవకాశాలుంటాయి. ఇక బౌలింగ్‌లో బుమ్రా జట్టు భారాన్నంతా మోస్తున్నాడు. సహచర బౌలర్ల నుంచి అతడికి తోడ్పాటు అందడం లేదు.



వెబ్‌స్టర్

మార్ష్‌పై వేటు

ఆస్ట్రేలియా కూడా సిరీస్‌ను గెలిచేందుకు మార్పులతో బరిలోకి దిగుతోంది. మిడిలార్డర్‌లో మిచెల్ మార్ష్ దారుణంగా విఫలమవుతున్నాడు. టీ20ల్లో జట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్న తను ఈ సిరీస్‌లో చేసింది 73 పరుగులే. దీంతో అతడిపై వేటు పడింది. కొత్తగా 31 ఏళ్ల బ్యూ వెబ్‌స్టర్‌కు అవకాశమిచ్చారు. ఈ సిరీస్‌లో ఆసీస్ నుంచి తను మెక్‌స్వీనే, కాన్‌స్టాస్ తర్వాత మూడో అరంగేట్ర ప్లేయర్ కాబోతున్నాడు. 6.5 అడుగుల ఎత్తున్న ఈ ఆజానుబాహుడు బౌలింగ్‌లో ఆఫ్‌స్పిన్ కాకుండా మీడియం పేస్ కూడా వేయగలడు. అలాగే ఆసీస్ బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తుండడంతో భారత బౌలర్లు శ్రమించాల్సిందే. దూకుడు మీదున్న ట్రావిస్ హెడ్ ఎంసీజీలో మాత్రం విఫలమయ్యాడు. పేసర్ స్టార్క్ ఫిట్‌గానే ఉండడం ఆసీస్‌కు సానుకూలాంశం. కెప్టెన్ కమిన్స్ ప్రత్యర్థి బ్యాటర్లను హడలగొడుతున్నాడు.

జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్)/గిల్, జైస్వాల్, రాహుల్, విరాట్, పంత్, జడేజా, సుందర్/జురెల్, నితీశ్, ప్రసిద్ధ్/హర్షిత్, బుమ్రా, సిరాజ్.

ఆస్ట్రేలియా (తుదిజట్టు): ఖవాజా, కాన్‌స్టాస్, లబుషేన్, స్మిత్, హెడ్, వెబ్‌స్టర్, క్యారీ, కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, బోలాండ్, లియోన్

పిచ్, వాతావరణం

ఎస్‌సీజీ పిచ్ బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించనుంది. ఆరంభంలో బ్యాటర్లు లాభపడనుండగా.. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. అయితే వాతావరణ పరిస్థితులను బట్టి పేసర్లు కూడా కీలకంగా మారే చాన్స్ ఉంది. వికెట్‌పై 7 మిల్లీమీటర్ల మేర గడ్డిని కత్తిరించారు. తొలి రోజు ఆకాశం మేఘావృతంగా ఉన్నా, వర్షం కురిసే అవకాశం 25 శాతం మాత్రమే. చివరి రెండు రోజులు మాత్రం వరుణుడు మ్యాచ్‌ను అడ్డుకునే అవకాశం లేకపోలేదు.

రోహిత్ ఏమైనా కుర్రాడా?



రోహిత్ టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతాడనే కథనాలపై మాజీ కోచ్ స్పందించాడు. అదే జరిగితే తానేమీ ఆశ్చర్యపోనని బదులిచ్చాడు. రోహిత్ కుర్రాడేమీ కాదని, చాలామంది యువ ఆటగాళ్లు చాన్స్‌ల కోసం వేచి చూస్తున్నారని గుర్తుచేశాడు. ఆసీస్‌తో సిరీస్ తర్వాత రోహిత్ నిర్ణయం తీసుకోవచ్చని, ఒకవేళ భారతజట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెళ్తే పరిస్థితి వేరేలా ఉంటుందని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు.

అవి పుకార్లు మాత్రమే

'డ్రెస్సింగ్ రూమ్‌లో పరిస్థితి బాగాలేదనే వార్తలు పూర్తి అవాస్తవం. అక్కడ మేం మాట్లాడుకునేది ఆటగాళ్ల ప్రదర్శన గురించి. ఇంకా టెస్టు మ్యాచ్‌లు ఎలా గెలవాలనే దానిపైనా చర్చిస్తాం. సీనియర్లు విరాట్, రోహిత్‌తో వ్యక్తిగతంగా నేను మాట్లాడలేదు. అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్, ఆటగాళ్ల మధ్య జరిగిన విషయాలు అక్కడి వరకే పరిమితం కావాలి. బయటకు రాకూడదు. నిజాయతీ కలిగిన వ్యక్తులు ఉన్నంతవరకు భారత క్రికెట్ భద్రంగానే ఉంటుంది'

-కోచ్ గౌతం గంభీర్

క్రీడా రత్నాలు

గుకేష్, మను





● నలుగురికి ఖేల్‌రత్న ● జ్యోతి, దీప్తికి అర్జున ● జాతీయ క్రీడా పురస్కారాల ప్రకటన

న్యూఢిల్లీ: చెస్ వరల్డ్ చాంపియన్ గుకేష్, డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌లను ప్రతిష్ఠాత్మక 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డులు వరించాయి. 2024కు సంబంధించిన క్రీడా పురస్కారాల జాబితాను క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసింది. అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్నకు నలుగురిని, అర్జున అవార్డుకు 32 మందిని ఎంపిక చేశారు. గుకేష్, మనుతోపాటు భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌లు కూడా ఖేల్‌రత్నకు ఎంపికయ్యారు. కాగా, తెలుగు అథ్లెట్లు జ్యోతి యర్రాజి, దీప్తి జీవాంజిలకు అర్జున దక్కాయి. ఈసారి అర్జునకు ఎంపికైన వారిలో 17 మంది పారా అథ్లెట్లు ఉండడం విశేషం. వీరిలో ఎక్కువ మంది పారిస్ పారాలింపిక్స్‌లో అదరగొట్టినవారే. ముగ్గురు కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. ఈ నెల 17న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఖేల్‌రత్న విజేతలకు జ్ఞాపికతోపాటు రూ. 25 లక్షలు, అర్జున అవార్డీలకు రూ. 15 లక్షలతోపాటు అర్జునుడి ప్రతిమను బహూకరించనున్నారు.


దీప్తి
జ్యోతి


హర్మన్


ప్రవీణ్

చెస్ చిన్నోడికి అనూహ్యంగా..

ఊహించని రీతిలో గుకేష్‌కు ఖేల్‌రత్న అవార్డు దక్కింది. 18 ఏళ్ల వయసులోనే చెస్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఆటగాడిగా గుకేష్ చరిత్ర సృష్టించాడు. ఇటీవలే జరిగిన పోరులో డిఫెండింగ్ చాంప్ డింగ్ లిరెన్‌ను ఓడించిన గుకేష్ చెస్ రారాజు కిరీటాన్ని అందుకొన్నాడు. చెస్ ఒలింపియాడ్‌లోనూ దేశానికి చారిత్రక స్వర్ణం అందించడంలోనూ గుకేష్ కీలకపాత్ర పోషించాడు.

పారిస్ స్టార్లకు పెద్దపీట

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా 22 ఏళ్ల మను భాకర్ రికార్డు సృష్టించింది. పారిస్ క్రీడల్లో 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో మను కాంస్య పతకాలు సొంతం చేసుకొంది. అయితే, కొద్ది రోజుల క్రితం బయటకు వచ్చిన జాబితాలో మను పేరు లేకపోవడం వివాదాస్పదమైంది. కానీ, ఆ తర్వాత మంత్రిత్వశాఖ జోక్యంతో అంతా సద్దుమణిగింది. కాగా, హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత పురుషుల హాకీ జట్టు విశ్వక్రీడల్లో వరుసగా రెండో కాంస్యం సాధించింది. పారిస్ పారాలింపిక్స్ హైజంప్ టీ-64 విభాగంలో ప్రవీణ్ స్వర్ణం కొల్లగొట్టగా.. 400 మీ. రేస్‌లో టీ20 విభాగంలో తెలంగాణ అమ్మాయి దీప్తి కాంస్యం అందుకొంది. ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌కు అర్హత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి రికార్డు నెలకొల్పింది. పారిస్ బరిలో నిలిచిన ఆమె సెమీస్‌కు అర్హత సాధించలేక పోయింది.

క్రీడా అవార్డుల జాబితా ఇదిగో..

మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న

గుకేష్ (చెస్)
మను భాకర్ (షూటింగ్)
హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
ప్రవీణ్ కుమార్ (పారా హైజంప్)

అర్జున

జ్యోతి యర్రాజి (అథ్లెటిక్స్)
అన్నూ రాణి (అథ్లెటిక్స్)
నీతూ (బాక్సింగ్)
సవీటి బోరా (బాక్సింగ్)
వంతిక అగర్వాల్ (చెస్)
సలీమా టెటె (హాకీ)
అభిషేక్ (హాకీ)
సంజయ్ (హాకీ)
జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
సుఖ్‌జీత్ సింగ్ (హాకీ)
స్వప్నిల్ సురేష్ కుశాలే (షూటింగ్)
సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్)
అభయ్ సింగ్ (స్క్వాష్)
సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్)
అమన్ (రెజ్లింగ్)
రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్)
ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్)
దీప్తి జీవాంజి (పారా అథ్లెటిక్స్)
అజీత్ సింగ్ (పారా అథ్లెటిక్స్)
సచిన్ సర్జేరావు ఖిలారా (పారా అథ్లెటిక్స్)
ధరమ్‌బిర్ (పారా అథ్లెటిక్స్)
ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్)
హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్)
సిమ్రన్ (పారా అథ్లెటిక్స్)
నవదీప్ (పారా అథ్లెటిక్స్)
నితేశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్)
తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్)
నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)
మనీషా రాందాస్ (పారా బ్యాడ్మింటన్)
కపిల్ పర్మార్ (పారా జూడో)
మోనా అగర్వాల్ (పారా షూటింగ్)
రుబీనా ఫ్రాన్సిస్ (పారా బ్యాడ్మింటన్)

అర్జున అవార్డులు (లైఫ్‌టైమ్)

సుచా సింగ్ (అథ్లెటిక్స్)
మురళీకాంత్ రాజారామ్ పెట్కర్ (పారా స్విమ్మింగ్)

ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు)

సుభాష్ రాణా (పారా షూటింగ్)
దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్)
సందీప్ సంగ్వాన్ (హాకీ)

రేవంత్‌రెడ్డి అభినందన


అర్జున అవార్డుకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ క్రీడాకారులు అత్యున్నత స్థాయిలో మరింత రాణించాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా దీప్తిని ప్రశంసించారు. ఇంకా వరంగల్ జిల్లాకు చెందిన దీప్తికి అర్జున అవార్డు దక్కడం ఎంతో సంతోషాన్నిచ్చిందని మంత్రి కొండా సురేఖ అన్నారు.

సిడ్నీలోనూ విఫలమైతే ఇక కష్టమే!

టెస్టులకు వీడ్కోలు తప్పదా?



న్యూఢిల్లీ: టెస్టుల నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్ కావడం ఇక లాంఛనమే ! అదే సమయంలో విరాట్ కోహ్లీ కూడా సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికే సమయం ఎంతో దూరం లేదని మాజీ ఆటగాళ్లు అభిప్రాయపడుతున్నారు. దారుణ వైఫల్యాలకు స్వస్తిపలికే మార్గాలను రోహిత్, విరాట్ కనుగొనలేకపోతుండడంతో.. వారిద్దరి వీడ్కోలుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని భారత జట్టు మాజీ ఆటగాడు అతుల్ వాసన్ బీసీసీఐకి సూచించడం ఆసక్తి రేపుతోంది. 36 ఏళ్ల కోహ్లీ సుదీర్ఘ కాలంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్నాడు. ఇప్పటికే టీ20లనుంచి రిటైర్మెంట్ తీసుకున్న విరాట్ టెస్ట్ కెరీర్ సైతం డోలాయమానంలో పడింది. ఈక్రమంలో విరాట్ వారసుడిని ఎంపిక చేయడంతోపాటు కోహ్లీకి ఘనమైన వీడ్కోలు ఇచ్చేలా చూడాలని వాసన్ అన్నాడు. ప్రస్తుత ఆస్ట్రేలియా పర్యటనలో ఆఫ్‌స్టంప్ ఆవలిగా వేసిన బంతులను వదిలేయడంలో విరాట్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. మెల్‌బోర్న్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కొంత సంయమనం పాటించినట్టు కనిపించింది. కానీ తర్వాత ఆ బలహీనతకు లొంగిపోయాడు. ఆరు, ఏడు స్టంపుల ఆవలిగా పడిన బంతులను వేటాడి మరీ బాక్సింగ్ డే టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వికెట్ సమర్పించుకున్నాడు. ఆస్ట్రేలియా పిచ్‌లకు తగినట్టుగా తాను ఆడలేకపోతున్నానని నాలుగో టెస్ట్‌కు ముందు కోహ్లీ కూడా అంగీకరించాడు. సిడ్నీ టెస్ట్‌లో కనుక విరాట్ భారీగా పరుగులు చేయకపోతే రెడ్‌బాల్ క్రికెట్‌లోనూ అతడి కెరీర్ ముగియడం ఖాయమేనన్నది క్రీడా పండితుల అభిప్రాయం.





గంభీర్ x రోహిత్

ఎడ మొహం..పెడ మొహం!

సిడ్నీ: సీనియర్ స్పిన్నర్ అశ్విన్ అనూహ్యంగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించేసి..ఒక్క క్షణం కూడా జట్టుతో ఉండకుండా స్వదేశానికి తిరిగి రావడం సంచలనం సృష్టించింది. అంతేకాదు..అశ్విన్ నిర్ణయం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం సుహృద్భావపూర్వకంగా లేదనే అనుమానాలను లేవనెత్తింది. ఆ అనుమానాలకు బలం చేకూర్చే ఘటన ఒకటి తాజాగా సిడ్నీలో చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో కోచ్ గంభీర్, పేసర్ బుమ్రా సిడ్నీ గ్రౌండ్ సెంటర్ పిచ్‌ను పరిశీలించేందుకు వచ్చారు. కొన్ని నిమిషాల తర్వాత కెప్టెన్ రోహిత్ కూడా వారివద్దకు వచ్చాడు. ఆ సమయంలో గంభీర్, రోహిత్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోకుండానే అక్కడనుంచి వెనుదిరిగారు. అనంతరం ప్రొటోకాల్ ప్రకారం రోహిత్ కాకుండా గంభీర్ విలేకరులతో మాట్లాడడం జట్టులో లుకలుకలకు బలం చేకూర్చినట్టయింది. కాగా..చివరి టెస్ట్ తుది జట్టులో కెప్టెన్ రోహిత్‌కు చోటుండదన్న వార్తలు బలంగా వస్తున్న నేపథ్యంలో..ఆ విషయమై విలేకరులు గంభీర్‌ను ప్రశ్నించారు. అయితే రోహిత్‌కు తుది 11 మందిలో స్థానం కచ్చితంగా ఉంటుందని మాత్రం కోచ్ చెప్పలేదు. పైగా..'పిచ్‌ను పరిశీలించాక తుది జట్టుపై నిర్ణయం తీసుకుంటాం' అని గౌతీ బదులివ్వడం రోహిత్‌పై వేటు ఖాయమన్న వార్తలకు మరింత ఊతం ఇచ్చింది. ఇంకా..'నిజాయతీ, మెరుగైన ప్రదర్శనే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండేందుకు అర్హత' అని గంభీర్ కుండబద్దలుగొట్టడం మరెన్నో ప్రశ్నలను రేకెత్తించింది. 'కెప్టెనే విలేకరుల సమావేశానికి హాజరు కావాలనేది సంప్రదాయం కాదు' అని గంభీర్ వ్యాఖ్యానించడంతో కెప్టెన్, కోచ్ మధ్య సంబంధాలు బెడిసి కొట్టాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హిట్‌మ్యాన్‌కు ఆ అపకీర్తి తప్పదా?

పేలవ ప్రదర్శనతో ఇప్పటికే ముప్పేట విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్‌కు మరో అపకీర్తి తప్పేలా లేదు. సిడ్నీ టెస్టుకు రోహిత్‌పై వేటు వేస్తారని వార్తలు వెల్లువెత్తుతున్నాయి. అవే నిజమైతే..కెప్టెన్‌గా ఉండి జట్టులో చోటు కోల్పోయిన తొలి భారత క్రికెటర్‌గా రోహిత్ అపఖ్యాతి మూటగట్టుకోనున్నాడు. రోహిత్ పరోక్షంలో..బుమ్రా సారథ్యంలో పెర్త్ తొలి టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఆ అంశంకూడా రోహిత్ తొలగింపునకు కారణం కానుందని చెప్పేవారూ ఉన్నారు. సిరీస్ మధ్యలో.. కెప్టెన్‌ను తొలగించిన లేదా వైదొలగిన ఉదంతాలు అంతర్జాతీయ క్రికెట్‌లో గతంలోనూ ఉన్నాయి. 2014లో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో మిస్బావుల్ హక్‌ను తొలగించి షాహిద్ అఫ్రీదికి నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. 2014 టీ20 వరల్డ్ కప్‌లో సెమీస్, ఫైనల్ సహా చివరి మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని చాందిమల్ నిర్ణయించుకోవడంతో..మలింగ సారథ్యాన్ని చేపట్టాడు. 1974 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ మైక్ డెన్నిస్ తుది 11 మంది నుంచి వైదొలగడంతో..జాన్ ఎడ్రిచ్ జట్టుకు కెప్టెన్సీ వహించాడు.

పోంజీ కుంభకోణంలో నలుగురు క్రికెటర్లకు సమన్లు!



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గుజరాత్ పోంజీ స్కీమ్ కుంభకోణంలో నలుగురు క్రికెటర్లను విచారణకు పిలవనున్నారు. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామని పెట్టుబడులు సేకరించిన బీజెడ్ గ్రూప్ ప్రజలను మోసం చేసింది. ఇందులో రూ. 450 కోట్ల లావాదేవీలకు సంబంధించి సీఐడీ విచారణ చేపట్టింది. ఈ కంపెనీలో గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, రాహుల్ తెవాటియా, సాయి సుదర్శన్, మోహిత్ శర్మలు కూడా పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. దీంతో అందుబాటులో ఉన్న క్రికెటర్లకు సమన్లు జారీ చేసి విచారిస్తామని సీఐడీ పేర్కొంది. గిల్ సుమారు రూ. 2 కోట్లు పెట్టుబడి పెట్టగా.. మిగిలిన వారు స్వల్ప మొత్తాల్లో డిపాజిట్ చేసినట్టు సమాచారం.

అశ్విన్ స్వార్థపరుడు

రిటైర్మెంట్‌పై కలినాన్ ఫైర్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో సిరీస్ మధ్యలో ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడాన్ని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు డారెల్ కలినాన్ తీవ్రంగా తప్పుబట్టాడు. అతడిది స్వార్థ, విద్వేషపూరిత నిర్ణయమని మండిపడ్డాడు. 'సిరీస్ మధ్యలో అశ్విన్ వీడ్కోలు ప్రకటించాల్సింది కాదు. అతడిది స్వార్థపూరిత నిర్ణయంగా అనిపిస్తోంది. చోటు దక్కకపోతే జట్టునే ఇబ్బందిపెట్టేలా విద్వేషపూరితంగా వ్యవహరిస్తాడా? ఒక్క వారం ఆగి.. సిడ్నీ టెస్ట్ తర్వాత గుడ్‌బై పలకాల్సిందని కలినాన్ అన్నాడు. ఆఖరి టెస్ట్‌లో టీమిండియా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పాడు.

అఫ్ఘానిస్థాన్ 157 ఆలౌట్

జింబాబ్వేతో రెండో టెస్ట్

బులవాయో: మొదటి టెస్ట్‌లో శతకాల మోత మోగించిన అఫ్ఘానిస్థాన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆ టెస్ట్‌లో డబుల్ సెంచరీలతో చెలరేగిన రహమత్ షా (19), కెప్టెన్ హష్మతుల్లా షాహిది (13), శతకంతో కదం తొక్కిన జజాయ్ (16) కనీసం 20 పరుగులు కూడా చేయలేకపోయారు. రషీద్ ఖాన్ (25) టాప్ స్కోరర్. దాంతో గురువారం ఆరంభమైన రెండో టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 157 పరుగులకే కుప్పకూలింది. సికిందర్ రజా, న్యూమన్ చెరో మూడు వికెట్లు, ముజరబానీ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన జింబాబ్వే ఆట ఆఖరికి వికెట్ నష్టపోకుండా ఆరు పరుగులు సాధించింది.

టీ20 కెప్టెన్సీ నుంచి వైదొలిగిన షంటో



ఢాకా: బంగ్లాదేశ్ టీ20 జట్టు కెప్టెన్సీ నుంచి నజ్ముల్ హొస్సేన్ షంటో వైదొలిగాడు. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ తర్వాత అతడీ నిర్ణయానికి వచ్చినట్టు బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) అధికారి పేర్కొన్నాడు. ఒకవేళ తను ఫిట్‌గా ఉంటే వన్డే, టెస్టులకు కెప్టెన్‌గా కొనసాగుతాడని చెప్పాడు. ప్రస్తుతానికి టీ20 జట్టు కెప్టెన్‌గా ఎవరినీ నియమించకపోయినా, రేసులో మెహదీ హసన్ మిరాజ్ ఉన్నట్టు సమాచారం.

కుశాల్ మెరుపు శతకం

శ్రీలంక ఓదార్పు విజయం



నెల్సన్ (న్యూజిలాండ్): కుశాల్ పెరీరా (46 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 101) మెరుపు బ్యాటింగ్‌తో న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి టీ20లో శ్రీలంక ఏడు పరుగులతో నెగ్గింది. పొట్టి ఫార్మాట్‌లో శ్రీలంక తరపున వేగవంతమైన సెంచరీ ఇది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఓదార్పు విజయం దక్కించుకుంది. తొలి రెండు టీ 20ల్లో గెలుపొందిన ఆతిథ్య జట్టు ఇప్పటికే సిరీస్‌ను సొంతం చేసుకున్న విషయం విదితమే. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 218/5 స్కోరు చేసింది. కుశాల్, కెప్టెన్ అసలంక (46) నాలుగో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. ఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 211/7 స్కోరుకే పరిమితమై ఓడింది. రచిన్ రవీంద్ర (69), టిమ్ రాబిన్సన్ (37) దూకుడైన ఆరంభం ఇవ్వగా, మిచెల్ (35), చివర్లో జకారీ ఫోక్స్ (21 నాటౌట్) పోరాడినా కివీస్‌కు ఓటమి తప్పలేదు. అసలంక మూడు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు.

అధికారం పోయాక బీసీలు గుర్తొచ్చారా?

» నా ప్రశ్నలకు జవాబు చెప్పి ధర్నా చేయండి

» ఎమ్మెల్సీ కవితకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సవాల్



హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీసీలను వంచించిందని, వారికి న్యాయంగా దక్కాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా నిట్టనిలువునా ముంచిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత కల్వకుంట్ల కుటుంబం బీసీలపై కపట ప్రేమ చూపుతూ మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీతోనే మేలు జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు మహేశ్‌గౌడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం కుంభకోణంలో మరక అంటించుకున్న ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్‌లో ప్రాధాన్యత తగ్గడంతో ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారని విమర్శించారు. రాజకీయంగా ఉనికి కాపాడుకోవడం కోసం ఇప్పుడు బీసీల పేరిట కవిత కపట నాటకం మొదలుపెట్టారని, దాంట్లో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద ధర్నా జరపాలని నిర్ణయించారన్నారు. బీసీలు ఈ కుట్రను గమనించి బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కవితకు మహేశ్ గౌడ్ పలు ప్రశ్నలు సంధించారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 23 నుండి 42 శాతానికి పెంచడం కోసం చర్యలు తీసుకొని, అందులో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నందుకు ధర్నా చేస్తున్నారా? స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు నిర్ధారించడానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో కమిటీని నియమించినందుకు ధర్నా చేస్తున్నారా? మీ బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమ బడ్జెట్‌ను రూ.2971.32 కోట్లకు పెంచినందుకు ధర్నా చేస్తున్నారా? గీత కార్మికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు, కాటమయ్య రక్షణ పథకాన్ని ప్రారంభించినందుకు ధర్నా చేస్తున్నారా? జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లోని వివిధ విభాగాల్లో 5,136 మంది ఉద్యోగులను నియమించినందుకు ధర్నా చేస్తున్నారా? అంటూ మహేశ్‌గౌడ్ నిలదీశారు.

మా నియామకం ఎప్పుడు?

» విద్యుత్ సౌధ వద్ద జెన్‌కో అభ్యర్థుల నిరసన

హైదరాబాద్, పంజాగుట్ట జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాం.. విద్యార్హత, ఇతర ధ్రువ పత్రాలు సమర్పించాం.. మూడు నెలలు అవుతోంది. ఉద్యోగం ఎప్పుడిస్తారు ? తక్షణమే పోస్టింగ్ ఇవ్వండి అని కోరుతూ జెన్‌కో అభ్యర్థులు నిరసన చేపట్టారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ముందు ప్లకార్డులు పట్టుకొని గురువారం నిరసన తెలిపారు. జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), 60 కెమిస్ట్ ఉద్యోగాల కోసం 2023 అక్టోబరులో నోటిఫికేషన్ వెలువడగా, 2024 జూలై 14న రాతపరీక్ష జరిగింది. సెప్టెంబరు 4న ఫలితాలు ప్రకటించి అదే నెల 18-21 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఎంపికైన అభ్యర్థుల ధ్రువ పత్రాలను కూడా తీసుకున్నారు. ఇదంతా జరిగి నెలలు గడుస్తున్నా పోస్టింగ్ ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లలో ఖాళీలున్నాయని, వెంటనే నియామక పత్రాలు అందించి తమకు పోస్టింగ్‌లు ఇవ్వాలని వారు కోరారు. తమ సమస్యపై జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియాను ఐదుసార్లు ,ఉప ముఖ్యమంత్రిని మూడుసార్లు కలిసినా ప్రయోజనం లేదని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు వదులుకొని వచ్చి నానావస్థలు పడుతున్నామని, తక్షణమే నియామక పత్రాలు అందించి తమను ఆదుకోవాలని పలువురు అభ్యర్థులు వేడుకున్నారు. తమ సమస్యను త్వరలో గవర్నర్ దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. కాగా, అభ్యర్థుల నిరసనతో విద్యుత్ సౌధ వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

'నేరెళ్ల' ఘటనపై కేసు నమోదైందా?

» నమోదైతే చార్జిషీట్ దాఖలు చేశారా?

» దర్యాప్తు ఏ దశలో ఉందో చెప్పండి

» బీఆర్ఎస్ సర్కారు హయాంలో 2017లో జరిగిన ఘటనపై హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక లారీలను తగలబెట్టారనే ఆరోపణలపై దళితులు, బీసీ యువకులను పోలీసులు నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇసుక లారీ ఢీకొని, ఓ వ్యక్తి మృతి చెందడంతో ఆగ్రహించిన స్థానికులు పలు ఇసుక లారీలను తగులబెట్టారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కొందరిని చిత్రహింసలకు గురిచేశారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ ఘటన జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ అప్పట్లో బాధితులను పరామర్శించి.. ఇసుక దందా, బీఆర్ఎస్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నేరెళ్ల ఘటనలో చిత్రహింసలకు గురైన బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, నిర్బంధ హింసకు పాల్పడిన పోలీసులపై కేసు నమోదుకు ఆదేశాలు ఇవ్వాలని మానవ హక్కుల సంఘం నాయకుడు గడ్డం లక్ష్మణ్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. నిర్బంధ హింస ఘటనపై కేసు నమోదైందా? నమోదైతే చార్జిషీట్ దాఖలు చేశారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫున హాజరైన ఏజీపీ స్పందిస్తూ.. ఈ కేసులో అడ్వొకేట్ జనరల్ (ఏజీ) అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారని, అప్పటి వరకు సమయం ఇవ్వాలని కోరారు. ఏజీపీ వద్ద సమాధానాలు లేకపోవడంతో అక్కడే ఉన్న అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదైందని.. పిటిషనర్లు కోరినట్లుగానే కేసు నమోదైనందున ఈ పిటిషన్లను విచారించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సంతృప్తి చెందని ధర్మాసనం.. రెండు వారాల్లో దర్యాప్తు ఏ దశలో ఉందో తెలియజేయాలని ఏపీజీకి ఆదేశాలు జారీచేసింది. స్థాయీ నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీచేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

'నార్త్ సిటీ మెట్రో' మార్గంలో.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు!

(మొదటిపేజీ తరువాయి)

కావాలని అప్పట్లో తేల్చారు. ఆ స్థలాలను ఇస్తే అందుకు బదులుగా 500 ఎకరాలు ఇస్తామని నాటి సర్కారు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కానీ, కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. రేవంత్ సర్కారు కూడా నిరుడు ఈ మార్గాల్లో రెండు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం రేవంత్ అల్వాల్‌లో, కండ్ల కోయ వద్ద శంకుస్థాపన కూడా చేశారు. హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు వెస్ట్ మారేడుపల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా 18.100 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను ఆరు లేన్లుగా రూ.2232 కోట్లతో నిర్మించేందుకు పాలన అనుమతులు వచ్చాయి. ఇక జాతీయ రహదారి 44లోని హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి సుచిత్ర సమీపంలో ఉన్న డైరీ ఫామ్ రోడ్డు వరకు గల 5.320 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను ఆరు లేన్లుగా రూ.1580 కోట్లతో నిర్మించేందుకు పాలన అనుమతులిచ్చారు. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణశాఖకు చెందిన 169.33ఎకరాలు కీలకంగా మారాయి. అందులో ఎయిర్‌పోర్టుకు చెందిన 23ఎకరాలు మినహా రక్షణశాఖకు చెందిన దాదాపు 126 ఎకరాల భూసేకరణ పూర్తయ్యింది. పదిరోజుల్లో పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఇటీవల హెచ్ఎండీఏ అధికారులు ప్రకటించారు. అయితే.. ఈ మార్గంలో తాజాగా.. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు 22కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లను మార్చాలని ప్రభుత్వం సూచించింది. ఈమేరకు హెచ్ఎండీఏ అధికారులు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించారు. అయితే హెచ్ఎండీఏ ప్రతిపాదించిన రెండు ఎలివేటెడ్ కారిడార్లలో ఎంత వరకూ ఫ్లైఓవర్ మార్గం వస్తుందో.. అందులోనే డబుల్ డెక్కర్ నిర్మాణానికి అధికారులు డిజైన్లు చేసినట్లు తెలిసింది. రెండు ఎలివేటెడ్ కారిడార్లకు రూ.3812కోట్ల వ్యయం కానుండగా.. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు నిర్మాణ వ్యయం మరింత పెరుగనుంది.



ఏ మార్గంలో ఎంతంటే..

హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు 18.1 కిలోమీటర్ల మేర ఆరులైన్లతో రోడ్డు విస్తరణ చేయనుండగా, ఇందులో 12.1 కిలోమీటర్లు మాత్రమే ఎలివేటెడ్ కారిడార్ రానుంది. ఈ 12.1 కిలోమీటర్ల మేర డబుల్ డెకర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేయనున్నారు. ఈ మార్గంలో పరేడ్ గ్రౌండ్ నుంచి హకీంపేట ఎయిర్‌పోర్టు వరకు ఫ్లైఓవర్ రానుండగా.. ఎయిర్‌పోర్టు వద్ద 450 మీటర్ల అండర్‌పాస్ రానుంది. ఆ తర్వాత శామీర్‌పేట వరకూ ఆరు కిలోమీటర్లకు పైగా రోడ్డు విస్తరణ మాత్రమే చేయనున్నారు. హకీంపేట ఎయిర్‌పోర్టు వద్ద ఎలివేటెడ్‌లో మెట్రో నిర్మాణానికి అనుమతులుంటాయా? లేదా? అనే అంశంపై రక్షణ శాఖ అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. హకీంపేట తర్వాత శామీర్‌పేట వరకూ ఎలివేటెడ్‌లోనే మెట్రో రానుంది. ఇక.. జాతీయ రహదారి 44లోని హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి సుచిత్ర సమీపంలో ఉన్న డైరీ ఫామ్ రోడ్డు వరకు 5.320 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ రానుండగా.. ఇందులో బేగంపేట ఎయిర్‌పోర్టు బాలంరాయ్ వద్దే దాదాపు 600 మీటర్ల మేర అండర్‌పాస్ రానుంది. ప్యారడైజ్ నుంచి ఫ్లైఓవర్ ప్రారంభమై ఎయిర్‌పోర్టు వద్ద అండర్‌పాస్‌లోకి వెళ్లి.. ఆ తర్వాత మళ్లీ ఫ్లైఓవర్ ప్రారంభమై డైరీ ఫామ్ రోడ్డు వరకు రానుంది. అయితే ఈ మార్గంలో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌ను హెచ్ఎండీఏ అధికారులు బేగంపేట ఎయిర్‌పోర్టు అండర్‌పాస్ దాటిన తర్వాత నిర్మించేలా డిజైన్ చేసినట్లు తెలిసింది. జేబీఎస్ నుంచి వచ్చే మెట్రో తాడ్‌బండ్ జంక్షన్‌కు చేరుకొని అక్కడి నుంచి హెచ్ఎండీఏ నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు కనెక్ట్ అయ్యే విధంగా డిజైన్ రూపొందించినట్టు సమాచారం. దాంతో సుచిత్ర సమీపంలోని డెయిరీ ఫామ్ రోడ్డు వరకు మాత్రమే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ (సుమారు నాలుగు కిలోమీటర్లు) రానుంది. అయితే ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ అధికారులు కొంపల్లి నుంచి కండ్లకోయ వరకు మూడు ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. కాబట్టి డైరీ ఫామ్ రోడ్డు తర్వాత సర్వీసు రోడ్డులో మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్‌లో నిర్మించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా.. డబుల్ డెకర్ ఫ్లైఓవర్ల పునాదులు, పిల్లర్లు, రోడ్డు మార్గాలను హెచ్ఎండీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్మించనున్నారు. ఆపై.. పిల్లర్లను కొంతమేర పెంచి మెట్రో మార్గాన్ని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అధికారులు చేపట్టనున్నారు. ఇక.. ఈ ఫ్లై ఓవర్ల వెడల్పు 27 మీటర్లుగా ఉండనుంది. రెండువైపులా రోడ్డు మార్గం 10.5 మీటర్ల చొప్పున ఉండగా.. క్రాష్ బారియర్లు 1 మీటర్ చొప్పున ఉండనున్నాయి. మధ్యలో నాలుగు మీటర్లలో.. మెట్రో పిల్లర్ ఉండనుంది.

భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చాక

నిర్మాణ అనుమతులా?

» అధికారులపై చర్యలు తీసుకోండి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కోసం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసిన తర్వాత ఆ పరిధిలోని భూముల్లో ఇంటి నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని హైకోర్టు ప్రశ్నించింది. అలాంటి అధికారులకు శిక్షపడాలని అభిప్రా యపడింది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి చెందిన రాళ్ల శ్రీనివాసాచారి ప్రాజెక్టు కింద పోతున్న తన భూమికి పరిహారం ఇప్పించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ.. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్థానిక అధికారుల అనుమతులు పొంది పిటిషనర్ నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. నోటిఫికేషన్ ఇచ్చిన భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించింది. సంబంధిత అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

నీటి పారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలపై కమిటీ

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు చేపట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించడానికి ఐదుగురు అధికారులతో ప్రభుత్వం కమిటీ వేసింది. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ అధ్యక్షతన ఉండే కమిటీలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీవిజయభాస్కర్‌రెడ్డి సభ్యులుగా.. మెంబర్ కన్వీనర్ ఈఎన్‌సీ(అడ్మిన్, జనరల్) అనిల్‌కుమార్ ఉండనున్నారు. ప్రధానంగా జోన్-5, జోన్-6 మధ్య సీనియారిటీ వివాదంతోపాటు అడ్‌హక్ పదోన్నతులకు ముగింపు పలికే బాధ్యతను ప్రభుత్వం ఈ కమిటీకి అప్పగించింది. ఈ మొత్తం వివాదాన్ని రెండు వారాల్లోగా తేల్చాలని సూచించింది.



బ్యాంకులకు

నిధుల కొరత

రూ.2 లక్షల కోట్లకుపైగా లోటు.. ఆదుకోవాలని ఆర్‌బీఐకి వినతి

న్యూఢిల్లీ: అందరికీ అప్పులిచ్చే బ్యాంకులే ఇప్పుడు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజం. ప్రస్తుతం ఈ కొరత రూ.2 లక్షల కోట్లకుపైగా ఉన్నట్టు సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి సంబంధించి 2024 డిసెంబరు 15 నాటికి కంపెనీలు, వ్యాపార సంస్థలు, వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు ముందస్తు పన్ను (అడ్వాన్స్ ట్యాక్స్) కింద రూ.3.15 లక్షల కోట్లు చెల్లించారు. దీనికి తోడు పండగల సీజన్ ఖర్చుల కోసం కంపెనీలు, వ్యక్తిగత వినియోగదారులు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలోనే నగదు వెనక్కి తీసుకున్నారు. ఇది చాలదన్నట్టు డాలర్‌తో రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద మొత్తంలో రూపాయలతో డాలర్లు కొనుగోలు చేసి.. మార్కెట్లో విడుదల చేయాల్సి వస్తోంది. ఈ మూడు కారణాలతో ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో రూ.2 లక్షల కోట్లకు పైగా నిధుల కొరత ఏర్పడిందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

పనిచేయని సీఆర్ఆర్ కోత: గత నెల (డిసెంబరు)లో ప్రకటించిన ద్రవ్య విధాన సమీక్షలో తమ డిపాజిట్లలో బ్యాంకులు తన వద్ద హామీగా ఉంచాల్సిన నగదు నిల్వల నిష్పత్తిని ఆర్‌బీఐ 4.5 శాతం నుంచి 4 శాతానికి కుదించింది. దీంతో గత నెల 28వ తేదీ నాటికి బ్యాంకులకు అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి వచ్చాయి. అయినా ప్రస్తుతం బ్యాంకులకు నిధుల కొరత తప్పడం లేదు. దీంతో స్వల్పకాలిక నిధుల సర్దుబాటు కోసం, బ్యాంకుల మధ్య జరిగే ఓవర్‌నైట్ కాల్ మనీ వడ్డీ రేటు గత నాలుగేళ్లలో ఎన్నడూ లేని విధంగా 6.34 శాతానికి చేరింది.

ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు బ్యాంకులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎక్కువ వడ్డీ చెల్లిస్తాం, మా బ్యాంకులో డిపాజిట్ చేయండని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి. అయితే ఐపీఓ మార్కెట్ బూమ్‌తో ఆ ప్రయత్నాలేవీ పెద్దగా ఫలించడం లేదు. దీంతో మా దగ్గర ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలు తీసుకుని,

ఆదుకోండి ప్లీజ్..

అందుకు సమానమైన రూపాయలు ఇవ్వమని ఆర్‌బీఐని కోరినట్టు సమాచారం. దీంతో డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకోవడంతో పాటు ఆర్‌బీఐ ఫారెక్స్ నిల్వలూ పెరుగుతాయని చెబుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై ఆర్‌బీఐ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ఉలుకూ పలుకూ లేక పోవడం బ్యాంకులను గాభరా పెడుతోంది. దీంతో ప్రస్తుత నిధుల కొరతను ఎలా అధిగమించాలో పాలుపోవడం లేదని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

కాకినాడ యూనిట్-3లో ఉత్పత్తి షురూ: దివీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్ కాకినాడ సమీపంలోని ఒంటిమామిడి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన యూనిట్-3లో ఉత్పత్తి ప్రారంభించినట్లు దివీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. ఈ నెల 1న ఈ ప్రాజెక్టులో తొలి దశ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపింది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్స్ ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) ఉత్పత్తి కోసం కంపెనీ మూడు దశల్లో 500 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు అమలు చేస్తోంది. ఇందులో ఇప్పటికే 200 ఎకరాల్లో తొలి దశను పూర్తి చేసింది. ఈ కొత్త ప్రాజెక్టు కోసం కంపెనీ రూ.1,200 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకు ఖర్చు చేయనుంది.

రిలయన్స్ జియో రూ.40,000 కోట్ల ఐపీఓ!

రూ.10 లక్షల కోట్లకు కంపెనీ మార్కెట్ విలువ



న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. తన టెలికాం సేవల అనుబంధ విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌ను మెగా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఏడాది ద్వితీయార్ధంలో కంపెనీ ఐపీఓకు రావచ్చని, తద్వారా రూ.35,000-40,000 కోట్లు సమీకరించే అవకాశం ఉందని సమాచారం. అనగా, దేశీయ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ కానుంది. ఐపీఓలో భాగంగా రిలయన్స్ జియో మార్కెట్ విలువను రూ.10 లక్షల కోట్ల స్థాయిలో లెక్కించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పలు బ్రోకరేజీ సంస్థలు ఇప్పటికే జియో విలువను రూ.8.5 లక్షల కోట్ల స్థాయిలో అంచనా వేశాయి. ఐపీఓలో భాగంగా జియో తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులకు చెందిన ఈక్విటీ వాటాను సైతం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించే అవకాశం ఉంది. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ఆలోచన కూడా ఉన్నట్లు, ఇందుకోసం ప్రాథమిక చర్చలు కూడా ప్రారంభమైనట్లు సమాచారం. ఒకవేళ ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సమీకరిస్తే, ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ ప్రస్తుత అంచనా కంటే తగ్గవచ్చు. ఆర్ఐఎల్ డిజిటల్ సేవల అనుబంధ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్‌లో భాగంగా రిలయన్స్ జియో ఉంది. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), సిల్వర్ లేక్, కేకేఆర్, ముబాదల వంటి అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలకు జియోలో వాటాల విక్రయం ద్వారా అంబానీ 2020లో 1,800 కోట్ల డాలర్లు సమీకరించారు. ప్రస్తుతం జియోలో 33 శాతం వాటా విదేశీ ఇన్వెస్టర్ల చేతుల్లో ఉంది.

ఇండో ఫార్మ్ ఐపీఓకు 227 రెట్ల బిడ్లు

ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ రూ.260 కోట్ల ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. గురువారంతో ముగిసిన ఈ పబ్లిక్ ఇష్యూకు ఏకంగా 227.57 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. ఐపీఓలో భాగంగా కంపెనీ 84.70 లక్షల షేర్లను విక్రయానికి పెట్టగా.. ఇన్వెస్టర్ల నుంచి 192.75 కోట్లకు పైగా షేర్ల కొనుగోలుకు బిడ్లు వచ్చాయి. గడిచిన 11 నెలల్లో అత్యధిక రెట్ల సబ్‌స్క్రిప్షన్ సాధించిన ఐపీఓ ఇదే. 2024 ఫిబ్రవరిలో విభోర్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓ 320 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కాగా, కోల్‌కతాకు చెందిన ఆగ్రో కంపెనీ రీగాల్ రిసోర్సెస్ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.190 కోట్ల తాజా ఈక్విటీతో పాటు ప్రమోటర్‌కు చెందిన 90 లక్షల షేర్లను సైతం విక్రయించాలనుకుంటోంది.

కేతన్ పరేఖ్ మరో స్కామ్

» ఫ్రంట్ రన్నింగ్ స్కీమ్ ద్వారా రూ.65.77 కోట్ల అక్రమార్జన

» ఆయనతో సహా ముగ్గురిపై నిషేధం విధించిన సెబీ



న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో భారీ అక్రమాలకు పాల్పడిన వ్యక్తుల్లో ప్రముఖంగా వినిపించే పేర్లు హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్. డాట్ కామ్ బూమ్ (1999-2000) సమయంలో మార్కెట్‌ను శాసించిన కేతన్ పరేఖ్.. పలు ఆర్థిక మోసాలకు పాల్పడి జైలుకెళ్లడంతో పాటు సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి 14 ఏళ్ల పాటు నిషేధించబడ్డారు. అయినా, ఆయన తీరు మారలేదు. ఈ మార్కెట్ మాయావి మరో కుంభకోణం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫ్రంట్ రన్నింగ్ స్కీమ్ ద్వారా రూ.65.77 కోట్లు అక్రమంగా ఆర్జించిన కేసులో కేతన్ పరేఖ్ సహా ముగ్గురు వ్యక్తులను సెబీ తక్షణమే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించింది. సింగపూర్‌కు చెందిన ట్రేడర్ రోహిత్ సాల్‌గావ్‌కర్, అశోక్ కుమార్ పొద్దార్ కూడా ఈ నిషేధిత జాబితాలో ఉన్నారు. అలాగే, ఈ ముగ్గురు ఇకపై ఏ మార్కెట్ ఇంటర్మీడియేటరీ సంస్థతో ప్రత్యక్షం లేదా ప్రత్యక్షంగా అనుబంధం కాకుండా నిషేధించింది. అంతేకాదు, తాజా స్కామ్‌లో అక్రమంగా ఆర్జించిన మొత్తం సొమ్మును కక్కాలని పరేఖ్ సహా 22 సంస్థలు, వ్యక్తులను ఆదేశిస్తూ సెబీ షోకాజు నోటీసులు జారీ చేసింది. వీరి బ్యాంక్ ఖాతాలను ఇప్పటికే జప్తు చేసింది. ఏదైనా బడా పెట్టుబడి సంస్థ ఏ కంపెనీలో పెట్టుబడులు పెట్టబోతున్నారనే సమాచారాన్ని బ్రోకర్ లేదా ఎవరైనా మార్కెట్ అనలిస్ట్ ద్వారా ముందస్తుగా తెలుసుకుని, ఆ కంపెనీ షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అయాచితంగా లబ్ధి పొందడాన్నే ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలుగా పిలుస్తారు. కేతన్ పరేఖ్ కూడా ఇదే వ్యవహారానికి పాల్పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 2.5 లక్షల కోట్ల డాలర్ల విలువైన పెట్టుబడులను నిర్వహిస్తోన్న ఓ అమెరికన్ ఎఫ్‌పీఐ (ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్).. భారత కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలుసుకుని వాటిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అక్రమంగా లబ్ధిపొందారు. ఈ ఎఫ్‌పీఐతో సత్సంబంధాలున్న రోహిత్ సాల్‌గావ్‌కర్ ద్వారా పెట్టుబడుల సమాచారాన్ని తెలుసుకుని, పరేఖ్ ఇతరుల ద్వారా ట్రేడింగ్‌కు పాల్పడినట్లు.. 2021 జనవరి నుంచి 2023 జూన్ వరకు ఈ తతంగం నడిచినట్లు సెబీ గుర్తించింది.



హ్యుండయ్ క్రెటా ఈవీ

దక్షిణ కొరియా ఆటో దిగ్గజం హ్యుండయ్.. భారత మార్కెట్లోకి క్రెటా ఎలక్ట్రిక్ వెర్షన్‌ను ఆవిష్కరించింది. ఈ నెల 17న ప్రారంభం కానున్న భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో క్రెటా ఈవీని అధికారికంగా విడుదల చేయనుంది. కంపెనీ ఇప్పటికే భారత్‌లో హ్యుండయ్ కోనా, ఐయోనిక్ 5 కార్లను విక్రయిస్తోంది. 51.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన క్రెటా ఈవీ ఒకసారి చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు, 42 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు 390 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది. ఈ కారు ధర రూ.20 నుంచి రూ.30 లక్షల మధ్యన ఉండొచ్చని అంచనా.

హైదరాబాద్‌లో సియారా జీఐసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన సియారా.. హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ (జీఐసీ)ను ప్రారంభించింది. టెలికాం, ఈ-కామర్స్ సహా పలు కంపెనీల వినియోగదారులకు అవసరమైన వాయిస్, వీడియో, డిజిటల్, చాట్‌బాట్ సేవలను సియారా అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీ ఏడు సెంటర్లను నిర్వహిస్తోందని సియారా సీఈఓ రిషి రానా తెలిపారు. హైదరాబాద్ కేంద్రం ఇన్నోవేషన్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌కు హబ్‌గా ఉండనుందని తెలిపారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఏఐ, జెన్ఏఐలో నైపుణ్యం కలిగిన 50కి పైగా నిపుణులు పనిచేస్తున్నారన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి మరో 50మంది, సంవత్సరాంతం నాటికి మరో 100 మంది నిపుణులను నియమించుకోనున్నట్లు తెలిపారు.

బిజినెస్

కొనుగోళ్ల కిక్

» సెన్సెక్స్ 1,436 పాయింట్లు అప్

» 24,000 ఎగువకి నిఫ్టీ

ముంబై: దలాల్‌స్ట్రీట్‌లో బుల్ కొత్త ఏడాది వేడుక వరుసగా రెండో రోజూ కొనసాగింది. కొనుగోళ్ల 'కిక్'తో సెన్సెక్స్ రెండు వారాల గరిష్ఠానికి ఎగబాకింది. గురువారం ట్రేడింగ్‌లో సూచీ ఏకంగా 1,436.30 పాయింట్లు (1.83 శాతం) పెరిగి 79,943.71 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌కు గడిచిన నెల రోజులకు పైగా కాలంలో ఇదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. ఆఖరి అర గంటలో సూచీ 1,525 పాయింట్ల వృద్ధితో మళ్లీ 80,000 మైలురాయిని దాటినప్పటికీ, చివరి వరకు ఆ స్థాయిని నిలబెట్టుకోలేకపోయింది. నిఫ్టీ విషయానికొస్తే, 445.75 పాయింట్ల (1.88 శాతం) లాభంతో 24,188.65 వద్దకు చేరుకుంది. 2025సంవత్సరం తొలి ట్రేడింగ్ సెషన్ (బుధవారం)లోనూ సెన్సెక్స్ 368 పాయింట్లు, నిఫ్టీ 98 పాయింట్లు బలపడ్డాయి. ఈ రెండు రోజుల్లో స్టాక్ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.8.52 లక్షల కోట్లు వృద్ధి చెంది మొత్తం రూ.450.47 లక్షల కోట్లకు చేరింది.

ఆగని రూపాయి పతనం

భారత కరెన్సీ వరుసగా 8వ రోజూ పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ గురువారం మరో 9 పైసలు క్షీణించి రూ.85.73 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	550
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	563	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	108
వరంగల్	101	గుంటూరు	108
కరీంనగర్	101	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	88
కర్నూలు	101	నెల్లూరు	92
విశాఖపట్నం	97	అనంతపురం	92
గోదావరి	108		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,330 ▲	71,800 ▲	98,000 ▼
విజయవాడ	79,500 ▲	75,000 ▲	89,500 ▼
విశాఖపట్నం	77,610 ▲	71,140 ▲	88,930 ▲
రాజమండ్రి	78,330 ▲	71,800 ▲	89,500 ▲
ప్రొద్దుటూరు	78,800 ▲	72,920 ▲	89,500 ▲
ముంబై	77,079 ▲	70,604 ▲	87,167 ▲

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా
సావిత్రిబాయి పూలే జయంతి

- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఉత్తర్వులు జారీ
- సావిత్రిబాయి ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని (జనవరి 3వ తేదీ) మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు తమ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. భారతీయ సమాజంలో గొప్ప మార్పులకు సావిత్రీబాయి పూలే పునాది వేశారని, మహిళా విద్యకు ప్రాధాన్యం కల్పించారని, అణచివేతకు గురైన వర్గాలకు న్యాయం అందించేందుకు జీవితాన్ని అర్పించారని కొనియాడారు. లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. సావిత్రీబాయి ఆశయాల సాధనకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సీఎం తెలిపారు. ఆడబిడ్డలకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు వీలుగా వారిలో నైపుణ్యాల వృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసమే రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి సర్వేను పూర్తి చేశామన్నారు. మహిళలను విద్యావంతులను చేయడానికి సావిత్రిబాయి పూలె ఎంతో శ్రమించారని, ఆమె త్యాగానికి, కృషికి గుర్తింపుగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళా టీచర్లు సావిత్రి బాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ఏటా ఘనంగా జరుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

'డబుల్ డెక్కర్' బస్సులో నుమాయిష్ వీక్షణం

- ఎగ్జిబిషన్‌ను చూసేందుకు ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు
- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సందర్శకులను అలరించేందుకు అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సిద్ధమైంది. హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈసారి ఎగ్జిబిషన్‌ను చుట్టి వచ్చేందుకు అద్దాలతో కూడిన డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. అమెరికా, బ్రిటన్‌లో మాదిరిగా సందర్శకులు వీటిలో ఎగ్జిబిషన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చిన్న రైలుతో పాటు డబుల్ డెక్కర్ బస్సులు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నుమాయిష్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రదర్శన ఏటా జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతుంది. ఈసారి మాత్రం జనవరి 3 నుంచి మొదలుకానుంది. ప్రవేశ రుసుమును రూ.10 పెంచి.. రూ.50 చేశారు. కాగా, ఏటా 25 లక్షల మంది నుమాయిష్‌ను సందర్శిస్తుంటారు. సుమారు 2 వేల స్టాళ్లతో కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌కు జిల్లాలు, ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తుంటారు. కాగా, ఎగ్జిబిషన్ ద్వారా గత సంవత్సరం జీఎస్టీ రూ.9.66 కోట్లు వసూలైంది. పదివేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. మొత్తం 26 ఎకరాలలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్ తెలిపారు. సందర్శకుల భద్రతకు చర్యలు చేపడుతున్నామని కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి చెప్పారు. 100 సీసీ కెమెరాలు, వాచ్ టవర్లతో నిఘా ఉంచుతామన్నారు.

ఎన్‌సీడీ క్లినిక్‌లకు బీపీ, మధుమేహం రోగులు

- అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రక్తపోటు, మధుమేహం రోగులను ఇక నుంచి ప్రభుత్వ దవాఖానాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) క్లినిక్‌లకు సిఫారసు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అసంక్రమిత వ్యాధుల అంశంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 30 ఏళ్లు పైబడిన 1.66 కోట్ల మందిని పరీక్షించగా 22.94 లక్షల మంది రక్తపోటు, 11.9 లక్షల మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు గుర్తించామని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్‌సీడీ సర్వే కొనసాగించాలని, ఆయా రోగులను ఎన్‌సీడీ క్లినిక్‌లకు అనుసంధానం చెయ్యాలని ఆదేశించారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా రోగుల జాబితాను తయారు చేయడమే కాక, రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని పేర్కొన్నారు.

ప్రారంభమైన టెట్ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం పేపర్-2 సోషల్ విభాగంలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జనగాం, జగిత్యాల, గద్వాల జిల్లాల అభ్యర్థులకు జరిగాయి. మధ్యాహ్నం కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కొమరంభీం, వికారాబాద్ జిల్లాల అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. గతంతో పోలిస్తే ఇంగ్లిష్ పరీక్ష కాస్త కఠినంగా ఉండగా.. సోషల్ పరీక్ష ప్రశ్నలు సులభంగా ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు. పరీక్ష కేంద్రాలు ఇతర జిల్లాల్లో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

టీజీసెట్- 2024 ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల జారీ

హైదరాబాద్ సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గతేడాది ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) నిర్వహించిన టీజీసెట్-2024లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ కొందరు అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఓయూలోని టీజీసెట్ కార్యాలయంలో పనిదినాలలో ఉదయం 10.30 గం.ల నుంచి సాయంత్రం 5 గం.ల వరకు సర్టిఫికెట్లు జారీ చేస్తామని, అభ్యర్థులే వ్యక్తిగతంగా కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని అధికారులు చెప్పారు.

ఎంబీఏ ప్రవేశాలకు హెచ్‌సీయూ నోటిఫికేషన్

మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) కోర్సుల్లో ప్రవేశాల కోసం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) నోటిఫికేషన్ జారీ చేసింది. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో 2025-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ కోర్సుల ప్రవేశాలకు ఈ నోటిఫికేషన్ ఇచ్చింది. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2025లో స్కోరు సాధించిన అభ్యర్థులే ఈ ప్రవేశాలకు అర్హులు. ఇతర వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

9 ఉమ్మడి జిల్లాల్లో ఏకసభ్య కమిషన్ విచారణ పూర్తి

- త్వరలో సమగ్ర నివేదిక: డాక్టర్ షమీమ్ అక్తర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని వర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై గురువారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయంలో బహిరంగ విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, వివిధ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఉమ్మడి నిజామాబాద్‌ను కలుపుకొని 9 జిల్లాల్లో తన పర్యటన పూర్తయిందన్నారు. అందరి అభిప్రాయాలను సేకరించిన మీదట ప్రభుత్వానికి కమిషన్ సమగ్ర నివేదికను సమర్పిస్తుందని తెలిపారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం సీరియస్

- వారి స్థానంలో కొత్తవారిని నియమించే యోచన!

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గత 24 రోజులుగా విధులకు హాజరుకాకుండా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం గానీ, విద్యాశాఖలో విలీనంచేయటం గానీ కుదరదని, న్యాయపరంగా ఈ డిమాండ్ సాధ్యంకాదనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. గతంలో 11 నెలలకోసారి సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను పునరుద్ధరించేవారని, ఈ సారి ఆ అవకాశంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విధులకు హాజరు కాకుండా సమ్మె చేస్తున్న వారి స్థానంలో కొత్త వారిని నియమించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

ఆంక్షల్లేని భరోసా!

(మొదటిపేజీ తరువాయి)

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. సంక్రాంతి నుంచి అంటే.. ఈనెల 14వ తేదీ నుంచి యాసంగి రైతుభరోసా పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆ రోజు నుంచి నెలరోజుల పాటు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం తాలూకు డబ్బులు పడతాయి. ధరణి రికార్డుల ప్రకారం రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల సాగు భూమి ఉంది. గత ప్రభుత్వం ప్రతి సీజన్ (వానాకాలం, యాసంగి)లో కూడా కోటిన్నర ఎకరాలకు రైతుబంధు పంపిణీ చేసింది. ఎకరానికి రూ. 5 వేల చొప్పున గత ప్రభుత్వం చెల్లించగా... ఈ ప్రభుత్వం ఎకరానికి రూ. 7,500 చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు నిధులు దుర్వినియోగమయ్యాయని, సాగుచేయని భూములు, రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు, స్థిరాస్తి వెంచర్లు చేసిన భూములకు కూడా రైతుబంధు చెల్లించటంతో ప్రజాధనం దుర్వినియోగమైందనే విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఈ లెక్కలు కూడా వెల్లడించింది. పంటలు సాగుచేయని భూములకు గత ప్రభుత్వం రూ. 21,284 కోట్లు చెల్లించిందని అసెంబ్లీలో ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది. రైతుభరోసా పథకానికి మార్గదర్శకాలు కొత్తగా రూపొందించాలని భావించిన ప్రభుత్వం... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేసింది. ఉమ్మడి జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించి, ప్రజాభిప్రాయాలను సేకరించింది. తాజాగా డిసెంబరు 29న ఉపసంఘం సభ్యులు సమావేశమై ఎవరికి ఇవ్వాలి? ఎవరికి ఇవ్వొద్దు? అని అంశాలతోపాటు క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ప్రజల అభిప్రాయాలపై చర్చించారు. వ్యవసాయ భూముల జాబితాలో ఉన్నప్పటికీ... పంటలు సాగుచేయకపోతే రైతుభరోసా ఇవ్వొద్దని, పంటలు సాగుచేస్తే మాత్రం రైతు భరోసా ఇవ్వాల్సిందనే ఆలోచనకు ఉపసంఘం సభ్యులు వచ్చారు. అయితే



ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులకు కూడా ఇవ్వాలా? వద్దా? పీఎం- కిసాన్ నిబంధనలను ఏమేరకు పరిగణనలోకి తీసుకోవాలి? అనే అంశాలపై గురువారం నిర్వహించిన ఉపసంఘం సమావేశంలో చర్చించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, చైర్మన్లు.. తదితర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు (జీతాలు పొందేవారు, పెన్షనర్లు), ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులకు పీఎం- కిసాన్ పథకంలో పెట్టుబడి సాయం అందటంలేదు. తొలుత ఈవర్గాలకు రైతుభరోసా ఇవ్వొద్దనే ఆలోచన చేసినప్పటికీ.. క్షేత్రస్థాయి నుంచి వస్తున్న అభిప్రాయాలను సేకరించిన తర్వాత... ఈ కేటగిరీల్లో ఉన్నవారికి కూడా పెట్టుబడి సాయం ఇవ్వాలని గురువారం నిర్వహించిన భేటీలో చర్చించి కేబినెట్‌కు సిఫారసు చేశారు. రాష్ట్ర మంత్రి వర్గం కూడా ఆమోదిస్తే... పంటలు సాగుచేయని భూములకు తప్ప... మరే ఇతర షరతులు ఉండవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ధరణి లెక్కల ప్రకారం రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల సాగు భూమి ఉంది. వానాకాలం సీజన్‌లో గరిష్ఠంగా 130 లక్షల(1 కోటి 30 లక్షల) ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. అంటే 20 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయటంలేదు. ఈ లెక్క ప్రకారం చూస్తే... 20 లక్షల ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా లేనట్లు, కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు, స్థిరాస్తి వెంచర్ల జాబితాల్లో ఈ భూమి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

బ్రాండ్‌గా తెలంగాణ!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి అందరూ సమానమేనని, ఎట్టి పరిస్థితుల్లో న్యాయం ఏ ఒక్కరికీ చుట్టంగా వ్యవహరించకూడదని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన వివిధ శాఖల ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలతో పాటు ప్రభుత్వంపై ప్రజలకు ఒక భరోసా కల్పించేందుకు అవలంబించాల్సిన విధానాలను వివరించారు. "ట్రాఫిక్ నియంత్రణ నుంచి మహిళల రక్షణ, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, డ్రగ్స్, గంజాయిని అరికట్టే అంశం వరకూ ప్రతీ విషయంలో తెలంగాణ ఒక బ్రాండ్‌గా మారాలి. అందుకోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. ఇతర రాష్ట్రాలు కూడా ఏదైనా అంశంపై అధ్యయనం చేయాలంటే రాష్ట్రంవైపు చూడాలి. ఆ విధంగా రాష్ట్రాన్ని ఒక బ్రాండ్‌గా తయారు చేద్దాం" అని సీఎం రేవంత్ రెడ్డి పలు శాఖల ఉన్నతాధికారులకు నిర్దేశించారు. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధిలో శాంతిభద్రతల విభాగానిదే కీలకపాత్ర అని, ఈ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి కట్టడికి మరింత పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, తెలంగాణను గంజాయి లేని రాష్ట్రంగా మార్చాలని తేల్చి చెప్పారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని, ఇప్పటికే అందుబాటులో ఉన్న 'షీ టీమ్'లను మరింత పటిష్ఠం చేయాలని చెప్పారు. మహిళలకు ప్రభుత్వంపై ఒక భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.



ట్రాఫిక్ నియంత్రణకు అత్యాధునిక టెక్నాలజీ

రాష్ట్రంతోపాటు ప్రధానంగా రాజధాని హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. దీనికి సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రస్తుతం అవలంబిస్తున్న విధానాలతోపాటు టెక్నాలజీని మరింతగా వినియోగించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఇకపై ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో విధానాలపై చర్చించకూడదని, ఈ విషయంలో రాష్ట్రానికే ప్రత్యేక విధానం ఉండాలని వివరించారు. "ఇందుకు డ్రోన్ టెక్నాలజీని వాడుకోవాలి. ఏ కూడలిలో ఎన్ని వాహనాలు ఉన్నాయి? అవి వెళ్లేందుకు ఎంత సమయం పడుతుందనే అంశాన్ని బేరీజు వేసి సిగ్నల్స్ ఇచ్చే సెన్సర్లతో కూడిన డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చే విషయంపై దృష్టి సారించాలి. తద్వారా ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ వేగంగా కదిలేందుకు అవకాశం ఉంటుంది" అని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పెద్ద పెద్ద కమ్యూనిటీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్న ప్రాంతాల నుంచి ఉదయం, సాయంత్రం వచ్చి, వెళ్లే వాహనాలు, అవి ఒకేసారి బయటకు రావడంతో కలిగే ట్రాఫిక్ అంతరాయాల గురించి ప్రస్తావించినట్లు సమాచారం.

వాన నీటిని ఒడిసిపట్టాలి

హైదరాబాద్ మహా నగరంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఆయన కన్హా శాంతివనాన్ని సందర్శించినప్పుడు అక్కడ ఉన్న 'రెయిన్ ఫారెస్ట్' (వర్షపు నీటిని ఒడిసిపట్టే) విధానాన్ని వివరించినట్లు తెలిసింది. ఆ విధంగానే వర్షపు నీటిని ఒడిసిపట్టాలని జీహెచ్ఎంసీ, మునిసిపల్ శాఖ అధికారులకు సూచించారు. నగరంలోని రాజ్‌భవన్ రోడ్డులో, ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న రెండు భూగర్భ వర్షపు నీటి ట్యాంకుల విషయాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. నీటి విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని సూచించినట్లు తెలిసింది. వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌వాసులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ శాఖ, హైదరాబాద్ వాటర్ బోర్డు, మెట్రో వ్యవస్థలన్నీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం హైడ్రాతోపాటు ఈ శాఖలన్నీ ఒకే గొడుగు కింద ఉండి పని చేయాలన్నారు.

భూభారతి అమలు బాధ్యత
రెవెన్యూ అధికారులదే

- వ్యవస్థలో స్పష్టమైన మార్పునకు కృషి
- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన
- రెవెన్యూ సంఘాల డైరీల ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): నూతనంగా రూపొందించిన భూభారతి-2024 చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ ఉద్యోగులపైనే ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. భూభారతి రాకతో రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కొత్త విధానంతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భరోసా ఇచ్చారు. సచివాలయంలో గురువారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ సంఘం(ట్రెసా), తెలంగాణ తహసీల్దార్ల సంఘం(టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ సంఘాల(టీజీఆర్ఎస్ఏ) నూతన డైరీలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల ఐకాస చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి భూభారతి చట్టంలోని ప్రధాన అంశాలపై సీఎంతో చర్చించారు. భూభారతి ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతాయని ఆయనకు వివరించారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతిపాదించిన తహసీల్దార్ల బదిలీలను చేపట్టాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని లచ్చిరెడ్డి తెలిపారు. ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు వంగారవీందర్ రెడ్డి, గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇక నుంచి రెవెన్యూ వ్యవస్థలో స్పష్టమైన మార్పు కనిపిస్తుందని సీఎం చెప్పారన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని సీఎంను కోరామని తెలిపారు.

ఆర్ఆర్ఆర్ పరిహారంపై కసరత్తు

గరిష్ఠ స్థాయిలో అందించడంపై నజర్

త్వరలో ధరలను ఖరారు చేయాలని నిర్ణయం

హైదరాబాద్, జనవరి2(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం రహదారి నిర్మాణంలో భూ పరిహారంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ధరలను పెంచి అందించేందుకు ఆర్బిట్రేషన్ విధానాన్ని అవలంబించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఆర్బిట్రేషన్ అంటే రోడ్డు నిర్మాణమయ్యే జిల్లాల పరిధిలోని కలెక్టర్లు అక్కడి భూములకు పరిహారం పెంచే విషయంలో ఒక నిర్ణయం తీసుకుని, అదే విషయాన్ని ప్రభుత్వానికి, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)కు తెలియజేస్తారు. ప్రభుత్వం కూడా రైతులకు నష్టం లేకుండా ఉండేలా భూ విలువల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని నిర్ణయించింది. అంతేకాకుండా భూ పరిహారం కింద ధరలను పెంచి, అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించింది. రీజినల్ రింగు రోడ్డు ఉత్తరభాగం రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు అందించే పరిహారం ధరల అంశంపై ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గతంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన విధంగా రైతులకు గరిష్ఠ పరిహారం అందించేందుకు ఉన్న అవకాశాలపై ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. త్వరలోనే ధరలను ఖరారుచేయాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ రహదారి కోసం సేకరించే భూముల వివరాలను తెలుపుతూ 3డీ నోటిఫికేషన్‌ను గతంలోనే జారీ చేసింది. 3డీ అంటే రహదారి నిర్మాణం కోసం సేకరిస్తున్న భూములు ఎవరివి, ఎంత సేకరిస్తున్నామనే వివరాలను ప్రకటించడం. ఇప్పుడు ప్రభుత్వం పరిహారం ధరలను ఖరారు చేయగానే.. 3జీ అవార్డు నోటిఫికేషన్‌ను ప్రకటించనున్నారు. 3జీ అంటే రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించే పరిహారాన్ని ఖరారు చేయడం. ఖరారు చేసిన వివరాలను ప్రకటించడం.

పరిహారం పెంపు అంశం తేలితే చాలు

ఆర్ఆర్ఆర్ మంజూరై, భూ సేకరణకు వెళ్లేనాటికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువల ప్రకారం భూముల ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వం 2021లో ఒకసారి భూముల విలువలను సవరించింది. ఆ తరువాత మళ్లీ చేయకపోవడంతో పాత ధరలే అమల్లో ఉన్నాయి. దాంతో ఉత్తరభాగం రోడ్డు కింద భూములు కోల్పోయే రైతులకు పరిహారంగా అతి తక్కువగా అందుతోంది. ఇదే విషయంపై రైతులు కోర్టులకు కూడా వెళ్లారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న అన్నదాతలకు నష్టం జరగకుండా ఉండాలని నిర్ణయించింది. అందుకోసమే ఆర్బిట్రేషన్ విధానంలో రైతులకు పరిహారం ధరలను పెంచాలని భావిస్తోంది. మరోవైపు పరిహారం ధరల పెంపు అంశంతో పాటు, అలైన్‌మెంట్ మార్పుపై కోర్టులో దాఖలైన పలు కేసులు ఇటీవల వెకేట్ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. పరిహారం పెంపు అంశం తేలితే.. రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం అయినట్టేనని అధికారిక వర్గాలు అంటున్నాయి.

ఉచితంగా సన్నబియ్యం!

2.81 కోట్ల మంది కార్డుదారులకు అందజేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం

రేపటి మంత్రి వర్గ భేటీలో తుది నిర్ణయం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద, దిగువ మధ్య తరగతి వర్గాల కోసం చారిత్రక నిర్ణయం తీసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా సన్నం బియ్యం అందించాలని యోచిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ప్రస్తుతం కిలో బియ్యం రూ.1చొప్పున పంపిణీ చేస్తున్నారు. అంటే.. ఒక కుటుంబంలో 5 మంది సభ్యులుంటే.. ఒకొక్కరికీ 6 కిలోల చొప్పున 30కిలోల బియ్యానికి వినియోగదారులు రూ.30 చెల్లిస్తున్నారు. మిగతా మొత్తన్ని ప్రభుత్వమే భరిస్తోంది. అయితే, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం తినడానికి అనువుగా ఉండడం లేదు. రేషన్‌కార్డుదారుల్లో దాదాపు 85శాతం మంది ఆ బియ్యాన్ని కిలోకు రూ.10చొప్పున బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని, సన్న బియ్యం కొనుక్కుంటున్నారు. ఆ బియ్యాన్ని



మరింతగా పాలిష్ చేసి, సన్న బియ్యంగా మార్చడం ద్వారా దళారులు భారీగా లాభపడుతున్నారు. అయితే, రేషన్‌కార్డుదారులకు దొడ్డు బియ్యం బదులుగా సన్న బియ్యం ఇస్తే.. నూటికి నూరు శాతం మంది తినడానికి వినియోగించుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. అది కూడా ఉచితంగా ఇస్తే పేదలకు ఉపయోగకరంగా ఉండడంతోపాటు సర్కార్‌కు మంచి పేరు వస్తుందన్న ఆలోచనలో ఉంది. ఈ నిర్ణయంతో బహిరంగ మార్కెట్‌లో మేలిమి రకం సన్న బియ్యం ధరలు సైతం దిగొస్తాయని అంచనా వేస్తోంది. ప్రస్తుత వానాకాలంలో పండిన సూపర్ ఫైన్ బియ్యాన్నే రేషన్ షాపుల్లో పంపిణీ చేయాలని యోచిస్తోంది. పండిన ధాన్యాన్ని వెంటనే మిల్లింగ్ చేస్తే బియ్యం నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. కనీసం రెండు నెలల పాటు నిల్వ చేశాకే ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించడానికి కొంత సమయం పట్టనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు, కొత్త రేషన్ కార్డుల జారీపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సన్న బియ్యం పథకాన్ని వెంటనే ప్రారంభిస్తారా? లేక కొత్త కార్డులు జారీ చేసి.. ఆ తర్వాత మొదలు పెడతారా? అన్నదానిపై మంత్రివర్గ భేటీలో నిర్ణయం తీసుకోనున్నారు.

కొత్త కార్డుల జారీతో ఏటా
1451.16కోట్ల అదనపు వ్యయం

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83,03,612 కుటుంబాలుంటే.. 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) ప్రకారం 1,03,95,629 కుటుంబాలు ఉన్నట్లు తేలింది. తాజాగా ఆ సంఖ్య 1,11,23,323కు పెరిగి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మరోవైపు.. 2011 నాటి లెక్కల ప్రకారం తెలంగాణలో 3,52,89,674 మంది ఉంటే.. 2,81,70,993 మంది రేషన్‌కార్డు దారులుగా ఉన్నారు. అయితే, రాష్ట్రంలో ఇప్పటికే జారీ అయిన కార్డుల్లో కొత్త సభ్యుల(16,36,687 మంది) చేరికకు సంబంధించి 11,33,881 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను యథాతథంగా ఆమోదిస్తే ఏటా రూ.495.12కోట్లు అదనంగా ఖర్చవుతుందన్న అంచనాలున్నాయి. ఇక, కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తుల (31.60 లక్షల మందికి సంబంధించి)ను ఆమోదిస్తే ఏటా రూ.956.04 కోట్ల మేర అదనపు వ్యయం కానుంది. అంటే కొత్త కార్డుల జారీ, కొత్త సభ్యుల చేరికతో ప్రభుత్వంపై ఏటా రూ.1451.16కోట్ల అదనపు భారం పడనుంది.

మీ అవినీతి చూస్తే సిగ్గేస్తోంది!

ఏసీబీకి పట్టిస్తా.. మీ సంగతి చూస్తా!.. ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోరా?

- సస్పెండ్ చేస్తే మళ్లీ 4 నెలల్లో ఉద్యోగంలో చేరొచ్చనుకుంటున్నారేమో.. ఆటలు సాగనివ్వను!
- మళ్లీ ఉద్యోగంలో చేరకుండా చూస్తా
- తిన్న అవినీతి సొమ్మునంతా కక్కిస్తా
- రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు మంత్రి పొంగులేటి హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): "రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అవినీతిని చూస్తే సిగ్గేస్తోంది. ఎన్ని సార్లు చెప్పినా మీరు మారడం లేదు. ఇంకొన్ని రోజులు చూస్తా. తీరు మార్చుకోకపోతే నేనే ఏసీబీకి పట్టిస్తా. మీ సంగతి చూస్తా. మళ్లీ ఉద్యోగంలోకి రాకుండా బయట నిలబెడతా" అని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ గురించి మాట్లాడాలంటేనే సిగ్గేస్తోందని, ఇకనైనా మారాలని, ప్రజలకు మేలు చేసేలా పని చేయాలని మంత్రి హితవు పలికారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది ఆగస్టు 25న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా తానే సమావేశం అయ్యానని పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్లు, ఉన్నతాధికారులు అంతా సమావేశానికి వచ్చారని.. అప్పుడు అవినీతికి తావు లేకుండా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పానన్నారు. ఉద్యోగుల సంక్షేమం, పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. కానీ, బదిలీల అనంతరం పోస్టింగులు వేశాక సబ్‌రిజిస్ట్రార్ల నుంచి కొందరు డబ్బులు వసూలు చేశారనే విమర్శలు వచ్చాయి. పారదర్శకంగా బదిలీలు చేయాలని ప్రభుత్వం భావించినా పాత వాసనలు వదులుకోలేని కొందరు ఉద్యోగులు.. బదిలీల్లో కొత్త స్థానాలకు వచ్చిన వారి నుంచి వసూళ్లు చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై జిల్లాల వారీగా విజిలెన్స్ నివేదికలు తెప్పించుకున్న మంత్రి పొంగులేటి.. వసూళ్లకు పాల్పడిన వారి సమాచారం సేకరించారు. కొంతమందిపై వేటు వేశారు. అయినా అవినీతి ఆరోపణలు రావడం, శాఖాపరంగా చర్యలు తీసుకోవాల్సిన వారు నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడంతో సమావేశంలో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఓ వైపు శాఖాపరమైన ఆదాయ లక్ష్యాలను వదిలేసి కొందరు అధికారులు అవినీతి కార్యకలాపాలకే పరిమితం అవుతున్నారంటూ చురకలంటించారని సమాచారం.

ప్రతిపాదనలివ్వడానికి
ఇన్ని నెలలా?



అవినీతిని నిలువరించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవసరమైన ప్రతిపాదనలు కావాలని చెప్పినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒక చిన్న పని చేయడానికి ఇన్ని నెలలు అవసరమా అని అధికారులను నిలదీసినట్లు తెలిసింది. అవినీతికి అడ్డుకట్ట వేయకుండా, ప్రజలకు మెరుగైన సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం. ఏసీబీకి స్వయంగా తానే అవినీతి అధికారుల వివరాలను పంపుతానని, మళ్లీ వాళ్లు ఉద్యోగంలోకి రాకుండా చూస్తానని, వారి ఆస్తులను రికవరీ చేయిస్తానని తీవ్రంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఏసీబీకి పట్టుబడి సస్పెండైతే మళ్లీ నాలుగు నెలల్లో ఉద్యోగంలో చేరొచ్చని అనుకుంటే పొరపాటేనని, అలాంటి వారి ఆటలు సాగనివ్వనని, తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తానని మంత్రి హెచ్చరించడంతో అధికారుల్లో వణుకు మొదలైంది. ప్రతి నెలా విజిలెన్స్ నివేదికలు తెప్పించుకుని పరిశీలిస్తున్నానని, పద్ధతి మార్చుకోకుండా ఇలాగే వ్యవహరిస్తే కొద్ది రోజుల్లోనే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేసినట్లు తెలిసింది.

బెట్టింగ్‌తో అప్పులపాలై.. డ్రగ్స్ దందాలోకి

- డ్రగ్స్ విక్రయిస్తుండగా హైదరాబాద్‌లో ప్లాస్టిక్ వ్యాపారి అరెస్ట్
- అతని వద్ద నుంచి కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్న ఓ వ్యాపారి... ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు డ్రగ్స్ దందాలోకి దిగాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉండే ఝూవర్ కిషన్ గోపాల్ (27) ప్లాస్టిక్ వ్యాపారి. బెట్టింగ్‌కు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకొని ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. స్నేహితులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చాలన్న ఉద్దేశంతో స్నేహితుల సూచన మేరకు ముంబై నుంచి నగరానికి డ్రగ్స్ తెచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ముంబైలో ఓ నైజీరియన్‌ను సంప్రదించి.. అక్కడకు వెళ్లాడు. అతడి నుంచి కొకైన్, ఎండీఎంఏ కొని నగరానికి తిరిగొచ్చాడు. అయితే కొత్త సంవత్సరం సందర్భంగా కస్టమర్లకు డ్రగ్స్ విక్రయిస్తుండగా వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, మాసబ్‌ట్యాంక్ పోలీసులు కలిసి గోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 30 గ్రాముల కొకైన్, 6 గ్రాముల ఎండీఎంఏ, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

వీక్షణం, బ్రహ్మ కుమారీల స్టాళ్లపై దాడులు హేయం: హెచ్‌పీఈ

మన్సూరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వీక్షణం, బ్రహ్మ కుమారీల స్టాళ్లపై కొందరు వ్యక్తులు చొరబడి దాడులు చేయడం హేయమని హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఇక్వాలిటీ (హెచ్‌పీఈ) సంస్థ అధ్యక్షుడు సాధు త్రినాథ్ దాస్, ప్రధానకార్యదర్శి రమణమూర్తి పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మన్సూరాబాద్‌లోని ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ, హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'తిరుపతి బౌద్ధ క్షేత్రమే' అనే శీర్షికతో ఉన్న పుస్తకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్‌పై దురుసుగా ప్రవర్తించి, బెదిరింపులకు పాల్పడటం అన్యాయమని అన్నారు. అదే విధంగా అక్కడే స్టాల్ ఏర్పాటు చేసిన బ్రహ్మకుమారీలపై ఇదే తరహాలో ప్రవర్తించారని, స్టాల్‌ను ఎత్తేయాలంటూ దాడులకు పాల్పడ్డారని తెలిపారు. వెంటనే ఈ చర్యలకు పాల్పడ్డ వారిపై తగిన చర్యలు తీసుకుని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని త్రినాథ్ దాస్, రమణమూర్తి కోరారు.

అక్రమంగా ఓటర్ ఐడీల డౌన్‌లోడ్

- తెలంగాణ యూత్ కాంగ్రెస్‌పై ఈసీకి బక్క జడ్సన్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత ఎన్నికల కోసం తెలంగాణ యూత్ కాంగ్రెస్ నేతలు ఓటర్ల ఐడీలను చట్ట విరుద్ధంగా డౌన్‌లోడ్ చేశారని ఆ పార్టీ బహిష్కృత నేత బక్క జడ్సన్ గురువారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘాని (ఈసీ)కి ఫిర్యాదు చేశారు. ఓటర్లకు తెలియకుండా 8.5 లక్షల ఓటర్ ఐడీలను డౌన్‌లోడ్ చేసుకుని వాటితో నకిలీ ఓటర్ కార్డులు సృష్టించి యూత్ కాంగ్రెస్ ఎన్నికల కోసం వాడుకున్నారని ఆరోపించారు. అలాగే ఆయన ఈసీకి సమర్పించిన మరో ఫిర్యాదులో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ కాంగ్రెస్ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తెలంగాణ ప్రజల్ని మోసం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచాక డిక్లరేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి విస్మరించారని ఈసీకి తెలిపారు. తన ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బక్క జడ్సన్ ఎన్నికల కమిషన్‌ను కోరారు.

మళ్లీ సాగునీటి సంఘాలు!

చెరువుల కింద నియమించాలని రైతు సంక్షేమ కమిషన్ ప్రతిపాదనలు

- నామినేషన్ విధానమా? ఎన్నికలా?.. సర్కార్ కసరత్తు
- మార్గదర్శకాల బాధ్యతనుకమిషన్‌కే అప్పగించిన ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ సాగునీటి వినియోగ సంఘాల వ్యవస్థ తెరమీదికి వచ్చింది. ప్రతీ చెరువు కింద ప్రత్యేకంగా సాగునీటి సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలపై ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేస్తోంది. ఈ పాలక మండళ్లను నామినేషన్ విధానంలో భర్తీ చేయాలా? లేక ఎన్నికల విధానంలో నియమించాలా? అనే దానిపై సమాలోచనలు జరుపుతోంది. ఇక ప్రభుత్వమే చెరువు కింద రైతులతో సంఘాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్వహణకు ప్రత్యేకంగా నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవస్థ ఉండగా.. గత పదేళ్ల పాటు చెరువుల నిర్వహణను పట్టించుకోలేదని, ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయాలని కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తాజాగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్రంలో 46,531 వేలకు పైగా చెరువులు ఉన్నాయి. వాటి కింద 25.11 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వం చాలా చెరువులను భారీ, మధ్య తరహా ప్రాజెక్టులకు అనుసంధానం చేసి, వాటిని నీటితో నింపింది. అయితే చెరువుల నిర్వహణ మాత్రం నిరాశజనకంగానే ఉంది. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పునరుద్ధరణ చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ను నియమించారు. ప్రత్యేకంగా చెరువుల నిర్వహణ కోసం సాగునీటి వినియోగ సంఘాలు ఏర్పాటు చేయాలని ఈ కమిషన్ సర్కార్‌కు నివేదించింది. ప్రభుత్వమే చెరువుల వారీగా రైతుల వివరాలను సేకరించి, సాగు చేసే రైతులతో పాలక మండళ్ల ఏర్పాటు చేయాలని సూచించింది. 2025 సంవత్సరాన్ని చెరువుల సంవత్సరంగా ప్రకటించి, రాష్ట్రవ్యాప్తంగా చెరువులతో పాటు వాటి తూములు, కట్టలు, కాలువలను మరమ్మతు చేసే ప్రక్రియ చేపట్టాలని రైతు కమిషన్ సర్కారుకు ప్రతిపాదనలు చేసింది. రాష్ట్రంలో కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీల కాలంలో ఉన్న గొలుసు కట్టు చెరువుల విధానం దెబ్బతిందని, చెరువుల ప్రాంతాలు అక్రమణలకు గురయ్యాయని రైతు కమిషన్ పేర్కొంది. పలు ప్రాంతాల్లో చెరువులను అక్రమించి లేఔట్లు వేశారని, చెరువులకు నీటిని తీసుకెళ్లే కాలువలు కూడా ఆక్రమణకు గురయ్యాయని, ఈ నేపథ్యంలో చెరువుల పునరుద్ధరణ, రక్షణ, మరమ్మతులు వంటి కార్యకలాపాలు చేపట్టడానికి 2025 సంవత్సరాన్ని చిన్న నీటిపారుదల సంవత్సరంగా ప్రకటించాలని కోరింది. అయితే, సాగునీటి సంఘాల ఏర్పాటుపై మరింత కసరత్తు చేసి, తుది మార్గదర్శకాలు రూపొందించి నివేదికను అందించాలని రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డికి ప్రభుత్వం సూచించినట్లు సమాచారం.


చెరువులను రక్షించుకోవాలి

రాష్ట్రంలోని చెరువుల రక్షణ కోసం సాగునీటి వినియోగ సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. చెరువుల వారీగా సాగు చేసే రైతుల వివరాలు సేకరించి, ప్రభుత్వం పాలకమండళ్లను నియమించాలి. చెరువుల పునరుద్ధరణ కోసం 2025ను మైనర్ ఇరిగేషన్ ఇయర్‌గా ప్రకటించాలని కోరాం. కర్ణాటకలో ఈ విధానం సఫలీకృతమయింది. చెరువుల నిర్వహణకు సాగునీటి సంఘాలు ఉపయుక్తంగా ఉంటాయి.

-కోదండరెడ్డి, ఛైర్మన్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్

ఏపీలో మెట్రో దిశగా అడుగులు

- 2 వేల కోట్లతో రోడ్డు కమ్ మెట్రో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు
- తొలి విడతలో విజయవాడలో 4.7 కి.మీ.. విశాఖలో 4 కి.మీ.
- మెట్రో రైలుపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి, విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టుల్లో రూ.2వేల కోట్ల వ్యయంతో రోడ్డు కమ్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. విజయవాడలో 66 కి.మీ మేర, విశాఖపట్నంలో 76.90 కి.మీ మేర చేపట్టబోయే మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు ఆమోదించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల అంశంపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ స్థితిగతులను వివరించారు. 2017లో వచ్చిన కొత్త మెట్రో పాలసీ ప్రకారం రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టులకు ఫండింగ్ అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. 2017 వరకు నూరు శాతం నిధులు కేంద్రం భరించే విధానం లేదు. అయితే 2017 పాలసీ ప్రకారం వంద శాతం ఈక్విటీ కేంద్రమే చెల్లిస్తూ కోల్‌కతాలో రూ.8,565 కోట్లతో 16 కి.మీ మేర మెట్రో ప్రాజెక్టు చేపట్టింది. ఈ తరహాలో ఏపీలో కూడా మెట్రో ప్రాజెక్టులు చేపట్టే అంశంపై కేంద్రంతో చర్చించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఏపీ పునర్విభజన చట్టంలో కూడా రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు ఉందని అన్నారు. లేదంటే 2017 మెట్రో పాలసీ ద్వారానైనా కేంద్రం సాయం చేయాలన్నారు. ఈ రెండింటిలో ఏదో ఒక దాని ప్రకారం పూర్తి ఖర్చు కేంద్రం భరించేలా సంప్రదింపులు జరుపుతామని చెప్పారు.

రెండు చోట్ల డబుల్ డెక్కర్...

మెట్రో ప్రాజెక్టులో భాగంగా విజయవాడలో ఎన్‌హెచ్-16పై నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు 4.7 కి.మీ., విశాఖపట్నంలో గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు 4 కిమీ. మేర రోడ్డు కమ్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. నాలుగేళ్లలో రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

సుదీర్ఘకాలం విచారణా?

(మొదటిపేజీ తరువాయి)

కేసులో అరెస్టయి జైలులో ఉన్న తిరుపతన్న.. తనకు బెయిల్ మంజూరు చేయాలని తొలుత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ తిరస్కరణకు గురి కావడంతో గతేడాది అక్టోబర్ 20న సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. రాష్ట్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసుపై గురువారం జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే హాజరయ్యారు. సిదార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ కోర్టు ఆదేశాల మేరకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న కీలక నిందితుడని చెప్పారు. ట్యాపింగ్‌కు పాల్పడడంతో పాటు సాక్ష్యాలను ధ్వంసం చేయడంలో కీలకంగా వ్యవహరించారని అన్నారు. గత ప్రభుత్వ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, న్యాయమూర్తుల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగానే ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేశారని వివరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపిస్తూ తిరుపతన్న తొమ్మిది నెలలుగా జైలులో ఉన్నారని, ఆయన పాత్రపై ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని తెలిపారు. ఇంకా జైలులో ఉంచడం సరికాదని చెప్పారు. తప్పనిసరైతేనే జైలులో ఉంచాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణకు ఇంకెంత కాలం పడుతుందో రాతపూర్వకంగా తమకు తెలపాలని, తిరుపతన్న పాత్రపై ఇప్పటి వరకు చేసిన దర్యాప్తు వివరాలు సమర్పించాలని అడిగింది. లూథ్రా సమాధానం చెబుతూ విచారణ పూర్తయ్యేందుకు మరో నాలుగు నెలలు సమయం పడుతుందని తెలిపారు. అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 27కు కోర్టు వాయిదా వేసింది.

కర్రతో చితక్కొట్టి.. ఆపై ఉరివేసి

(మొదటిపేజీ తరువాయి)

పలుసార్లు పంచాయితీలు జరిగాయి. అయినా అమరేంద్రబాబు వ్యవహారశైలిలో మార్పు రాకపోగా, వేధింపులు మరింత పెరిగాయి. అమరేంద్రబాబు, అరుణల మధ్య కొత్తపాలెంలో గత నెల 31న (మంగళవారం) తీవ్ర ఘర్షణ జరిగింది. ఏళ్లుగా ఓపిక పడుతూ వస్తున్న అరుణ తన భర్తపై కర్రతో తీవ్రంగా దాడి చేసి అక్కడే చంపేసింది. ఈ హత్యపై మృతుడి తండ్రి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో వివరాల మేరకు అరుణ తన భర్తను కర్రతో కొట్టి చంపినట్లు పోలీసులు భావించారు. అయితే తన భర్తను తీవ్రంగా కర్రతో కొట్టిన తర్వాత కూడా అరుణ కోపం చల్లారలేదు. అమరేంద్రను నడిరోడ్డుపైకి లాక్కొచ్చి ఉరివేసి, మెడపై కాలువేసి అదిమిపట్టి చంపినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయింది. దీంతో ఈ దారుణ ఘటన తీవ్ర చర్చకు దారి తీసింది. వైరల్ అయిన వీడియో దృశ్యాల ఆధారంగా కేసులో సెక్షన్ల నమోదుపై పోలీసులు పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.